
'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 | వెల: ₹ 5.50

సంపుటి: 15 | సంచిక: 269

మంగళవారం 20-12-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


స్వాగతం..
సుస్వాగతం...
బడుగు బలహీన వర్గాల ఆశాకిరణం, మన యువనేత,
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
గౌ॥ శ్రీ వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి గారు
నేడు దర్శి నియోజకవర్గానికి
విచ్చేయుచున్న శుభసందర్భంగా వారికి
మా స్వాగతం.. సుస్వాగతం...
Happy Birthday
in Advance
to
Sri YS Jagan Mohan Reddy Garu
The Young & Energetic Chief Minister of
Andhra Pradesh
21st DEC
Advanced Happy Birthday Jagananna
BUCHEPALLI VENKAYAMMA SUBBA REDDY
ENGINEERING COLLEGE
Chimakurthy, Prakasam District. A.P
SRI SURYA GRANITES
Chimakurthy, Prakasam District. A.P.



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 269

మంగళవారం 20-12-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి బిజినెస్
మంగళవారం
20-12-2022

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
468	151
61,806	18,420

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	10,585	▽	122
డోజోన్స్	32,866	▲	54
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,361	▲	29
డాక్స్	13,943	▲	50
షాంఘై	3,107	▽	61
నికాయ్	27,238	▽	289

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	54,248
బంగారం (99.5 స్వచ్ఛత)	54,031
వెండి (కిలో)	66,898

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.05	83.74
£	యూరో	ఎస్‌బీఐ	86.39	89.48
€	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	99.35	102.71
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	59.88	61.80
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.56	56.90
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.12	62.08
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.06	22.73
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.62	23.42
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.74	12.76

హెచ్‌డీఎఫ్‌సీ రుణ రేటు 0.35 శాతం పెంపు



ముంబై: గృహ రుణాలకు సంబంధించి దిగ్గజ సంస్థ– హెచ్‌డీఎఫ్‌సీ రుణ రేటు భారీగా 35 బేసిస్ పాయింట్లు లేదా 0.35 శాతం (100 బేసిస్ పాయింట్లు ఒకశాతం) పెరిగింది. దీనితో ఈ రేటు 8.65 శాతానికి ఎగసింది. పెరిగిన రేటు మంగళవారం నుంచి అమల్లోకి వస్తుందని బ్యాంక్ ప్రకటన తెలిపింది. మే నెల నుంచి హెచ్‌డీఎఫ్‌సీ రుణ రేటు 225 బేసిస్ పాయింట్లు పెరిగింది. కాగా, 800 అంతకంటే ఎక్కువ క్రెడిట్ స్కోర్ ఉన్న రుణగ్రహీతలకు మాత్రమే 8.65 శాతం కొత్త రేటు అందుబాటులో ఉంటుందని హెచ్‌డీఎఫ్‌సీ తెలిపింది. బ్యాంకింగ్ పరిశ్రమలో ఇదే అత్యల్ప రేటు అని కూడా వివరించింది.

డుకాటీ ధరలు పెరగనున్నాయ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇటాలియన్ సూపర్ బైక్స్ తయారీ సంస్థ డుకాటీ అన్ని మోడళ్ల ధరలను పెంచుతోంది. జనవరి 1 నుంచి కొత్త ధరలు అమలులోకి రానున్నాయి. ఎంత శాతం సవరిస్తుందన్న విషయాన్ని కంపెనీ వెల్లడించలేదు. ముడి సరుకు వ్యయాలు, తయారీ, రవాణా ఖర్చులు అధికం కావడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్టు కంపెనీ సోమవారం ప్రకటించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-12-2022	
విశాఖ	547-00
చిత్తూరు	543-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	534-00
విజయవాడ	534-00
రిటైల్ ధర (డజను)	78.00
19-12-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	524-00
వరంగల్	526-00
రిటైల్ ధర	5.80

బ్యాంకింగ్ అవుట్‌లుక్ 'పాజిటివ్'

అప్‌గ్రేడ్ చేసిన ఇక్రా • ఎన్‌పీఏలు మరింత తగ్గుతాయని విశ్లేషణ

ముంబై: బ్యాంకింగ్ రంగం అవుట్‌లుక్‌ను దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా సోమవారం 'పాజిటివ్'కు అప్‌గ్రేడ్ చేసింది. రుణ నాణ్యత పెరుగుదల, మూలధన పటిష్టతలు తన అవుట్‌లుక్ పెంపునకు కారణమని వివరించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2023 ఏప్రిల్–2024 మార్చి) చివరికల్లా స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏలు) ఈ దశాబ్ద కనిష్ట స్థాయి.. 4 శాతానికి దిగివస్తాయని విశ్వసిస్తున్నట్లు ఇక్రా పేర్కొంది. ప్రస్తుత 2022–23లో బ్యాంకింగ్ రుణ వృద్ధి 15.2 శాతం ఉంటే, 2023–24 నాటికి ఈ రేటు 11 నుంచి 11.6 శాతానికి దిగివస్తుందన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చింది. ప్రభుత్వ రంగం బ్యాంకుల రుణ వృద్ధి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రుణవృద్ధి 13.4–14.1 శాతం శ్రేణిలో ఉంటే, 2022–23లో ఈ రేటు 9.5–10.1 శాతం శ్రేణికి దిగివస్తుందని ఇక్రా అంచనావేసింది. ప్రైవేటు రంగ బ్యాంకింగ్ విషయంలో ఈ రేటు 14.5–15.5 శాతం శ్రేణి నుంచి 12.6–13.5 శాతం శ్రేణికి దిగివస్తుందని విశ్లేషించింది. వడ్డీరేట్ల పెరుగుదల, ఆర్థిక అనిశ్చితి దీనికి కారణంగా పేర్కొంది. 2023–24 నాటికి రుణ పునర్వ్యవస్థీకరణ 1 శాతం లోపునకు దిగివస్తుందని అంచనావేసింది. బ్యాంకింగ్ నికర వడ్డీ మార్జిన్లు 2023–24లో భారీగా తగ్గే అవకాశం ఉందని పేర్కొంది. దీనికి డిపాజిట్ రేటు భారీ పెంపు అవకాశాలను కారణంగా చూపింది. అయితే అధిక రుణ విలువలు బ్యాంకింగ్ పటిష్టతకు దోహదపడుతుందని విశ్లేషించింది. చక్కటి లాభదాయకత ద్వారా బ్యాంకింగ్ స్వయంగా మూలధన అవసరాలను తీర్చుకోగలుగుతాయని, ఈ విషయంలో ప్రభుత్వంపై పెద్దగా ఆధారపడాల్సిన అవసరం ఉండదని పేర్కొంది.



మూడు వారాల్లో అతిపెద్ద లాభం

- కలిసొచ్చిన షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు
- యూరప్ మార్కెట్ల నుంచి సానుకూలతలు
- రెండు రోజుల వరుస నష్టాలకు బ్రేక్
- సెన్సెక్స్ 468 పాయింట్లు ప్లస్
- 18,400 పైకి నిఫ్టీ



ముంబై: బ్యాంకింగ్, ఇంధన, ఎఫ్‌ఎంసీజీ షేర్లు పరుగులు తీయడంతో స్టాక్ సూచీలు మూడు వారాల్లోనే అతిపెద్ద ఒకరోజు లాభాన్ని సోమవారం నమోదు చేశాయి. యూరప్ మార్కెట్లలో నెలకొన్న సానుకూల సంకేతాలు ర్యాలీకి దన్నుగా నిలిచాయి. గతవారంలో నష్టాలను చవిచూసిన సూచీలు ఈ వారం అతి స్వల్ప ఫ్లాట్‌గా ట్రేడింగ్ ప్రారంభించాయి. ఆసియా మార్కెట్ల రికవరీ, యూరప్ మార్కెట్ల సానుకూల వార్తలతో సూచీలు రోజంతా పటిష్టమైన లాభాలతో దూసుకెళ్లాయి. సెన్సెక్స్ ఉదయం 61,405 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 507 పాయింట్లు బలపడి 61,845 గరిష్టాన్ని తాకింది. చివరికి 468 పాయింట్ల పెరిగి 61,806 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 151 పాయింట్లు ర్యాలీ చేసి 18,420 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో 163 పాయింట్లు పెరిగి 18432 వద్ద గరిష్ట స్థాయిని తాకింది. వచ్చే ఏడాది(2023)లో అమెరికా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ) వృద్ధి నెమ్మదించే అవకాశాలు ఉండొచ్చనే అంచనాలతో ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అలాగే ప్రభుత్వరంగ బ్యాంక్స్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ అరశాతం, స్మాల్ సూచీ 0.30% చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.538 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.687 కోట్ల ఈక్విటీలను కొనుగోలు చేశారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- కెఫిన్ టెక్నాలజీస్ పబ్లిక్ ఇష్యూకు తొలిరోజు 55 శాతం స్పందన లభించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ 2.27 కోట్ల షేర్లను జారీ చేయగా, 1.29 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.
- గడిచిన నెలరోజుల్లో నైకా విక్రయాలు భారీగా తగ్గిపోవడం ఈ కంపెనీ షేరుపై ప్రతికూల ప్రభావాన్ని చూపింది. బీఎస్‌ఈ ఇంట్రాడేలో నాలుగు శాతానికి పైగా పతనమై రూ.158 వద్ద జీవితకాల కనిష్టానికి దిగివచ్చింది. ఆఖరికి మూడుశాతం నష్టంతో రూ.163 వద్ద స్థిరపడింది.

మహిళా స్టార్టప్‌లపై గూగుల్ ఫోకస్

- 75 మిలియన్ డాలర్ల పెట్టుబడులు
- 100 భారతీయ భాషల్లో వాయిస్, టెక్స్ట్ సెర్చ్‌పై కసరత్తు
- సీఈవో సుందర్ పిచాయ్ వెల్లడి



న్యూఢిల్లీ: దేశీయంగా మహిళల సారథ్యంలో నడిచే స్టార్టప్‌లలో పెట్టుబడులు పెట్టడంపై టెక్ దిగ్గజం గూగుల్ మరింతగా దృష్టి పెట్టనుంది. 75 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేయనుంది. అలాగే, 100 పైచిలుకు భారతీయ భాషల్లో వాయిస్, టెక్స్ట్ సెర్చ్‌ను సపోర్ట్ చేసే వ్యవస్థపై కసరత్తు చేస్తోంది. భారత పర్యటనకు వచ్చిన గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ ఈ విషయాలు వెల్లడించారు. భారతీయ స్టార్టప్స్‌లో 300 మిలియన్ డాలర్లు పెట్టుబడులు పెడుతున్నట్లు, ఇందులో నాలుగో వంతు భాగం (సుమారు 75 మిలియన్ డాలర్లు) మహిళల సారథ్యంలోని ప్రారంభ దశ అంకుర సంస్థల్లో ఇన్వెస్ట్ చేయనున్నట్లు గూగుల్ ఫర్ ఇండియా 2022 కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన వివరించారు.

భారీ స్థాయిలో విస్తరించిన టెక్నాలజీ .. ప్రపంచవ్యాప్తంగా అందరి జీవితాలను స్పృశిస్తున్న నేపథ్యంలో నియంత్రణలనేవి బాధ్యతాయుతమైనవిగా, సమతూకం పాటించేవిగా ఉండాలని పిచాయ్ పేర్కొన్నారు. ఎగుమతుల విషయంలో భారత్ అతి పెద్ద దేశంగా ఎదగగలదని ఆయన తెలిపారు. ఇంటర్నెట్‌ను చౌకగా అందుబాటులోకి తెచ్చేందుకు 2020లో గూగుల్ 10 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 75,000 కోట్లు)తో ఇండియా డిజిటైజేషన్ ఫండ్ (ఐడీఎఫ్) ప్రకటించిన సంగతి తెలిసిందే. దీని ద్వారా ఇప్పటికే 4.5 బిలియన్ డాలర్లతో జియోలో 7.73 శాతం, భారతి ఎయిర్‌టెల్‌లో 700 మిలియన్ డాలర్లతో 1.2 శాతం వాటాలను గూగుల్ కొనుగోలు చేసింది.

ప్రధాని, రాష్ట్రపతితో భేటీ ..

పర్యటన సందర్భంగా పిచాయ్ కేంద్ర టెలికం, ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్, ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిశారు. 'మీ సారథ్యంలో భారత్ సాంకేతిక రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతుండటం స్ఫూర్తిదాయకమైన విషయం' అని మోదీతో భేటీ అనంతరం పిచాయ్ ట్వీట్ చేశారు. సమావేశంలో ఏయే అంశాలు చర్చించారనేది వెల్లడించలేదు. అయితే, 'గూగుల్ చిన్న వ్యాపారాలు .. స్టార్టప్‌లకు మద్దతుగా నిలవడం, సైబర్ సెక్యూరిటీలో ఇన్వెస్ట్ చేయడం, విద్య..నైపుణ్యాల్లో శిక్షణ కల్పించడం, వ్యవసాయం.. ఆరోగ్య సంరక్షణ వంటి రంగాల్లో కృత్రిమ మేథను వినియోగిస్తుండటం వంటి అంశాల' పై ప్రధానితో చర్చించనున్నట్లు పిచాయ్ తన బ్లాగ్‌లో పేర్కొన్నారు. అలాగే, స్పీచ్ టెక్నాలజీ, వాయిస్, వీడియో సెర్చ్ సహా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పలు ప్రాజెక్టులను బ్లాగ్‌లో ప్రస్తావించారు. తాను భారత్‌లో పర్యటించిన ప్రతిసారి భారత స్టార్టప్ వ్యవస్థ గణనీయంగా మెరుగుపడుతుండటాన్ని గమనిస్తున్నానని ఆయన తెలిపారు.

'మీతో నవకల్పనలు, టెక్నాలజీ వంటి ఎన్నో విషయాలను చర్చించడం సంతోషం కలిగించింది. మానవజాతి పురోగతికి, సుస్థిర అభివృద్ధికి టెక్నాలజీని వినియోగించడంలో ప్రపంచ దేశాలు కలిసి పని చేయడం చాలా ముఖ్యం'.

\- ప్రధాని మోదీ ట్వీట్

గూగుల్ ఫర్ ఇండియా కార్యక్రమం సందర్భంగా తమ అనువాదం, సెర్చ్ టెక్నాలజీ సేవలను మెరుగుపర్చుకునేందుకు దేశవ్యాప్తంగా 773 జిల్లాల నుంచి స్పీచ్ డేటాను సేకరించేందుకు బెంగళూరు కేంద్రంగా పనిచేసే ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌తో జట్టు కట్టినట్లు గూగుల్ తెలిపింది. అలాగే ఐఐటీ మద్రాస్‌లో ఏఐ సెంటర్ ఏర్పాటు కోసం 1 మిలియన్ డాలర్ల గ్రాంటును అందించనున్నట్లు పేర్కొంది. వ్యవసాయ రంగానికి సంబంధించి అధునాత టెక్నాలజీలపై పని చేసేందుకు గూగుల్‌డాట్‌ఆర్గ్ ద్వారా వాధ్వానీ ఏఐకి 1 మిలియన్ గ్రాంటు అందిస్తున్నట్లు గూగుల్ వివరించింది.

విప్రో చేతికి నిరాపరా

కేరళ మసాలా దినుసుల కంపెనీ



న్యూఢిల్లీ: ప్యాకేజ్డ్ ఫుడ్, మసాలా దినుసుల విభాగంలోకి ప్రవేశిస్తున్నట్లు ప్రయివేట్ రంగ కంపెనీ విప్రో కన్జూమర్ కేర్ తాజాగా వెల్లడించింది. ఇందుకు వీలుగా సుగంధ ద్రవ్యాల కంపెనీ నిరాపరాను కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొంది. కేరళలో అత్యధికంగా విక్రయమవుతున్న సంప్రదాయ ఆహార బ్రాండ్ల సంస్థ నిరాపరాను సొంతం చేసుకునేందుకు తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలియజేసింది. వెరసి ఎఫ్‌ఎంసీజీ దిగ్గజాలు డాబర్, ఇమామీ, టాటా కన్జూమర్ ప్రొడక్ట్స్, ఐటీసీ సరసన చేరనున్నట్లు పేర్కొంది. 1976లో ప్రారంభమైన నిరాపరా మిశ్రమ మసాలా దినుసులకు పేరొందింది. ఈ బ్రాండు పలు రకాల మిశ్రమ దినుసులతోపాటు.. విభిన్న అప్పడాల తయారీలో వినియోగించే బియ్యపు పిండినీ రూపొందిస్తోంది. ప్రస్తుతం కంపెనీ బిజినెస్ కేరళలో 63 శాతం, గల్ఫ్ దేశాల నుంచి 29 శాతం నమోదవుతున్నట్లు విప్రో ఎంటర్‌ప్రైజెస్ ఈడీ వినీత్ అగర్వాల్ వెల్లడించారు.

ఈ వార్తల నేపథ్యంలో విప్రో షేరు యథాతథంగా రూ. 390 వద్ద ముగిసింది.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం ఇండియన్ పాలిటీ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరులో 22 పోస్టులు

ఏపీ పంచాయతీ రాజ్ శాఖ, ఏలూరు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో.. అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన మండల డేటాఎంట్రీ ఆపరేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 22
- **అర్హత:** బీఎస్సీ(కంప్యూటర్స్)/బీసీఏ/ఎంసీఏ/బీటెక్ (సీఎస్‌ఈ/ఈసీఈ/ఈఈఈ) ఉత్తీర్ణులై ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.10,000 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.12.2022
- **వెబ్‌సైట్:** www.prelururect.in

వైఎస్సార్ జిల్లాలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు

ఉమ్మడి వైఎస్సార్ జిల్లా కడపలోని జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం ఒప్పంద ప్రాతిపదికన ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీకి చెందిన ఐసీటీసీ/ఏఆర్‌టీ/బ్లడ్ బ్యాంక్‌లో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 01
- **అర్హత:** డీఎంఎల్‌టీ/బీఎస్సీ(ఎంఎల్‌టీ) ఉత్తీర్ణత తోపాటు పని అనుభవం ఉండాలి.
  వయసు: 42 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు రూ.21,000 చెల్లిస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం, అక్కయ్యపల్లి, కడప చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 20.12.2022
- **వెబ్‌సైట్:** https://kadapa.ap.gov.in

నిట్, పుదుచ్చేరిలో పీహెచ్‌డీలో ప్రవేశాలు

కరైకాల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పుదుచ్చేరి.. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** మాస్టర్స్ డిగ్రీ(ఇంజనీరింగ్/టెక్నాలజీ)/ఎంఎస్–రీసెర్చ్ (సీఎస్‌ఈ /ఈసీఈ/ఈఈఈ) లేదా బీఈ, బీటెక్(సీఎస్‌ఈ/ఈసీఈ/ఈఈఈ), గేట్ స్కోరు ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.12.2022
- **వెబ్‌సైట్:** https://nitpyadm.samarth.edu.in

కేవీల్లో 13వేల కొలువులు

» కేంద్రీయ విద్యాలయాల్లో 13,404 పోస్టులకు నోటిఫికేషన్
» టీచింగ్ విభాగంలో ప్రైమరీ, పీజీటీ, టీజీటీ ఉద్యోగాలు
» నాన్-టీచింగ్ విభాగంలో ఏసీ నుంచి లైబ్రేరియన్ వరకు పలు పోస్టులు
» రాత పరీక్ష, డెమో, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా నియామకం

దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విద్యాలయా(కేవీ)ల్లో టీచింగ్, నాన్-టీచింగ్ విభాగాల్లో.. 13 వేలకుపైగా పోస్టులకు నోటిఫికేషన్ వెలువడింది! టీచింగ్ విభాగంలో 11 వేలకుగా పైగా పోస్టులు..నాన్-టీచింగ్ విభాగంలో రెండు వేలకుపైగా పోస్టులతో.. భారీ స్థాయిలో కొలువుల మేళాకు కేంద్రీయ విద్యాలయ సంఘటన్ శ్రీకారం చుట్టింది! ఆయా పోస్టులను అనుసరించి రాత పరీక్ష, డెమో, ఇంటర్వ్యూ, స్కిల్ టెస్టుల్లో చూపిన ప్రతిభ ఆధారంగా ఎంపిక ప్రక్రియ చేపడతారు. ఈ నేపథ్యంలో... కేంద్రీయ విద్యాలయాల్లో భర్తీ చేయనున్న పోస్టుల వివరాలు, అర్హతలు, ఎంపిక విధానం, విజయానికి ప్రిపరేషన్ గైడెన్స్..



కేంద్రీయ విద్యాలయాలు.. దాదాపు ఆరు దశాబ్దాల క్రితం కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన విద్యా సంస్థలు. వీటి పర్యవేక్షణ కోసం కేంద్రీయ విద్యాలయ సంఘటన్ పేరుతో ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేశారు. సీబీఎస్‌ఈ సిలబస్ విధానంతో అత్యున్నత ప్రమాణాలతో బోధిస్తూ.. ప్రత్యేక గుర్తింపు పొందాయి కేంద్రీయ విద్యాలయాలు. ప్రస్తుతం దేశంలో 1,252, విదేశాల్లో మరో మూడు పాఠశాలలు ఉన్నాయి.

మొత్తం 13,404 పోస్టులు

కేంద్రీయ విద్యాలయ సంఘటన్ తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం– టీచింగ్, నాన్–టీచింగ్ విభాగాలకు సంబంధించి మొత్తం 13,404 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది.

టీచింగ్ పోస్టులు

- ప్రైమరీ టీచర్స్–6,414, ప్రైమరీ టీచర్(మ్యూజిక్)–303.
- పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్–1409 (హిందీ–172; ఇంగ్లిష్–158; ఫిజిక్స్–135; కెమిస్ట్రీ–167; మ్యాథ్స్–184; బయాలజీ–151; హిస్టరీ–63; జాగ్రఫీ–70; ఎకనామిక్స్–97; కామర్స్–66; కంప్యూటర్ సైన్స్–142; బయో టెక్నాలజీ–4).
- ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్–3,176(హిందీ–377; ఇంగ్లిష్–401; సంస్కృతం–245; సోషల్ స్టడీస్–398; మ్యాథమెటిక్స్–426; సైన్స్–304; ఫిజికల్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్–435; ఆర్ట్ ఎడ్యుకేషన్–251; వైర్‌లెస్ ఇంజనీరింగ్–339).

అర్హతలు, వేతన శ్రేణి

- **ప్రైమరీ టీచర్స్:** ఇంటర్మీడియెట్‌తోపాటు 50 శాతం మార్కులతో డీఈడీ లేదా బీఈడీ ఉత్తీర్ణత ఉండాలి. దీంతోపాటు సీటెట్ పేపర్–1లో అర్హత సాధించాలి. **వయసు:** 30ఏళ్లు మించరాదు. **వేతన శ్రేణి:** రూ.35,400–రూ.1,12,400
- **ప్రైమరీ టీచర్స్–మ్యూజిక్:** 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సు ఉత్తీర్ణత తోపాటు మ్యూజిక్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. **వయసు:** 30 ఏళ్లు మించరాదు. **వేతన శ్రేణి:** రూ.35,400–రూ.1,12,400
- **పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్:** సంబంధిత సబ్జెక్ట్ స్పెషలైజేషన్‌లో 50 శాతం మార్కులతో పీజీతోపాటు బీఈడీ ఉత్తీర్ణత ఉండాలి. **వయసు:** 40 ఏళ్లు మించరాదు. **వేతన శ్రేణి:** రూ.47,600–రూ.1,51,100
- **ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్:** సంబంధిత సబ్జెక్ట్‌తో 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. బీఈడీ పూర్తిచేయడంతోపాటు సీటెట్ పేపర్–2లో అర్హత సాధించాలి. **వయసు:** 35 ఏళ్లు మించరాదు. **వేతన శ్రేణి:** రూ.44,900–రూ.1,42,400

నాన్–టీచింగ్ పోస్టులు, అర్హతలు

- **అసిస్టెంట్ కమిషనర్(52 పోస్టులు); అర్హత:** 45 శాతం మార్కులతో పీజీతోపాటు, బీఈడీ ఉత్తీర్ణత ఉండాలి.ప్రిన్సిపల్ హోదాలో కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి. **వయసు:** 50 ఏళ్లు మించరాదు.**వేతన శ్రేణి:**రూ.78,800–రూ.2,09,200
- **ప్రిన్సిపల్(239 పోస్టులు); అర్హత:** 45 శాతం మార్కులతో పీజీతోపాటు బీఈడీ ఉత్తీర్ణత ఉండాలి. కనిష్టంగా మూడేళ్లు, గరిష్టంగా ఎనిమిదేళ్ల వ్యవధిలో పీజీటీ లేదా వైస్ ప్రిన్సిపల్ హోదాలో అనుభవం. **వయసు:** 35–50 ఏళ్ల మధ్య ఉండాలి. **వేతన శ్రేణి:** రూ.78,800–రూ.2,09,200
- **వైస్ ప్రిన్సిపల్(203 పోస్టులు); అర్హత:** 50 శాతం మార్కులతో పీజీతోపాటు బీఈడీ ఉత్తీర్ణత ఉండాలి. వైస్ ప్రిన్సిపల్ హోదాలో రెండేళ్లు లేదా పీజీటీ/లెక్చరర్ హోదాలో ఆరేళ్లు లేదా పీజీటీ/టీజీటీ/లెక్చరర్ హోదాల్లో కలిపి పదేళ్ల అనుభవం ఉండాలి. **వయసు:** 35–45 ఏళ్ల మధ్య ఉండాలి. **వేతన శ్రేణి:** రూ.56,100–1,77,500
- **లైబ్రేరియన్(355 పోస్టులు); అర్హత:** లైబ్రరీ సైన్స్‌లో బ్యాచిలర్ లేదా డిప్లొమా ఉత్తీర్ణత ఉండాలి. **వయసు:** 35 ఏళ్లు మించరాదు. **వేతన శ్రేణి:** రూ.44,900–1,42,400
- **ఫైనాన్స్ ఆఫీసర్(6 పోస్టులు); అర్హత:** 50 శాతం మార్కులతో బీకాం ఉత్తీర్ణత తోపాటు ఆడిట్ అండ్ అకౌంట్స్ వర్క్స్‌లో నాలుగేళ్ల అనుభవం ఉండాలి. లేదా 50 శాతం మార్కులతో ఎంకాం ఉత్తీర్ణతతోపాటు ఆడిట్ అండ్ అకౌంట్స్ వర్క్స్‌లో మూడేళ్ల అనుభవం లేదా సీఏ(ఇంటర్)/ఐసీడబ్ల్యూఏ(ఇంటర్)/ఎంబీఏ(ఫైనాన్స్) లేదా పీజీడీఎం(ఫైనాన్స్) ఉత్తీర్ణతతోపాటు ఆడిట్ అండ్ అకౌంట్స్ వర్క్స్‌లో రెండేళ్ల అనుభవం ఉండాలి. **వయసు:** 35 ఏళ్లు మించరాదు. **వేతన శ్రేణి:** రూ.44,900–1,42,400
- **అసిస్టెంట్ ఇంజనీర్(సివిల్–2 పోస్టులు); అర్హత:** సివిల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ తోపాటు రెండేళ్ల పని అనుభవం లేదా సివిల్ ఇంజనీరింగ్‌లో మూడేళ్ల డిప్లొమా తోపాటు అయిదేళ్ల పని అనుభవం ఉండాలి. **వయసు:** 35 ఏళ్లు మించరాదు. **వేతన శ్రేణి:** రూ. 44,900–1,42,400
- **అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్(156 పోస్టులు); అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ శాఖలు/ప్రభుత్వ రంగ సంస్థల్లో యూడీసీ హోదాలో మూడేళ్ల అనుభవం ఉండాలి. **వయసు:** 35ఏళ్లు మించరాదు. **వేతన శ్రేణి:** రూ. 35,400 –1,12,400
- **హిందీ ట్రాన్స్‌లేటర్(11 పోస్టులు); అర్హత:** హిందీ/ఇంగ్లిష్ స్పెషలైజేషన్‌తో పీజీ ఉత్తీర్ణత ఉండాలి. దీంతోపాటు అభ్యర్థులు పీజీలో హిందీ లేదా ఇంగ్లిష్‌ను ఎలక్టివ్ సబ్జెక్ట్‌గా చదివుండాలి. **వయసు:** 35ఏళ్లు మించరాదు. **వేతన శ్రేణి:** రూ.35,400 –1,12,400
- **సీనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(322 పోస్టులు); అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ప్రభుత్వ శాఖలు లేదా ప్రభుత్వ రంగ సంస్థల్లో ఎల్‌డీసీ హోదాలో మూడేళ్ల అనుభవం ఉండాలి. **వయసు:** 35ఏళ్లు మించరాదు. **వేతన శ్రేణి:** రూ.25,500 –81,100
- **జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(702 పోస్టులు); అర్హత:** ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి. ఇంగ్లిష్‌లో నిమిషానికి 35 పదాలు, హిందీలో నిమిషానికి 30 పదాలు టైపింగ్ స్కిల్ ఉండాలి. **వయసు:** 27 ఏళ్లు మించరాదు. **వేతన శ్రేణి:** రూ.19,900–రూ.63,200
- **స్టెనోగ్రాఫర్ గ్రేడ్–2(54 పోస్టులు); అర్హత:** ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణతతోపాటు షార్ట్ హ్యాండ్ ఉత్తీర్ణత ఉండాలి. **వయసు:** 27ఏళ్లు మించరాదు. **వేతన శ్రేణి:** రూ.25,500 –81,100.

తొలి దశ రాత పరీక్ష

- అన్ని పోస్టులకు సంబంధించి తొలి దశలో రాత పరీక్ష నిర్వహిస్తారు. ముందుగా టీచింగ్ పోస్టులకు సంబంధించి రాత పరీక్ష వివరాలు..
- **ప్రైమరీ టీచర్స్:** ఈ పోస్టులకు 180 మార్కులకు నాలుగు విభాగాల్లో పరీక్ష జరుగుతుంది. పార్ట్–1(జనరల్ ఇంగ్లిష్–10 ప్రశ్నలు; జనరల్ హిందీ–10 ప్రశ్నలు); పార్ట్–2 (జనరల్ అవేర్‌నెస్ అండ్ కరెంట్ అఫైర్స్–10 ప్రశ్నలు; రీజనింగ్ ఎబిలిటీ–5 ప్రశ్నలు; కంప్యూటర్ లిటరసీ–5 ప్రశ్నలు); పార్ట్–3(అండర్ స్టాండింగ్ ద లెర్నర్–15 ప్రశ్నలు; అండర్ స్టాండింగ్ టీచింగ్ లెర్నింగ్–15 ప్రశ్నలు; క్రియేటింగ్ కండక్టివ్ లెర్నింగ్ ఎన్విరాన్‌మెంట్–10 ప్రశ్నలు, స్కూల్ ఆర్గనైజేషన్ అండ్ లీడర్‌షిప్–10 ప్రశ్నలు; పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్–10 ప్రశ్నలు); పార్ట్–4 సంబంధిత సబ్జెక్ట్(80 ప్రశ్నలు).
- **పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్:** ఈ పరీక్ష కూడా 180 మార్కులకు జరుగుతుంది. పార్ట్–1(జనరల్ ఇంగ్లిష్–10 ప్రశ్నలు; జనరల్ హిందీ–10 ప్రశ్నలు), పార్ట్–2(జనరల్ అవేర్‌నెస్ అండ్ కరెంట్ అఫైర్స్–10 ప్రశ్నలు; రీజనింగ్ ఎబిలిటీ–5 ప్రశ్నలు; కంప్యూటర్ లిటరసీ–5 ప్రశ్నలు); పార్ట్–3(అండర్ స్టాండింగ్ ద లెర్నర్–15 ప్రశ్నలు; అండర్ స్టాండింగ్ టీచింగ్ లెర్నింగ్–15 ప్రశ్నలు; క్రియేటివ్ కండక్టివ్ లెర్నింగ్ ఎన్విరాన్‌మెంట్, స్కూల్ ఆర్గనైజేషన్ అండ్ లీడర్‌షిప్, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్–10 ప్రశ్నలు); పార్ట్–4 సంబంధిత సబ్జెక్ట్–100 ప్రశ్నలు.
- **ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్:** ఈ పోస్టుల రాత పరీక్షకు కేటాయించిన మార్కులు 180. పార్ట్–1(జనరల్ ఇంగ్లిష్–10 ప్రశ్నలు; జనరల్ హిందీ–10 ప్రశ్నలు); పార్ట్–2 (జనరల్ అవేర్‌నెస్ అండ్ కరెంట్ అఫైర్స్–10 ప్రశ్నలు, రీజనింగ్ ఎబిలిటీ–5 ప్రశ్నలు; కంప్యూటర్ లిటరసీ–5 ప్రశ్నలు); పార్ట్–3 (అండర్‌స్టాండింగ్ ద లెర్నర్–10 ప్రశ్నలు, అండర్‌స్టాండింగ్ టీచింగ్ లెర్నింగ్–15 ప్రశ్నలు; క్రియేటివ్ కండక్టివ్ లెర్నింగ్ ఎన్విరాన్‌మెంట్, స్కూల్ ఆర్గనైజేషన్ అండ్ లీడర్‌షిప్, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్–15 ప్రశ్నలు); పార్ట్–4 సంబంధిత సబ్జెక్ట్–100 ప్రశ్నలు.

డెమో, ఇంటర్వ్యూ ఇలా

- కేంద్రీయ విద్యాలయాల్లో భర్తీ చేయనున్న అన్ని పోస్టులకు సంబంధించి రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా ప్రొఫెషనల్ కాంపిటెన్సీ టెస్ట్ పేరుతో తదుపరి దశలో డెమో, ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. వీటికి నిర్దిష్టంగా మార్కులు కూడా కేటాయిస్తారు.
- పీజీటీ, టీజీటీ, ప్రైమరీ టీచర్, లైబ్రేరియన్ పోస్టులకు 60 మార్కులకు(డెమోకు 30 మార్కులు, ఇంటర్వ్యూకు 30 మార్కులు) నిర్వహిస్తారు.
- నాన్ టీచింగ్ పోస్టులకు సంబంధించి కూడా రాత పరీక్షతోపాటు అసిస్టెంట్ కమిషన్ పోస్టులకు 20 మార్కులకు ఇంటర్వ్యూ; ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ పోస్టులకు 30 మార్కులకు ఇంటర్వ్యూ తోపాటు, మరో 30 మార్కులకు స్కూల్ డెవలప్‌మెంట్ ప్లాన్ ప్రజెంటేషన్‌కు కేటాయిస్తారు.
- హిందీ ట్రాన్స్‌లేటర్ పోస్టులకు 90 మార్కులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. స్టెనోగ్రాఫర్ గ్రేడ్–2, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులకు ఇంటర్వ్యూ ఉండదు.

వెయిటేజీ విధానంలో తుది ఎంపిక

కేంద్రీయ విద్యాలయ పోస్టుల తుది విజేతల ఎంపికలో వెయిటేజీ విధానాన్ని అమలు చేస్తున్నారు. టీచింగ్ పోస్టులకు సంబంధించి రాత పరీక్షలో ప్రతిభకు 70 మార్కులు; డెమో, ఇంటర్వ్యూలలో ప్రతిభకు 30 మార్కుల వెయిటేజీని నిర్దేశించారు. నాన్ టీచింగ్ పోస్టులకు సంబంధించి రాత పరీక్షలో ప్రతిభకు 80 మార్కులు, ఇంటర్వ్యూలో ప్రతిభకు 20 మార్కులు వెయిటేజీని నిర్ధారించారు. అభ్యర్థులు ఈ రెండు విభాగాల్లో పొందిన మార్కులను గణించి తుది జాబితా రూపొందించి నియామకాలు ఖరారు చేస్తారు.

సబ్జెక్ట్ నుంచి సమకాలీనం వరకు

- ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పరీక్షలో విజయానికి సబ్జెక్ట్ నాలెడ్జ్, విద్యా దృక్పథాలు, పెడగాజీ, చైల్డ్ డెవలప్‌మెంట్, శిశు వికాసం వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. పెడగాజికి సంబంధించి సహిత విద్య, శిశువు విద్యా ప్రణాళిక, బోధన పద్ధతులు, మూల్యాంకనం–నాయకత్వం–గైడెన్స్–కౌన్సెలింగ్ గురించి అధ్యయనం చేయాలి. ఎడ్యుకేషన్‌కు సంబంధించిన చట్టాలపై పూర్తి అవగాహన పొందాలి. పెడగాజిలోని భావనలు,సిద్ధాంతాలు,నిబంధనలను విశ్లేషిస్తూ అధ్యయనం చేస్తేనే ఏ కోణంలో ప్రశ్న అడిగినా సమాధానం ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది.
- చైల్డ్ సైకాలజీ, కరిక్యులమ్ ఆర్గనైజేషన్, లెసన్ ప్లాన్, ఇన్‌స్ట్రక్షనల్ మెటీరియల్స్, విద్యా దృక్పథాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- నాన్–టీచింగ్ పోస్టుల అభ్యర్థులు తమ విభాగాలకు సంబంధించి బ్యాచిలర్, పీజీ స్థాయి పుస్తకాలను అభ్యసనం చేయాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** డిసెంబర్ 26, 2022.
- **రాత పరీక్ష:** 2023, మే నెలలో నిర్వహించే అవకాశం.
- **వెబ్‌సైట్:** www.kvsangathan.nic.in


'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 269

మంగళవారం 20-12-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సేద్య తపస్వి!

'సాగు'లో అద్భుత ఆవిష్కరణలు చేస్తున్న కొంగర రమేశ్‌పై ప్రత్యేక కథనం - 10లో



యాసిడ్ సమాజానికి సర్జరీ

యాసిడ్ బాధితులకు అండగా నిలుస్తున్న డాక్టర్ ప్రతిభా నైతానిపై కథనం - 10లో



జవాన్లపై అవేం మాటలు?

చైనా సేనలు మన సైనికులను కొట్టారన్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలను విదేశాంగ మంత్రి జై శంకర్ తప్పుబట్టారు.

వివరాలు 6లో ▸



మునిగిన యుద్ధ నౌక

థాయిలాండ్ సముద్రజలాల్లో ఆ దేశ యుద్ధ నౌక మునిగిపోవడంతో 31 మంది గల్లంతయ్యారు. 75 మందిని రక్షించారు.

వివరాలు 6లో ▸



మస్క్.. మాకొద్దు

'ట్విట్టర్ సీఈవోగా నేను తప్పుకోవాలా?' అని ఎలాన్ మస్క్ పెట్టిన పోల్‌లో 57.5 శాతం యూజర్లు 'ఎస్' అని జవాబిచ్చారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

బాండ్లు లేకున్నా బీమాకు అర్హులే



గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా కార్యక్రమంపై 'ఈనాడు' దుర్బుద్ధితో అసత్య కథనాలను ప్రచురించింది. అందులో ఏమాత్రం నిజం లేదు. అధికారికంగా బాండ్ జారీ చేసే వరకు జీతం ధ్రువీకరణ పత్రమే బాండ్‌గా పనిచేస్తుందని బీమా చట్టం చెబుతోంది. ఇది సచివాలయాల ఉద్యోగులకు కూడా వర్తిస్తుంది. అబద్ధాలకు పెద్దపీట వేస్తూ.. ఈనాడు రాసిన తప్పుడు రాతలపై.. వాస్తవాలతో కథనం.

వివరాలు 2 ▸

అన్నింటా అసలైన అభ్యున్నతి



ఊళ్లో వెయ్యి మంది అర్హులుంటే.. ఒకరిద్దరికి రుణాలిప్పించి అదే తమ ప్రభుత్వ ఘనతగా చెప్పుకున్న తీరు చంద్రబాబుది. కానీ ఆ ఊళ్లో అర్హుల్లో ఒక్కరు కూడా మిగిలిపోకుండా అందరికీ సంతృప్త స్థాయిలో పథకాలను అందించి.. వారి జీవితాలనూ మెరుగుపరిచే ప్రయత్నం సీఎం జగన్‌ది. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి పట్ల ఎవరికి చిత్తశుద్ధి ఉందో? తెలియటానికి? ఇదొక్కటి చాలదా?

వివరాలు 2 ▸

'మత్తు' వదిలిద్దాం

ఎక్సైజ్, ఎస్ఈబీ శాఖలతో సమీక్షలో సీఎం జగన్ దిశానిర్దేశం

సంపూర్ణ మాదకద్రవ్య రహిత ప్రాంతంగా మన రాష్ట్రం

- కాలేజీలు, యూనివర్సిటీల్లో విస్తృత ప్రచారం చేయాలి
- ఎస్ఈబీ టోల్‌ఫ్రీ నంబర్ 14500తో విద్యాసంస్థల వద్ద హోర్డింగ్‌లు.. అక్రమ మద్యం కట్టడికి కఠిన చర్యలు
- మరింత సమన్వయంతో మహిళా పోలీసు వ్యవస్థ.. దిశ వ్యవస్థను పకడ్బందీగా అమలు చేయాలి
- ఉన్నతాధికారులు వారంలో రెండుసార్లు సమీక్షించాలి
- యావత్ దేశం మనవైపు చూసేలా సమర్థంగా పని చేయాలి



సాక్షి, అమరావతి: ఎక్సైజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ), పోలీసు శాఖలు మరింత సమన్వయంతో పనిచేసి రాష్ట్రాన్ని సంపూర్ణంగా మాదక ద్రవ్యాలు, అక్రమ మద్య రహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. మాదక ద్రవ్యాలు, అక్రమ మద్యాన్ని పూర్తిగా అరికట్టడం, సచివాలయాల్లో మహిళా పోలీసు వ్యవస్థ బలోపేతం, కట్టుదిట్టంగా దిశ వ్యవస్థను అమలు చేయడం అత్యంత ప్రాధాన్యత అంశాలని అధికార యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు. ఈ నాలుగు అంశాలపై పోలీసు శాఖ, ఎస్ఈబీ ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. అక్రమ మద్యం, గంజాయి నిర్మూలన చర్యలు, కేసుల నమోదు తదితర అంశాలపై సోమవారం క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ సమీక్షించారు. దిశ యాప్ వినియోగం, కాల్స్‌పై తక్షణ స్పందన కోసం అన్ని చోట్లా మాక్ డ్రిల్ నిర్వహించాలని

మిగతా 2వ పేజీలో ▶

మరింత సమర్థంగా ఎస్ఈబీ

అక్రమ మద్యం, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, ఇసుక అధిక ధరలకు విక్రయించడం లాంటి ఫిర్యాదులపై ఎస్ఈబీ అధికారులు సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి. ఎస్ఈబీ మరింత సమర్థంగా పని చేయాలి. కేవలం అక్రమ మద్యం అరికట్టేందుకే పరిమితం కాకుండా మాదక ద్రవ్యాలు, గంజాయి, గుట్కాలు లాంటి వాటిపై కఠినంగా వ్యవహరించాలి. అందుకోసం స్థానిక ఇంటెలిజెన్స్ (నిఘా) వ్యవస్థను సద్వినియోగం చేసుకోవాలి.

- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

నేడు దర్శి, విజయవాడలో సీఎం జగన్ పర్యటన

2లో

బెజవాడలో 'క్రిస్మస్' తేనీటి విందులో పాల్గొననున్న సీఎం

ఎటునుం'చైనా'

ఈశాన్య రాష్ట్రాలపై డ్రాగన్ గురి

- టిబెట్ వైమానిక స్థావరాల్లో యుద్ధ విమానాలు, డ్రోన్లు మోహరింపు
- కవ్వింపు చర్యలకు దిగుతున్న కయ్యాలమారి.. గగనతలంలో యుద్ధ విమానాలతో భారత్ నిరంతర గస్తీ

6లో

సాధారణ చార్జీలతోనే సంక్రాంతి బస్సులు

- ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక కాల్ సెంటర్
- సంక్రాంతికి 6,400 ప్రత్యేక బస్సులు

2లో

క్లుప్తంగా...

నేడు దర్శి, విజయవాడలో సీఎం జగన్ పర్యటన

'క్రిస్మస్' తేనీటి విందులో పాల్గొననున్న సీఎం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం ప్రకాశం జిల్లా దర్శి, ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి 11 గంటలకు దర్శి పట్టణానికి చేరుకుంటారు. అక్కడ జరిగే ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ తనయుడి వివాహ రిసెప్షన్‌కు సీఎం హాజరవుతారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1.00 గంటకు తాడేపల్లికి చేరుకుంటారు. క్రిస్మస్ సందర్భంగా మంగళవారం సాయంత్రం విజయవాడలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తేనీటి విందులో సీఎం జగన్ పాల్గొంటారు. ఇందుకోసం సాయంత్రం 5.30 గంటలకు ఏప్లస్ కన్వెన్షన్‌కు సీఎం జగన్ చేరుకుంటారు. కార్యక్రమం అనంతరం ఆయన తిరిగి తాడేపల్లికి వెళ్తారు.

క్షయ రోగులకు 'అరబిందో' సహాయం

- టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా పోషకాహారానికి రూ.16.80 లక్షల విరాళం
- కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద 400 మంది వ్యాధిగ్రస్తులకు ఆసరా



కలెక్టర్ మల్లికార్జునకు చెక్కు అందిస్తున్న అరబిందో ఫార్మా ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం: క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా విశాఖ జిల్లా బాధితులకు సహాయం అందించేందుకు ప్రముఖ ఔషధ ఉత్పత్తుల సంస్థ అరబిందో ఫార్మా ఫౌండేషన్ ముందడుగు వేసింది. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 400 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు ఆరు నెలలపాటు పౌష్టికాహారం అందించేందుకు సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.16.80 లక్షలను విరాళంగా అందజేసింది. ఆరు నెలలపాటు 400 మంది రోగులకు ఫుడ్ బాస్కెట్‌లు అందజేసేందుకు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ విభాగానికి సంస్థ ఎండీ కె.నిత్యానందరెడ్డి తరఫున చెక్కును అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునకు సోమవారం అందజేశారు. ఆరు నెలలపాటు ఒక్కో రోగికి పౌష్టికాహారం అందించేందుకు రూ.4,200 ఖర్చు చేసేందుకు వీలుగా ఈ సహాయం అందిస్తున్నామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం అమలులో విశాఖపట్నం రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉందని కలెక్టర్ మల్లికార్జున వెల్లడించారు.

ఎమ్మెల్యే చెవిరెడ్డికి పితృ వియోగం


సుబ్రమణ్యంరెడ్డి (ఫైల్)

తిరుపతి రూరల్: ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తండ్రి చెవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి (మణిరెడ్డి–76) సోమవారం రాత్రి ఆకస్మికంగా మృతిచెందారు. శ్వాస సంబంధ సమస్యతో గత కొంతకాలంగా ఆయన ఇబ్బందిపడుతున్నారు. సోమవారం రాత్రి ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండడంతో స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. రాత్రి 11 గంటల సమయంలో ఆయన తుదిశ్వాస విడిచారు. సుబ్రమణ్యం రెడ్డికి ముగ్గురు కుమారులు. వారిలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రథమ సంతానం. సుబ్రమణ్యం రెడ్డి ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, ఎంపీటీసీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా, తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాలకు చైర్మన్‌గా పనిచేశారు. పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. ఫోన్ ద్వారా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని పరామర్శించారు.

అప్పుల్లో మొదటిస్థానంలో తమిళనాడు

- 8వ స్థానంలో ఆంధ్రప్రదేశ్
- అప్పుల పెరుగుదలలో 15వ స్థానంలో ఏపీ
- లోక్‌సభలో కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోనే అత్యధికంగా అప్పులున్న రాష్ట్రాల జాబితాలో తమిళనాడు మొదటి స్థానంలో ఉందని కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి చెప్పారు. లోక్‌సభలో సోమవారం బీఆర్ఎస్ ఎంపీలు వెంకటేశ్ నేత, రంజిత్‌రెడ్డి, మాలోత్ కవిత అడిగిన ప్రశ్నలకు మంత్రి బదులిస్తూ.. 2022 నాటికి తమిళనాడు అప్పు రూ.6,59,868 కోట్లని తెలిపారు. అప్పుల్లో ఆంధ్రప్రదేశ్ 8వ స్థానంలో, తెలంగాణ 11వ స్థానంలో ఉన్నట్లు చెప్పారు. ఏపీ అప్పు రూ.3,98,903 కోట్లు, తెలంగాణ అప్పు రూ.3,12,191 కోట్లు అని తెలిపారు. అప్పుల పెరుగుదలలో 10.7 శాతంతో ఆంధ్రప్రదేశ్ 15వ స్థానంలోను, 16.7 శాతంతో తెలంగాణ 6వ స్థానంలో ఉన్నట్లు చెప్పారు. అప్పుల్లో రెండోస్థానంలో ఉత్తరప్రదేశ్ (రూ.6,53,307 కోట్లు), మూడో స్థానంలో మహారాష్ట్ర (రూ.6,08,999 కోట్లు), నాలుగో స్థానంలో పశ్చిమబెంగాల్ (రూ.5,62,697 కోట్లు), ఐదో స్థానంలో రాజస్థాన్ (రూ.4,77,177 కోట్లు), ఆరోస్థానంలో కర్ణాటక (రూ.4,61,832 కోట్లు), ఏడోస్థానంలో గుజరాత్ (రూ.4,02,785 కోట్లు) ఉన్నట్లు వివరించారు.

చదువు ఉద్యోగం ఉపాధి

అన్నిటా అసలైన అభ్యున్నతి

ఎస్సీ, ఎస్టీలకు అర్హతే ప్రామాణికంగా సంతృప్త స్థాయిలో సంక్షేమం

- వెయ్యి రూపాయల పెన్షన్ స్థానంలో నెలకు రూ.2,750
- గిరిజన ప్రాంతాల్లోని గ్రామ సచివాలయాల్లో ఉద్యోగాలన్నీ ఎస్టీలకే
- సచివాలయాలు, వలంటీర్లలో 32 నుంచి 35 శాతం ఎస్సీ, ఎస్టీలే
- మూడున్నరేళ్లలోనే 1.27 లక్షల మంది గిరి జనానికి భూమి పట్టాలు
- 6,36,732 మంది ఎస్సీలకు, 1,41,496 మంది ఎస్టీలకు ఇళ్ల స్థలాలు
- చేయూత, ఆసరా కింద సొంతకాళ్లపై నిలబడేలా 2.45 లక్షల మందికి లబ్ధి
- విద్యా దీవెన, వసతి దీవెనతో నూరు శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్
- మునుపటి ప్రభుత్వాలతో పోలికే లేకుండా సామాజిక అభ్యున్నతి
- అయినా అబద్ధాలకే పెద్దపీట వేస్తూ 'ఈనాడు' కథనాలు



సాక్షి, అమరావతి: ఊళ్లో వెయ్యి మంది అర్హులుంటే వారిలో ఒకరిద్దరికి రుణాలిప్పించి అదే తమ ప్రభుత్వ ఘనతగా చెప్పుకున్న తీరు చంద్రబాబు నాయుడిది. కానీ ఆ ఊళ్లో అర్హుల్లో ఒక్కరు కూడా మిగిలిపోకుండా అందరికీ సంతృప్త స్థాయిలో పథకాలను అందించి... అందరి జీవితాలనూ మెరుగుపరిచే ప్రయత్నం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిది. దీన్ని బట్టి తెలియటం లేదా... ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి పట్ల నిజంగా ఎవరికి చిత్తశుద్ధి ఉందో? ఇదొక్కటి చాలదా ఎవరు రాజకీయం చేస్తున్నారో తెలియటానికి? టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల కనుసన్నల్లో ఏ కొందరికో మేలు జరిగితే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని లబ్ధిదారుల ముంగిట్లోకి చేరుస్తోంది. ఈ రాష్ట్రంలో పరిస్థితులను చూస్తున్నవారెవరైనా దీన్ని కాదనగలరా? మరి 'ఈనాడు'లో ఈ వాస్తవాలు రాయరెందుకు రామోజీ? 2014–19 మధ్య చంద్రబాబు ప్రభుత్వం ఎస్సీలకు రూ.14,183.38 కోట్లు ఖర్చు చేయగా గడిచిన మూడున్నరేళ్లలో ఈ ప్రభుత్వం ఖర్చుచేసింది సాక్షాత్తూ రూ.59,263.69 కోట్లు. ఎస్టీల విషయంలో ఇది రూ.7,315.41 కోట్ల నుంచి రూ.17,651.50 కోట్లకు చేరింది. ఈ అంకెలు చాలవా ఎవరెంత ప్రాధాన్యమిస్తున్నారో తెలియటానికి?

ఉద్యోగాల్లో ఏమైనా పోలిక ఉందా?

ఎస్సీ, ఎస్టీల ఉపాధికి ఈ ప్రభుత్వం ఏమీ చేయటం లేదన్నది సంఘాల ముసుగులో రామోజీరావు చేసిన మరో ఆరోపణ. అసలు ఏమైనా పోలిక ఉందా? రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం... గిరిజన ప్రాంతాల్లోని కార్యాలయాల్లో మొత్తం ఉద్యోగాలన్నీ ఎస్టీలకే కేటాయించింది. దీంతో ఎస్టీలు గ్రామ, వార్డు సచివాలయాల్లో ఏకంగా 10,651 మంది, వలంటీర్లుగా 16,847 మంది ఉపాధి పొందారు. ఎస్సీల సంఖ్య సచివాలయాల్లో 28,267 కాగా... వలంటీర్లుగా ఉన్నది ఏకంగా 69,528 మంది. ఒకరకంగా స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో ఈ వర్గాలకు వచ్చిన ఉద్యోగాలతో పోలిస్తే... ఈ మూడున్నరేళ్లలో వచ్చినవి 50 శాతానికి పైనే ఉన్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పైపెచ్చు మొత్తం గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లలో వీరి సంఖ్య 32 నుంచి 35 శాతం వరకూ ఉందంటే... ఈ ప్రభుత్వం అట్టడుగు వర్గాలకిస్తున్న ప్రాధాన్యమేంటో తెలియకమానదు.

ఇక స్వయం ఉపాధి కల్పించటంలోనూ ప్రభుత్వం ఇదే దృక్పథంతో ఉంది. చంద్రబాబు నాయుడి హయాంలో 'పేదరికంపై గెలుపు' పేరుతో ఐదేళ్లలో 2,02,414 మంది ఎస్సీలకు రూ.2,726కోట్లు, 39,906 మంది ఎస్టీలకు రూ.284.8 కోట్లు ఇచ్చారు. కానీ ఈ ప్రభుత్వం మూడున్నరేళ్లలోనే వైఎస్ఆర్ చేయూత, ఆసరా పథకం ద్వారా ప్రతి లబ్ధిదారుకు ఏడాది రూ.18,750తో పాటు సున్నా వడ్డీ పథకంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణమాఫీ అమలు చేసి అండగా నిలిచింది. స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకునేలా 23,13,385 మంది ఎస్సీలకు రూ.5,914 కోట్లు, 4,71,311 మంది ఎస్టీలకు రూ.1,218.8కోట్లు అందించింది. ఇప్పుడు చెప్పండి రామోజీరావు గారూ... ఎస్సీ, ఎస్టీలను ఏ ప్రభుత్వం దగా చేసిందో?

ఇళ్ల స్థలాలు, ఇళ్లు		
కేటగిరీ	ఎస్సీ	ఎస్టీ
మంజూరు చేసిన ఇళ్ల స్థలాల/విలువ	6,36,732 మందికి రూ.15,918కోట్లు	1,41,496 మందికి రూ.3,537.4 కోట్లు
గృహాలు/విలువ	4,18,646 మందికి రూ.10,949కోట్లు	79,359 మందికి రూ.1,989 కోట్లు

కౌలు రైతులకూ భరోసా...

అడవిని నమ్ముకున్న గిరిజనులకు గడిచిన 12 ఏళ్లలో ఇచ్చిన భూమి హక్కు పట్టాలకంటే అధికంగా... కేవలం మూడున్నరేళ్లలో 1,27,245 మంది గిరిజనులకు 2,82,832 ఎకరాలను ఇచ్చి ఆర్‌ఓఎఫ్ఆర్ పట్టాలను పంపిణీ చేయడం ఈ రాష్ట్రంలో ఓ చరిత్ర. ఆర్‌ఓఎఫ్ఆర్ కార్డులున్న కౌలు రైతులతో సహా వీరందరికీ రైతు భరోసా అందుతోంది. ఇక పింఛన్లు చూసుకున్నా అప్పట్లో ఇచ్చింది నెలకు వెయ్యి రూపాయలు. అది కూడా అర్హులందరికీ అందే పరిస్థితి లేదు. ఇపుడు నెలకు రూ.2,750 చొప్పున అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ అందుతోంది. ఇవన్నీ 'ఈనాడు'కు ఎందుకు కనిపించవు? చంద్రబాబు మైకంలో ఎన్ని అబద్ధాలైనా అలవోకగా అచ్చోయడమేనా? దాదాపు రూ.7 నుంచి 10 లక్షల విలువైన స్థలాలతో కూడిన ఇళ్లు వీరి సొంతమవుతున్నాయి. ఇక వైఎస్సార్ చేయూత, ఆసరా, సున్నా వడ్డీ, అమ్మ ఒడి... ఇవన్నీ అర్హతను బట్టి అందరికీ సంతృప్త స్థాయిలో అందుతున్నాయి. మొత్తంగా సామాజిక అభ్యున్నతి సాక్షాత్కారమవుతోంది. ఏటా ఇవ్వటమే కాకుండా బ్యాంకులతో... బహుళ జాతి కంపెనీలతో ఒప్పందాలు చేసుకుని మరీ వారి అభ్యున్నతికి సహకరిస్తోంది ప్రభుత్వం. వైఎస్సార్ చేయూత, ఆసరా కింద కిరాణా షాపుల నుంచి పశువుల పెంపకం, పౌల్ట్రీ తదితర కార్యకలాపాలతో 2.45 లక్షల మందికిపైగా ఎస్సీ, ఎస్టీలు తమ కాళ్లపై తాము నిలబడటం నిజమైన సామాజిక అభ్యున్నతికి చిహ్నం కాదా రామోజీ? ఇంకెన్నాళ్లు సంఘాలు, పార్టీలంటూ రకరకాల ముసుగులు వేసుకుని ప్రభుత్వంపై బురదజల్లే ఎజెండాను కొనసాగిస్తారు? ఉన్నది ఉన్నట్టుగా రాయటమనే పాత్రికేయ బాధ్యతను కొంతైనా చూపించాలి కదా?

వైఎస్సార్ చేయూత, ఆసరా జీవనోపాధి పెంపు లబ్ధిదారులు (2022 డిసెంబర్ 19 నాటికి)		
యాక్టివిటీ	ఎస్సీ	ఎస్టీ
రిటైల్స్ (కిరాణా)	31,409	9,991
వస్త్రాలు	20,273	6,656
ఆవులు, గేదెలు	49,896	19,429
గొర్రెలు - మేక	26,012	10,383
పెరటి పౌల్ట్రీ	2,103	845
ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు	16,722	3,145
వ్యవసాయ కార్యకలాపాలు	7,416	2,979
వ్యవసాయేతర కార్యకలాపాలు	475	110
ఇతర జీవనోపాధి	27,606	97,62
మొత్తం	1,81,911	63,301

ఇవిగో వాస్తవాలు...

- టీడీపీ హయాంలో ఎస్సీలు 8,66,835 మందికి రూ.4,415.04 కోట్లు, ఎస్టీలకు 3,01,242 మందికి రూ.1,373.9 కోట్లు పింఛన్ల రూపంలో అందించారు. ఈ ప్రభుత్వం అధికారం చేపట్టాక 2019 జూన్ నుంచి ఇప్పటివరకు ఎస్సీలకు 11,51,222 మందికి రూ.10,191.8కోట్లు, ఎస్టీలకు 3,71,211 మందికి రూ.3,512.48కోట్లు పింఛన్లుగా అందించారు. మరి ఎవరు దగా చేసినట్లు?
- శాశ్వతంగా విద్యా ప్రమాణాలు పెంచడానికి నాడు–నేడు పేరిట స్కూళ్లకు మౌలిక సదుపాయాలను కల్పించటంతో పాటు ఈ ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియాన్ని అందుబాటులోకి తెచ్చింది. సీబీఎస్ఈతో అనుసంధానించటమే కాక పెద్ద పెద్ద కార్పొరేట్ స్కూళ్లకే పరిమితమైన ఎడ్యుటెక్ విద్య 'బైజూస్'తో కలిసి ప్రభుత్వ స్కూళ్ల ముంగిట్లోకి తీసుకొచ్చింది. రూ.16,000 విలువైన ట్యాబ్‌ను ఉచితంగా ఇవ్వటంతో పాటు... రూ.24వేలు విలువైన బైజూస్ కంటెంట్‌నూ విద్యార్థులకు అందజేస్తోంది. అదేకాదు!! విద్యా దీవెన, వసతి దీవెనలతో నూరుశాతం ఫీజును రీయింబర్స్ చేస్తూ ఈ వర్గాలను శాశ్వతంగా సాధికారీకరించే చర్యలకు నడుంకట్టింది. ఇదీ... నాటికీ, నేటికీ ఉన్నతేడా. ఇదీ... అసలైన దగా ఎవరిదో చెప్పే నిజం.

బాండ్లు లేకున్నా బీమాకు అర్హులే

సచివాలయాల ఉద్యోగులకు జీతం ధ్రువీకరణ పత్రం చాలు

- లక్ష మందికిపైగా ఒకేసారి డిజిటల్ బీమా బాండ్ల జారీకి ప్రభుత్వం కసరత్తు
- ఉద్యోగుల్లో ఆందోళన రేకెత్తించేలా 'ఈనాడు' తప్పుడు కథనం

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా కార్యక్రమంపై ఈనాడు దుర్బుద్ధితో అసత్య కథనాలను ప్రచురించింది. 'దక్కని భరోసా' శీర్షికతో సోమవారం ఎల్లో మీడియా ప్రచురించిన కథనంలో ఏమాత్రం నిజం లేదు.

1 'ఈనాడు' ఆరోపణ

గ్రామ, వార్డు సచివాలయాల్లోని 80 వేల మంది ఉద్యోగుల నుంచి ప్రతి నెలా రూ.6.80 కోట్ల సొమ్మును గ్రూపు ఇన్సూరెన్స్ ప్రీమియంగా తీసుకుంటున్న ప్రభుత్వం వారికి బాండ్లను మాత్రం జారీ చేయలేదు. అనుకోని ప్రమాదం జరిగితే తమ పరిస్థితి ఏమిటని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

వాస్తవం: ప్రభుత్వ ఉద్యోగుల జీతం నుంచి ప్రీమియాన్ని మినహాయించి చెల్లించిన నాటి నుంచి ఆ ఉద్యోగులందరికీ బీమా వర్తిస్తుంది. బీమా చట్టం 1938 సెక్షన్ 64 (వి)(బి) అధికారికంగా బాండ్ జారీ చేసే వరకూ జీతానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రమే బాండ్‌గా పని చేస్తుందని స్పష్టం చేస్తోంది. ఈ నిబంధన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు వర్తిస్తుందని సచివాలయ శాఖ పేర్కొంది.

2 'ఈనాడు' ఆరోపణ

ఒక్కో ఉద్యోగి జీతం నుంచి జీవిత బీమా కింద నెలకు రూ.850 చొప్పున మినహాయించుకుంటున్నారు.

వాస్తవం: ఈ ఏడాది జూన్ 25న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబరు 5 ప్రకారం 1,00,724 గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ప్రొబేషన్ ఖరారు పూర్తయింది. ఈ ఉద్యోగులందరికీ జీతం నుంచి ప్రీమియం మినహాయించి ఏపీజీఎల్ఐకి చెల్లిస్తారు. ఈ ఏడాది అక్టోబరు 18న ఆర్థిక శాఖ విడుదల చేసిన జీవో 198 ప్రకారం నెలవారీ ప్రీమియం రూ.500 నుంచి రూ.800కి పెరిగింది.

3 'ఈనాడు' ఆరోపణ

గ్రూప్ ఇన్సూరెన్స్ ప్రీమియం తీసుకుంటున్న నాటి నుంచి ఐదు నెలల వ్యవధిలో పది మంది ఉద్యోగులు మృతి చెందారు. తాము ఎవర్ని సంప్రదించాలో తెలియడం లేదని బాధిత కుటుంబాల సభ్యులు వాపోతున్నారు.

వాస్తవం: ఈ మధ్య కాలంలో గ్రామ, వార్డు సచివాలయాలకు చెందిన 8 మంది ఉద్యోగులు వివిధ కారణాలతో మరణించినట్లు అధికారులు గుర్తించారు. ప్రీమియం చెల్లించే ఉద్యోగులలో ఎవరైనా చనిపోయినా, బాండ్లు జారీ కాకపోయినా సంబంధిత కుటుంబాలకు నిబంధనల ప్రకారం బీమా పరిహారం చెల్లింపులు జరుగుతాయని ప్రభుత్వ జీవిత బీమా శాఖ (ఏపీజీఎల్ఐ) డైరెక్టర్ ఆర్.శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఉద్యోగుల జీతం నుంచి ప్రీమియం మినహాయించి చెల్లించిన నాటి నుంచి ఆ ఉద్యోగులందరికీ బీమా వర్తిస్తుందని గతంలోనే ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులలో స్పష్టంగా పేర్కొనడంతో పాటు బాండ్లు లేవన్న కారణంగా దరఖాస్తులను నిరాకరించరాదని ఉత్తర్వుల్లో ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. చనిపోయిన ఉద్యోగులకు సంబంధించి బీమా పరిహారం కోసం దరఖాస్తు చేసుకుంటే బాండ్లు లేకపోయినా జిల్లాలో సంబంధిత విభాగాల అధికారులు స్వీకరిస్తున్నారని తెలిపారు.

4 'ఈనాడు' ఆరోపణ

సచివాలయాల శాఖ అధికారులను సంప్రదిస్తే తమకు సంబంధం లేదని చెబుతున్నారు.

వాస్తవం: బాండ్లు లేకపోయినా ఇప్పటికే చనిపోయిన వారికి నిబంధనల ప్రకారం బీమా పరిహారం అందజేసే అంశంలో ఎలాంటి అడ్డంకులు లేవు. ప్రీమియం చెల్లిస్తున్న గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు బీమా పాలసీ బాండ్లు జారీ చేయాలని ఏపీజీఎల్ఐ డైరెక్టర్‌కు సచివాలయాల శాఖ డైరెక్టర్ కార్యాలయం నవంబరు 1వ తేదీనే లేఖ రాసింది. దాదాపు లక్ష మందికి పైగా ఉద్యోగులకు సంబంధించి ప్రత్యక్ష పద్ధతిలో బాండ్ల జారీ కంటే అందరికీ సీఎఫ్ఎంఎస్ ద్వారా డిజిటల్ బీమా బాండ్ల జారీకి ప్రభుత్వ బీమా శాఖ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి చర్యలు చేపట్టింది.


సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

'మత్తు' వదిలిద్దాం

మొదటి పేజీ తరువాయి

సూచించారు. సీఎం సమీక్షలోముఖ్యాంశాలు ఇవీ..

వారంలో రెండు సమావేశాలు

మాదక ద్రవ్యాలు, అక్రమ మద్యం నిర్మూలనపై ప్రతి మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించాలి. అక్రమ మద్యం, గంజాయి సాగును అరికట్టేందుకు తీసుకున్న చర్యలను ఎక్సైజ్, ఎస్ఈబీ శాఖలు సమీక్షించాలి. ఆ తరువాత ప్రతి గురువారం పోలీసు ఉన్నతాధికారులు సమావేశం కావాలి. జిల్లా ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాదక ద్రవ్యాలు, అక్రమ మద్యాన్ని అరికట్టడం, సచివాలయాల్లో మహిళా పోలీసులతో సమన్వయం, సమర్థంగా దిశ వ్యవస్థ వినియోగం తదితర అంశాలపై సమీక్షించాలి. ఇక నుంచి ఇవన్నీ క్రమం తప్పకుండా పాటించాలి.

14500 టోల్‌ఫ్రీ నంబర్‌తో హోర్డింగ్‌లు

మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రచారం చేపట్టి కాలేజీలు, యూనివర్సిటీల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఎస్ఈబీ టోల్‌ఫ్రీ నంబర్ 14500పై పెద్ద ఎత్తున అవగాహన కల్పించడంతోపాటు మాదక ద్రవ్యాల దుష్పరిణామాలను వివరిస్తూ కాలేజీలు, యూనివర్సిటీల వద్ద భారీ హోర్డింగులు ఏర్పాటు చేయాలి. ఎక్కడా, ఏ విద్యార్థి మాదక ద్రవ్యాల బారిన పడకుండా చూడాలి. రాష్ట్రాన్ని వచ్చే మూడు నాలుగు నెలల్లో సంపూర్ణ మాదక ద్రవ్యాల రహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పోలీసు, ఎక్సైజ్ శాఖలు సమన్వయంతో పని చేయాలి. మన కాలేజీలు, యూనివర్సిటీలు మాదక ద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలి. అందుకోసం అన్ని కాలేజీలు, యూనివర్సిటీల వద్ద నెలరోజుల్లో హోర్డింగుల ఏర్పాటు పూర్తి చేయాలి.

పటిష్టంగా మహిళా పోలీసు వ్యవస్థ

మహిళా పోలీసులు, దిశ వ్యవస్థ, యాప్‌ను ఇంకా పటిష్టం చేయాలి. రాష్ట్రంలో దాదాపు 15 వేల మంది మహిళా పోలీసులు ఉన్నారు. వీరి సేవలను వినియోగించుకుంటూ దిశ వ్యవస్థను మరింత మెరుగ్గా తీర్చిదిద్దాలి. దిశ యాప్ డౌన్‌లోడ్స్ పెరగాలి.

ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు

గంజాయి సాగు విడనాడిన వారికి వ్యవసాయం, ఇతర ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలి. అప్పుడే వారికి శాశ్వత ఉపాధి కల్పించినట్లు అవుతుంది. గంజాయి సాగుదారుల్లో మార్పు తెచ్చేందుకు ఆపరేషన్ పరివర్తన్ పటిష్టంగా నిర్వహించాలి.

అంతా మనవైపు చూసేలా..

మనం చేసే మంచి పనులకు అవార్డులు రావాలి. మన మాదిరిగా సచివాలయాల్లో మహిళా పోలీసు వ్యవస్థ దేశంలో ఎక్కడా లేదు. కాబట్టి మహిళా పోలీసు వ్యవస్థను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి. దానివల్ల మంచి ఫలితాలు రాబట్టవచ్చు. దేశమంతా మనవైపు చూసే స్థాయిలో పనితీరు చూపాలి.

2.82 లక్షల ఆర్‌వోఎఫ్ఆర్ పట్టా భూములు

రాష్ట్రంలో 1.15 లక్షల కుటుంబాలకు దాదాపు 2.82 లక్షల ఎకరాల ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చాం. ఆ భూముల అభివృద్ధికి తీసుకున్న చర్యలపై అధికారులు నివేదిక ఇవ్వాలి.

హాజరైన మంత్రులు, ఉన్నతాధికారులు..

సమావేశంలో ఉప ముఖ్యమంత్రి కె.నారాయణ స్వామి, హోంమంత్రి తానేటి వనిత, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ, ఎక్సైజ్ శాఖ కమిషనర్ వివేక్ యాదవ్, అదనపు డీజీ రవిశంకర్ అయ్యన్నార్, ఎస్ఈబీ డైరెక్టర్ రమేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఎం జగన్‌కు 'నాటా' ఆహ్వానం

అమెరికాలోని డల్లాస్‌లో వచ్చే ఏడాది జూన్ 30 నుంచి జూలై 2 వరకు నిర్వహిస్తున్న తెలుగు మహాసభల్లో పాల్గొనాలని కోరుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను 'నాటా' ఆహ్వానించింది. నాటా ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి కొరసపాటి, ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ప్రతాప్‌రెడ్డి భీమిరెడ్డి, నాటా సభ్యులు సోమవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌ను కలిసి ఆహ్వానపత్రిక అందించారు. – సాక్షి, అమరావతి

24 మంది వైద్యులకు పోస్టింగ్

సాక్షి, అమరావతి: స్పెషలిస్ట్ వైద్యుల పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న ఇంటర్వ్యూల్లో భాగంగా చివరి రోజు సోమవారం ఆర్థోపెడిక్స్ 10, పీడియాట్రిక్స్ 29, ఆప్తమాలజీ 16, రేడియాలజీ 34 పోస్టులు కలిపి 89 పోస్టులను నోటిఫై చేసి వాటి భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహించారు. ఆర్థోపెడిక్స్‌లో 47, పీడియాట్రిక్స్ 59, ఆప్తమాలజీ 28, రేడియాలజీ 8 మంది చొప్పున 142 మంది వైద్యులు ఇంటర్వ్యూకు హాజరై దరఖాస్తులు సమర్పించారు. పరిశీలన అనంతరం మెరిట్ ఆధారంగా సోమవారం రాత్రికి 18 పోస్టులను శాశ్వత ప్రాతిపదికన, 6 పోస్టులను కాంట్రాక్టు విధానంలో భర్తీ చేశారు. మిగిలిన పోస్టులకు మంగళవారం జూమ్ కౌన్సెలింగ్ నిర్వహించి.. పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేస్తారు.

సాధారణ చార్జీలతోనే సంక్రాంతి బస్సులు

సాక్షి, అమరావతి: సంక్రాంతి ప్రత్యేక బస్సు సర్వీసులను కూడా సాధారణ చార్జీలతోనే నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. గత 25ఏళ్లుగా దసరా, సంక్రాంతి సీజన్‌లో ప్రయాణికుల రద్దీని సొమ్ము చేసుకునేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సుల్లో అదనపు చార్జీలు వసూలు చేస్తూ వచ్చింది. కానీ తొలిసారిగా ఈ ఏడాది దసరా సీజన్‌లో ప్రత్యేక బస్సులను సాధారణ చార్జీలతోనే నడిపింది. అదే రీతిలో రానున్న సంకాంత్రి సీజన్‌లో కూడా ప్రత్యేక బస్సులను సాధారణ చార్జీలతోనే నడపనుంది. సంక్రాంతికి సొంతూరు వెళ్లి వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం 6,400 ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు విజయవాడలో సోమవారం విలేకరుల సమావేశంలో సంక్రాంతి ప్రత్యేక బస్సుల వివరాలను వెల్లడించారు.

ప్రత్యేక సర్వీసుల వివరాలు

- సంక్రాంతికి ముందుగా జనవరి 6 నుంచి 14 వరకు 3,120 ప్రత్యేక బస్సు సర్వీసులను నిర్వహిస్తారు. సంక్రాంతి అనంతరం జనవరి 15 నుంచి 18 వరకు 3,280 ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతారు. మొత్తం 6,400 ప్రత్యేక బస్సుల్లో హైదరాబాద్‌తోపాటు తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచే 3,600 బస్సులను ఏపీకి నిర్వహించనుండటం విశేషం. బెంగళూరు నుంచి 430, చెన్నై నుంచి 150 బస్సు సర్వీసులను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు నడుపుతారు.
- రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విజయవాడకు 800 బస్సులు, విశాఖపట్నానికి 450 బస్సులు, రాజమహేంద్రవరానికి 200 బస్సులు, ఇతర ప్రాంతాలకు మరో 770 ప్రత్యేక బస్సులు నడుపుతారు.
- అన్ని బస్సులను జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా పర్యవేక్షిస్తారు.
- ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్‌కు అవకాశం కల్పించారు. ఆర్టీసీ పోర్టల్ (www.apsrtconline.in) ద్వారా నేరుగా రిజర్వేషన్ చేసుకోవచ్చు. ఏటీబీ ఏజెంట్లు, ఏపీఎస్ ఆర్టీసీ యాప్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చు. ఈ సేవలను సక్రమంగా నిర్వహించేందుకు అన్ని జిల్లా కేంద్రాలు, ప్రధాన పట్టణాలు, హైదరాబాద్‌లోని వివిధ పాయింట్ల వద్ద ప్రత్యేకంగా అధికారులు, సిబ్బందిని ఏర్పాటు చేస్తారు.
- ప్రయాణికులకు సమాచారం కోసం 24/7 కాల్‌సెంటర్(0866–2570005)ను ఆర్టీసీ నిర్వహిస్తుంది.
- ఆర్టీసీ అన్ని దూర ప్రాంత సర్వీసులకు వచ్చి వెళ్లేందుకు ముందుగా రిజర్వేషన్ చేసుకుంటే తిరుగు ప్రయాణచార్జీలో 10శాతం రాయితీ కల్పించింది.

'స్థానిక' ఉప ఎన్నికలకు కసరత్తు

- పీఆర్, మున్సిపల్ అధికారులతో ఎస్ఈసీ కార్యదర్శి సమావేశం
- 945 స్థానాలకు ఉప ఎన్నికలు అవసరమని గుర్తింపు
- జనవరిలో కొత్త ఓటర్ల జాబితా వెల్లడించనున్న ఈసీ
- ఆ తర్వాత ఎన్నికల ప్రక్రియ ప్రారంభించే అవకాశం



సాక్షి, అమరావతి: గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో ఉప ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కసరత్తు ప్రారంభించింది. ప్రస్తుతం ఖాళీగా ఉన్న స్థానాల వివరాల సేకరణ కోసం రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి కేఈఆర్‌బీహెచ్ఎన్ చక్రవర్తి సోమవారం పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. మున్సిపల్ శాఖ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, పంచాయతీరాజ్ శాఖ అడిషనల్ కమిషనర్ సత్యనారాయణ ఈ సమావేశానికి హాజరయ్యారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో కోర్టు కేసుల కారణంగా ఎన్నికలు నిలిచిపోయినవి కాకుండా 2021లో ఎన్నికలు జరిగి, గెలిచిన అభ్యర్థుల మరణం, రాజీనామాల కారణంగా ప్రస్తుతం ఐదు జెడ్పీటీసీ, 102 ఎంపీటీసీ, 53 సర్పంచి, 770 వార్డు సభ్యుల పదవులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. ఇదే తరహాలో పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించి 11 డివిజన్ కార్పొరేటర్, నాలుగు వార్డు కౌన్సిలర్ పదవులు ఖాళీగా ఉన్నట్లు నిర్ధారించారు. గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో మొత్తం 945 స్థానాలకు ఉప ఎన్నికలు అనివార్యమని గుర్తించారు. మరోవైపు ఒక మున్సిపల్ చైర్మన్, ఏడు ఎంపీపీ, తొమ్మిది వైస్ ఎంపీపీ, ఐదు కో–ఆప్షన్ సభ్యుల పదవులకు కూడా పరోక్ష పద్ధతిలో ఉప ఎన్నికలు నిర్వహించాల్సి ఉందని తేల్చారు.

కొత్త ఓటర్ల జాబితాలతోనే...

కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం నిర్వహిస్తోంది. జనవరిలో కొత్త ఓటర్ల జాబితాలు విడుదల చేసే అవకాశం ఉంది. ఆ జాబితాల ప్రకారమే స్థానిక సంస్థలకు ఉప ఎన్నికలు నిర్వహించాలని ఎస్ఈసీ, పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు.


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వానపల్లిపాలెంలో మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి విశ్వరూప్


అల్లూరి సీతారామరాజు జిల్లా గిన్నెలకోటలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

గడప గడపకూ మన ప్రభుత్వం


ప్రకాశం జిల్లా మట్టిగుంటలో మహిళకు సంక్షేమ కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు


కృష్ణా జిల్లా పామర్రు వీరాంజనేయపురం కాలనీలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

క్లుప్తంగా...

10 యూఎల్బీల్లో ప్రత్యేక పాలన పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 10 యూఎల్బీల ప్రత్యేకాధికారుల పదవీ కాలపరిమితిని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ పొడిగించింది. ఈనెల 31న, వచ్చే నెల 2, 11 తేదీల్లో ఆయా యూఎల్బీల ప్రత్యేకాధికారుల కాలపరిమితి ముగియనుంది. దీంతో మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి వై.శ్రీలక్ష్మి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాలపరిమితిని పొడిగించిన వాటిలో కందుకూరు, ఆముదాలవలస, నరసారావుపేట, పొన్నూరు, కావలి, వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలు, చింతలపూడి, పొదిలి, అల్లూరు, బి.కొత్తకోట నగర పంచాయతీలున్నాయి.

నిపుణుల పర్యవేక్షణలో చంద్రమౌళికి చికిత్స

హెల్త్ బులెటిన్ విడుదల చేసిన చెన్నై కావేరి ఆస్పత్రి

సాక్షి, చెన్నై: తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో ఏవీ ధర్మారెడ్డి కుమారుడు చంద్రమౌళి ఆరోగ్య పరిస్థితిపై కావేరి ఆస్పత్రి సోమవారం ఉదయం బులెటిన్ విడుదల చేసింది. చెన్నైకు వచ్చిన చంద్రమౌళి ఆదివారం గుండె పోటుకు గురైన విషయం తెలిసిందే. ఆయనకు కావేరి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. కార్డియాక్ అరెస్ట్‌తో 18న చంద్రమౌళి అత్యవసర విభాగంలో చేరినట్లు బులెటిన్‌లో పేర్కొంది. ఐసీయూలో ఉంచి ఎక్మో చికిత్స అందిస్తున్నామని, నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతున్నట్లు వెల్లడించింది. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు భూమన కరుణాకర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అన్నాడీఎంకే తాత్కాలిక ప్రధాన కార్యదర్శి ఎడపాడి కె.పళనిస్వామి తదితరులు ఆస్పత్రికి చేరుకుని ధర్మారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

జగన్ అంటే అభిమానం

తమిళ స్టార్ విశాల్


మాట్లాడుతున్న విశాల్. వేదికపై మోహన్‌బాబు

తిరుచానూరు (తిరుపతి జిల్లా): రాజకీయ నేతల్లో ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే తనకు అభిమానమని తమిళ సినిమా స్టార్ విశాల్ తెలిపారు. లాఠీ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా సోమవారం తిరుపతిలోని పలు కళాశాలల్లో విద్యార్థులతో విశాల్ ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి ఎస్‌డీహెచ్‌ఆర్ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి సీనియర్ నటుడు మంచు మోహన్‌బాబు సైతం హాజరయ్యారు. ఈ సందర్భంగా విశాల్ పలు ఆసక్తికర విషయాలను వ్యక్తం చేశారు. రాజకీయాల్లో ఎవరంటే ఇష్టమని అడిగిన విద్యార్థికి తనకు జగన్ అంటే అభిమానమన్నారు. కుప్పంలో వ్యాపారాలు ఉన్నాయని, అయితే అక్కడ నుంచి తాను పోటీ చేయడం లేదని స్పష్టం చేశారు. ప్రజాసేవ చేయాలంటే రాజకీయాల్లోకే రానవసరం లేదన్నారు. సినిమాల్లో తాను సంతోషంగా ఉన్నానని తెలిపారు. మోహన్‌బాబు మాట్లాడుతూ తాను హీరోగా నటించిన ఎం.ధర్మరాజు ఎంఏ సినిమాకు విశాల్ తండ్రి నిర్మాత అని, ఆ కుటుంబంతో ఎప్పటి నుంచో ఉన్న అనుబంధంతోనే లాఠీ ప్రమోషన్ ఫంక్షన్‌కు వచ్చినట్లు తెలిపారు.

మన్యం గజగజ!

'అల్లూరి' జిల్లాలో భారీగా తగ్గిన ఉష్ణోగ్రతలు

- అరకులోయలో 8.6 డిగ్రీలు..
- మినుములూరులో 9 డిగ్రీలు
- దట్టంగా కురుస్తున్న పొగమంచు

సాక్షి, పాడేరు: చలి తీవ్రతకు మన్యం ప్రాంతం గజగజ వణుకుతోంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో పొగమంచు, చలి గాలుల తీవ్రత పెరగడంతోపాటు ఉష్ణోగ్రతలు భారీగా తగ్గుతున్నాయి. అరకులోయలోని కేంద్ర కాఫీబోర్డు వద్ద సోమవారం ఉదయం 8.6 డిగ్రీలు, పాడేరుకు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మినుములూరు కేంద్ర కాఫీబోర్డు వద్ద 9డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 13.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మినుములూరులో ఆదివారం 10 డిగ్రీలు, అరకులోయలో 15.2 డిగ్రీలు, చింతపల్లిలో 17 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదుకాగా, ఒక్క రోజులోనే మినుములూరు మినహా, అరకులోయ, చింతపల్లి ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు భారీగా తగ్గి చలిగాలులు పెరిగాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచి చలి తీవ్రత పెరగడంతో స్థానికులతోపాటు ఏజెన్సీని సందర్శించేందుకు వచ్చిన పర్యాటకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఏజెన్సీ అంతటా పొగమంచు దట్టంగా కురుస్తోంది. సోమవారం ఉదయం 10గంటల వరకు అరకులోయ, పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట, పెదబయలు, చింతపల్లి ప్రాంతాల్లో పొగమంచు కురిసింది. పది గంటల తర్వాతే సూర్యుడు కనిపించాడు. పొగమంచు కారణంగా లంబసింగి, పాడేరు, అనంతగిరి, దారకొండ, రంపుల, మోతుగూడెం, మారేడుమిల్లి ఘాట్‌రోడ్లలో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


అరకులోయలో సోమవారం ఉదయం 9 గంటలకు దట్టంగా ఉన్న పొగమంచు


పాడేరు ప్రాంతంలో దట్టంగా కురుస్తున్న పొగమంచు

సీఈఎంసీఏ ద్వారా
అధ్యాపకులకు శిక్షణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ కాలేజీల అధ్యాపకుల్లో నైపుణ్యాల పెంపుతో పాటు విద్యలో నాణ్యతను పెంచడానికి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా కామన్వెల్త్ ఎడ్యుకేషనల్ మీడియా సెంటర్ ఫర్ ఆసియా(సీఈఎంసీఏ) సహకారంతో విజయవాడలో ఏర్పాటు చేసిన అధ్యాపకుల శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి ప్రారంభించారు. 4 రోజుల పాటు ఈ శిక్షణ కొనసాగుతుంది. హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా ఇప్పటికే పాఠ్యాంశాల్లో పలు సంస్కరణలు తీసుకువచ్చామని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ఇంటర్న్‌షిప్‌లు, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లను ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆంధ్రా లయోలా కాలేజీ ప్రిన్సిపాల్ కిశోర్, మండలి అకడమిక్ ప్రత్యేకాధికారి బి.ఎస్.సెలీనా పాల్గొన్నారు.

జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు ప్రారంభం

- విజయవాడలో 2 రోజుల పాటు నిర్వహణ
- రాష్ట్రంలోని 24 జిల్లాల నుంచి వచ్చిన కళా బృందాలు


కళాకారులతో నృత్యం చేస్తున్న మంత్రి రోజా

విజయవాడ కల్చరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కళాబృందాల పోటీలు, సాంస్కృతిక సంబరాలు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళా, సాంస్కృతికరంగాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ లలిత కళలతోనే మనో వికాసం కలుగుతుందని చెప్పారు. ఎమ్మెల్యేలు కైలే అనిల్‌కుమార్, మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్, ఏపీ సృజనాత్మక సమితి, సాంస్కృతిక కమిటీ చైర్మన్ వంగపండు ఉష, కృష్ణా జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారిక, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు ప్రసంగించారు. 70 కళా బృందాలు వివిధ అంశాల్లో పోటీ పడ్డాయి.

'వారాహి'ని ప్రజలు పట్టించుకునే పరిస్థితి లేదు:మంత్రి రోజా

వారాంతపు కార్యక్రమాలు చేయడంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ముందు వరుసలో ఉన్నారని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా విమర్శించారు. ఆమె సోమవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ వారాహి యాత్ర వల్ల రాష్ట్రానికి ఒరిగేదేం లేదన్నారు.

'చంద్రబాబు చెంచా పవన్'

సాక్షి, అమరావతి: జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు చెంచాగిరి చేస్తున్నాడని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. బాబు మెప్పు కోసం వారం, పది రోజులకు ఒకసారి ప్రజల మధ్యకు వచ్చి పనికిమాలిన మాటలు మాట్లాడి పవన్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అధికారంలోకి రానివ్వనని పవన్ ప్రగల్భాలకు పోతున్నారని, ఇది ఆయన అజ్ఞానానికి నిదర్శనమని తెలిపారు. బహిరంగ సభల్లో తొడలు కొట్టడం, ఈలలు వేయడం హింసను ప్రేరేపించేలా ప్రసంగాలు చేయడం ఆయనకే చెల్లిందని పేర్కొన్నారు. ఒక జెండా, ఎజెండా లేని వ్యక్తి పవన్ అని విమర్శించారు. రాష్ట్రంలో ఎన్ని నియోజకవర్గాల్లో పోటీ చేయాలన్నదానిపై ఆయనకే స్పష్టత లేదని ఎద్దేవా చేశారు.

చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన వృద్ధుడికి 20 ఏళ్ల జైలు

విశాఖ లీగల్: ముక్కుపచ్చలారని చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన వృద్ధుడికి 20 ఏళ్ల జైలు, రూ.200 జరిమానా విధిస్తూ విశాఖపట్నంలోని పోక్సో కేసుల ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి ఎం.రామ శ్రీనివాసరావు సోమవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 3 నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. బాధితురాలు చిన్నారి కావడంతో నిబంధనల ప్రకారం నాలుగు లక్షలు పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... నిందితుడు సారిక వెంకటరమణ (66) విశాఖపట్నంలోని హెచ్‌బీ కాలనీలో ఉంటున్నాడు. అతను ఆర్టీసీలో రిటైర్డ్ ఉద్యోగి. సమీపంలోని చిన్నారులను తరచూ తన ఇంటికి పిలిచి తినుబండారాలు, చాక్లెట్లు ఇచ్చేవాడు. బాధితురాలు (7) కూడా అదే ప్రాంతంలో ఉంటోంది. బాలిక తల్లిదండ్రులు నిందితుడి ఇంటికి సమీపంలోని ఒక అపార్ట్‌మెంటులోని వాచ్‌మన్‌గా పని చేస్తూ దుస్తులు ఇస్త్రీ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. చిన్నారి దగ్గరలోని ఓ ప్రైవేటు పాఠశాలలో రెండో తరగతి చదివేది. ఈ క్రమంలో 2020 డిసెంబర్ 15వ తేదీ ఉదయం 10 గంటల ప్రాంతంలో నిందితుడు వెంకటరమణ ఆ బాలికకు చాక్లెట్లు ఇస్తా.. అని ఆశచూపి తన ఇంటికి రప్పించుకున్నాడు. ఇంటికి వెళ్లిన చిన్నారిని చిత్రహింసలు పెట్టి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల సమయంలో తమ కుమార్తె కనిపించకపోవడంతో బాలిక తల్లిదండ్రులు చుట్టు పక్కల వెదికారు. బాలిక నీరసంగా ఇంటికి వచ్చింది. విషయం తెలుసుకున్న బాలిక తల్లి ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నేరం రుజువుకావడంతో సారిక వెంకటరమణకు 20 ఏళ్ల జైలు, రూ.200 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

స్థిరంగా.. అల్పపీడనం!

రాష్ట్రంపై 26 నుంచి స్వల్ప ప్రభావం

సాక్షి, అమరావతి/విశాఖపట్నం : మధ్య దక్షిణ బంగాళాఖాతంలో తూర్పు భూమధ్యరేఖ ప్రాంతానికి ఆనుకుని హిందూ మహాసముద్రంలో ఏర్పడిన అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోంది. ఇది రానున్న 24 గంటల్లో పశ్చిమ వాయవ్య దిశలో నెమ్మదిగా కదులుతూ శ్రీలంక తీరం వైపు వెళ్లే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సోమవారం రాత్రి నివేదికలో తెలిపింది. దీని ప్రభావం రాష్ట్రంపై స్వల్పంగా ఉండే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు రాయలసీమ, దక్షిణ కోస్తాలోని పలు జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంపైకి ఈశాన్య, తూర్పు గాలులు వీస్తున్నాయి.

బాబు ఏజెంట్ పవన్

- ఆయన స్క్రిప్ట్ ప్రకారం జనసేనాని నటన: సజ్జల
- మాచర్ల దాడులకు సూత్రధారి చంద్రబాబే



సాక్షి, అమరావతి: జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చంద్రబాబు ఏజెంట్‌లా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. వైఎస్సార్‌సీపీని మళ్లీ అధికారంలోకి రానివ్వబోనని, వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం కానివ్వబోనని పవన్ పేర్కొనటంపై స్పందిస్తూ అధికారంలో ఎవరు ఉండాలో నిర్ణయించేది ప్రజలేనని చెప్పారు. అజ్ఞానం, మూర్ఖత్వంతో చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్ట్ ప్రకారం నటిస్తున్న నటుడు పవన్ కళ్యాణ్ అని ధ్వజమెత్తారు. సంక్షేమాభివృద్ధి పథకాలతో సుపరిపాలన అందిస్తున్న సీఎం జగన్‌ను మళ్లీ సీఎం కావడం తథ్యమని, దీన్ని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అడ్డుకోలేరని సజ్జల స్పష్టం చేశారు. ప్రజలకు ద్రోహం చేశారు కాబట్టే చంద్రబాబు సర్కారును చెత్తబుట్ట పాలు చేశారని చెప్పారు. తాడేపల్లిలో సీఎం క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడారు.

మాచర్ల దాడులకు బాబే సూత్రధారి..

మాచర్లలో టీడీపీ వర్గాలను దాడులకు పురిగొల్పటం ద్వారా చంద్రబాబు తన నిజ స్వరూపాన్ని మరోసారి బయట పెట్టుకున్నారని సజ్జల ధ్వజమెత్తారు. ఏడుగురిని హత్య చేసిన కేసులో ప్రధాన ముద్దాయిగా ఉన్న బ్రహ్మారెడ్డిని మాచర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌గా నియమించడంతోనే విధ్వంసం కుట్రకు తెరతీశారన్నారు. పక్కా ప్రణాళిక ప్రకారం వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ గూండాలతో దాడులు చేయించారన్నారు. చంద్రబాబును సమర్థిస్తూ మాచర్లను చంబల్ లోయతో పోలుస్తూ 'ఈనాడు'లో అభూత కల్పనలు అచ్చేశారని మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని సజ్జల చెప్పారు.

కౌలు రైతులకు కార్డులు..

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఏటా క్యాలెండర్ ప్రకటించి మరీ 50 లక్షల మంది అన్నదాతలకు రైతు భరోసా, పంటల బీమా లాంటి పథకాల ద్వారా పెట్టుబడి డబ్బులు, పరిహారాన్ని అందిస్తోందని సజ్జల గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేని రీతిలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. డ్వాక్రా రుణాల మాఫీ పేరుతో మహిళలను మోసగించి చంద్రబాబు ఎగ్గొట్టిన రూ.26 వేల కోట్లను నాలుగు దఫాలుగా ఇస్తామన్న మాట ప్రకారం సీఎం జగన్ ఇప్పటికే కోటి మంది పొదుపు సంఘాల మహిళలకు రెండు దఫాలు డబ్బులిచ్చారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని పవన్ చెబుతుండటాన్ని బట్టి ఆయనకు ఏమాత్రం జ్ఞానం ఉందో అర్థమవుతోందని సజ్జల ఎద్దేవా చేశారు. సచివాలయ వ్యవస్థను నెలకొల్పి 1.30 లక్షల మందికి సీఎం జగన్ ఉద్యోగాలిచ్చారని గుర్తు చేశారు. వైద్యారోగ్యం తదితర శాఖల్లో కలిపి మొత్తం రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చారని, ఇవేవీ పవన్‌కు కనిపించలేదా? అని నిలదీశారు.

తొలి రోజు ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు

- పలు జిల్లాల్లో క్రీడా పోటీలు
- చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు
- మహిళలకు ముగ్గుల పోటీలు


విశాఖలో మ్యూజికల్ చైర్ ఆడుతున్న మహిళలు

సాక్షి, విశాఖపట్నం/రేణిగుంట/సూళ్లూరుపేట: ఈ నెల 21న సీఎం వైఎస్ జగన్ జన్మదినాన్ని పురస్కరించుకుని మూడురోజులపాటు నిర్వహిస్తున్న వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా తొలిరోజు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో క్రీడా పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. చిరు వ్యాపారులకు తోపుడు బండ్లను పంపిణీ చేశారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కేకే రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, జిల్లా పార్టీ అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు ప్రారంభించారు. అలాగే వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో కోకో, త్రోబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. గాజువాక, భీమిలి నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు తిప్పలనాగిరెడ్డి, ముత్తంశెట్టి శ్రీనివాస్ క్రికెట్ పోటీలను నిర్వహించారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అడారి ఆనంద్‌కుమార్ నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీని పంచకర్ల రమేష్‌బాబు ప్రారంభించారు. అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గంలో 'నవరత్నాలు- సంక్షేమపథకాలు' పేరిట విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల్లో కబడ్డీ, హాకీ పోటీలను ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ప్రారంభించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అరకు, పాడేరు, రంపచోడవరం నియోజకవర్గాల్లో పలుచోట్ల క్రీడా పోటీలు జరిగాయి. వీటిని ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, కె.భాగ్యలక్ష్మి, నాగులాపల్లి ధనలక్ష్మి ప్రారంభించారు. తూర్పు గోదావరి జిల్లాలో ఎంపీ మార్గాని భరత్‌రామ్ మధురపూడి విమానాశ్రయంలో కేక్ కట్ చేశారు. అనపర్తి, గోపాలపురం నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు సత్తి సూర్యనారాయణరెడ్డి, తలారి వెంకట్రావు క్రీడా పోటీలను నిర్వహించారు. తిరుపతి జిల్లా రేణిగుంటలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి వందమంది చిరు వ్యాపారులకు తోపుడుబండ్లను అందజేశారు. సూళ్లూరుపేటలో ఎమ్మెల్యే సంజీవయ్య ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ముగ్గులతో సీఎం జగన్ చిత్రాన్ని ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు.

నేడు, రేపు పలు కార్యక్రమాలు

- జగన్ జన్మదినం సందర్భంగా దేశ, విదేశాల్లో వేడుకలు
- ఈ నెల 20న మొక్కలు నాటడం
- 21న రక్తదాన శిబిరాలు
- వృద్ధులకు పండ్లు, దుస్తులు, అన్నదానం

సాక్షి, అమరావతి: ఈ నెల 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ నెల 20న మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనుంది. ఇందులో భాగంగా స్వచ్ఛంద సంస్థలు, మేధావులు, కుల సంఘాల ప్రతినిధులతో 'జగనన్న పరిపాలన.. రాష్ట్ర సంక్షేమం-అభివృద్ధి'పై చర్చ ఉంటుంది. ఇదే రోజు ముందస్తు జన్మదిన వేడుకలు కూడా నిర్వహిస్తారు. అలాగే ఈ నెల 21న రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో రెడ్‌క్రాస్ సంస్థతో కలిసి పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాలను పార్టీ నిర్వహించనుంది. అనాథ, వృద్ధాశ్రమాల్లో పండ్లు, దుస్తుల పంపిణీ, అన్నదానం వంటి పలు సేవా కార్యక్రమాలు చేపట్టనుంది. అలాగే మహిళలకు పలు అంశాల్లో పోటీలు నిర్వహిస్తారు. పుట్టినరోజు వేడుకల్లో పార్టీ కార్యకర్తలు, ప్రజలు, ముఖ్యంగా మహిళలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయనున్నారు. ఇప్పటికే సీఎం జన్మదిన వేడుకలు సోమవారం ప్రతి నియోజకవర్గ పరిధిలో ప్రారంభమయ్యాయి. గతేడాది సీఎం జగన్ పుట్టిన రోజు సందర్భంగా 38 వేల యూనిట్ల రక్తాన్ని సేకరించి రికార్డు సృష్టించారు. ఇది ఎందరినో అత్యవసర సమయాల్లో ఆదుకుంది. ఈ నేపథ్యంలో ఈసారి కూడా పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తాన్ని సేకరించనున్నారు. ఇలా సేకరించిన రక్తాన్ని భద్రపరిచి అవసరమైన రోగులకు అందిస్తారు. అలాగే రక్తదాతల నుంచి ప్లెడ్జ్ ఫామ్స్ సేకరించి రోగులకు అత్యవసరమైన సందర్భాల్లో రక్తం అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు 'టేక్ ద ప్లెడ్జ్.. సేవ్ ఏ లైఫ్' అనే నినాదంతో.. రక్తదానం చేయడానికి సుముఖంగా ఉన్నవారిని ysrcpblooddonation.comలో నమోదు చేస్తున్నారు. ఆసక్తి ఉన్న వారు పేర్లు నమోదు చేసుకోవచ్చు. డ్వాక్రా, మహిళా, కుల, ప్రజాసంఘాలు, మేధావులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులను భాగస్వాములను చేస్తూ సీఎం పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకుడు లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు.



ఇతరుల పైనుండి కళ్లు తిప్పేసి, తమకు ఉన్న ఆనందాలను చూసుకొని తృప్తి పడటం నేర్చుకుంటేనే గానీ, హృదయాన్ని కాల్చేసే ద్వేషం నశించదు.
– చలం

సాక్షి
మంగళవారం, డిసెంబర్, 20

మరపురాని క్షణాలు

ఫుట్‌బాల్ ప్రియుల జ్ఞాపకాలలో డిసెంబర్ 18 నాటి రాత్రి అనేక సంవత్సరాలు గుర్తుండిపోతుంది. 2022 ఫుట్‌బాల్ ప్రపంచ కప్ ఫైనల్ సాగిన తీరు అలాంటిది. ప్రపంచ ఫుట్‌బాల్ సంఘం 'ఫిఫా' సారథ్యంలో నాలుగేళ్ళకోసారి జరిగే ఈ క్రీడా ఉత్సవంలో అర్జెంటీనా, ఫ్రాన్స్‌ల ఫైనల్ వంద కోట్ల పైచిలుకు మందిని తెర ముందు కట్టిపడేసింది. దిగ్గజాలైన 35 ఏళ్ళ మెస్సీ (అర్జెంటీనా), 24 ఏళ్ళ ఎంబాపే (ఫ్రాన్స్)ల మధ్య పోటాపోటీలో నిర్ణీత 90 నిమిషాలు, ఆపై అదనపు సమయాల్లోనూ ప్రత్యర్థులను సమవుజ్జీలుగా నిలిపిన ప్రతి ఘట్టం కుర్చీ అంచున కూర్చొని చూసేలా చేసింది. చివరకు పెనాల్టీ షూటౌట్‌లో 4–2 గోల్స్ తేడాతో అర్జెంటీనా, ఫ్రాన్స్‌ను ఓడించడంతో ఉద్విగ్నత ముగిసింది. అయితే, ఈ 2022 విశ్వక్రీడా కిరీట పోరాటంపై చర్చ మాత్రం ఇప్పుడప్పుడే ఆగదు.

అర్జెంటీనా కెప్టెన్ మెస్సీ అనేక ఏళ్ళుగా తనను ఊరిస్తున్న స్వప్నాన్ని సాకారం చేసుకున్నారు. 1986 తర్వాత 36 ఏళ్ళకు తమ దేశానికి మరోసారి ప్రపంచ కప్ తెచ్చిపెట్టి, నవతరం క్రీడాభిమానుల్లో తమ దేశానికే చెందిన మునుపటి ఫుట్‌బాల్ మాంత్రికుడు డీగో మారడోనాను మరిపించారు. తమ దేశం సాధించిన ఈ 3వ వరల్డ్ కప్ ట్రోఫీని చిరకాలం గుర్తుంచుకొనేలా చేశారు. ఫుట్‌బాల్ క్రీడాచరిత్రలో 5 వరల్డ్ కప్‌లలో పాల్గొన్న ఆరుగురు ఆటగాళ్ళలో ఒకడిగా నిలిచారు. ఏకంగా 4 ఛాంపియన్స్ లీగ్స్ సహా అనేక ఘనతలు సాధించినా, వరల్డ్‌కప్ ట్రోఫీ మాత్రం చిరకాలంగా మెస్సీకి అందకుండా ఊరిస్తూ వచ్చింది. 2014లో ఆఖరి దాకా వెళ్ళినా, ఆ కలను నెరవేర్చుకోలేకపోయారు.

ఇప్పుడా లోటు భర్తీ చేసుకోవడమే కాక, ఈ వరల్డ్ కప్‌లో ప్రతి నాకౌట్ గేమ్‌లోనూ గోల్ చేసిన అరుదైన ఆటగాడయ్యారు. ఒకటీ రెండు కాదు... 13 వరల్డ్ కప్ గోల్స్ చేసి, దిగ్గజ ఆటగాడు పీలేను సైతం అధిగమించారు. ఫిఫా వరల్డ్ కప్‌లో 2 సార్లు గోల్డెన్ బాల్ ట్రోఫీని గెల్చిన ఏకైక ఆటగాడనే ఖ్యాతి గడించారు. గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ (జీఓఏటీ) పట్టానికి అర్హుడినని నిరూపించారు. పీలే, మారడోనా తర్వాత సరికొత్త ప్రపంచ ఫుట్‌బాల్ దేవుడిగా అవతరించారు. ఫైనల్‌లో హ్యాట్రిక్ గోల్స్‌తో రికార్డు సృష్టించినా, గాయాల బారినపడ్డ ఫ్రాన్స్‌కు కిరీటం కట్టబెట్టలేకపోతేనేం... 23 ఏళ్ళ ఎంబాపే కోట్లాది జనం మనసు గెలిచారు. ప్రపంచం కళ్ళప్పగించే మరో సాకర్ స్టార్ అనిపించుకున్నారు.

కాలం మారింది. తాజా ప్రపంచ కప్ పోటీలు పాత కథను చెరిపేశాయి. వివిధ జట్ల మధ్య అంతరాన్ని చెరిపేశాయి. మరుగుజ్జులని అంతా భావించిన ఆసియా, ఆఫ్రికా ప్రాంత జట్లు ఆకలిగొన్న పులుల లాగా మైదానంలో ప్రత్యర్థి జట్లను వేటాడి, విజయాలు సాధించాయి. ప్రపంచంలో 80 శాతం జనాభా నివసించే ఈ ప్రాంత జట్లు విశ్వవేదికపై ఫేవరెట్లు కాదని అందరూ భావించినా, అగ్రస్థానంలోకి దూసుకొచ్చాయి. ఈ సాకర్ పోరాటంలో జపాన్ జట్టు 2014, 2010 వరల్డ్ ఛాంపియన్స్ జర్మనీ, స్పెయిన్‌లను ఓడించి, ఆశ్చర్యపరిచింది. నరాలు తెగే ఉత్కంఠలోనూ స్థిమితంగా ఉంటూ, పూర్తి భిన్నమైన ఆట తీరు చూపడం జపాన్ జట్టు ప్రధాన కోచ్‌నే అబ్బురపరిచింది.

ఒక్క జపానే కాదు... మొరాకో, సెనెగల్ లాంటి అనేక ఇతర నాన్ ఫేవరెట్ జట్లూ, బలమైన యూరోపియన్ జట్లకు చెమటలు పట్టించాయి. సెమీస్‌కు చేరిన తొలి ఆఫ్రికన్ దేశంగా మొరాకో చరిత్ర సృష్టించింది. ఆసియా, ఆఫ్రికా ప్రాంత జట్లు టైటిల్ విజేతలు కాకపోతేనేం, తమను ఇక తేలిగ్గా తీసుకోవడానికి వీల్లేదని చాటాయి. ఇంకా అనేక ఆశ్చర్యాలకు ఖతర్‌లో సాగిన ఈ 2022 వరల్డ్ కప్ వేదికైంది. జగజ్జేత అర్జెంటీనా సైతం సౌదీ అరేబియా చేతిలో, రన్నరప్ ఫ్రాన్స్ జట్టు ట్యునీసియా చేతిలో మట్టికరిచాయి. టోర్నమెంట్‌కు ముందు ఫేవరెట్లుగా భావించిన బెల్జియమ్, జర్మనీ, డెన్మార్క్‌లు మధ్యలోనే ఇంటి ముఖం పట్టాయి. అయితే, ఆద్యంతం వినోదానికి కొరవ లేదు. అదే సమయంలో స్వలింగ సంపర్కుల ఆకాంక్షలపై షరతులు, వేదికగా నిలిచిన ఖతార్ మానవ హక్కుల రికార్డులపై విమర్శలు, వివాదాలూ లేకపోలేదు.

ప్రపంచమంతటి లాగే భారత్‌లోనూ సాకర్‌పై ఆసక్తి అపారం. మన దేశంలో 1982లో వరల్డ్ కప్ ఫుట్‌బాల్ ప్రత్యక్ష ప్రసారాలు మొదలయ్యాయి. యాంటెన్నాలతో, చుక్కలు నిండిన బ్లాక్ అండ్ వైట్ టీవీలే మహాప్రసాదంగా ప్రపంచ శ్రేణి ఆటగాళ్ళ ఆటను తొలిసారి తెరపై సామాన్యులు చూశారు. ఆ దెబ్బకు అప్పుడే బెంగుళూరులో జరుగుతున్న ఐటీఐ, హెచ్ఏఎల్ లాంటి అగ్రజట్ల మధ్య ఫుట్‌బాల్ లీగ్ మ్యాచ్‌లకు స్టేడియమ్‌లు నిండిపోయాయట. నిజానికి, బెంగాల్, కేరళల్లో సాకర్‌పై పిచ్చి ప్రేమ ఆది నుంచీ ఉన్నదే. ఈసారీ దేశంలో టీవీని దాటి, 11 కోట్ల మందిపైగా వీక్షకులు యాప్‌ల ద్వారా డిజిటల్‌గా ఈ వరల్డ్ కప్ చూశారు. డిజిటల్ వ్యూయర్‌షిప్‌లో ఇది ఓ రికార్డ్. ఇంతగా ప్రేమిస్తున్న ఆటకు ప్రభుత్వ ప్రోత్సాహమెంత? విశ్వవేదికపై కనీసం క్వాలిఫై కాని మన ఆట తీరేంటి?

ఈ వరల్డ్ కప్ ఫైనల్ దెబ్బతో 1998లో స్థాపించిన గూగుల్ సెర్చ్‌లో గత పాతికేళ్ళ చరిత్రలో ఎన్నడూ లేనంతటి రద్దీ ఆదివారం ఏర్పడింది. ఫైనల్ విశేషాలు ఎప్పటికప్పుడు తెలుసుకొనేందుకు జనం ఆతురత చూపారు. క్రికెట్ లాంటివెన్ని ఉన్నా, ప్రపంచం మొత్తాన్నీ ఉర్రూతలూపేది ఫుట్‌బాల్ అనేది అందుకే. అదే సమయంలో క్రీడాస్ఫూర్తిని పెంచాల్సిన ఆటలో ఫలితాలు వచ్చాక గ్రూప్ దశలో, ఫైనల్ తర్వాత ఫ్రాన్స్ సహా వివిధ దేశాల్లో విధ్వంసాలు రేగడం విషాదం. మారాల్సిన వికృత నైజానికివి నిదర్శనం. ఏమైనా, ఇవన్నీ 2026లో వచ్చే వరల్డ్ కప్‌కు పాఠం కావాలి. వర్ణాలు, వర్గాలకు అతీతంగా ఫుట్‌బాల్ గెలవాలి. వట్టి మెస్సీ, ఎంబాపేల నామ జపం కన్నా అది ముఖ్యం.



గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, **తిథి:** బ.ద్వాదశి రా.9.26 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** స్వాతి ఉ.6.51 వరకు, తదుపరి విశాఖ, **వర్జ్యం:** ప.12.17 నుండి 1.50 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.37 నుండి 9.22 వరకు, తదుపరి రా.10.38 నుండి 11.31 వరకు, **అమృతఘడియలు:** రా.9.40 నుండి 11.14 వరకు.



సూర్యోదయం: 6.28
సూర్యాస్తమయం: 5.26
రాహుకాలం: ప. 3.00 నుంచి 4.30 వరకు
యమగండం: ఉ.9.00 నుంచి 10.30 వరకు

గట్టివాళ్లే చట్టానికి గౌరవం



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

నాటి పాలకులు దేశంలో 'ఎమర్జెన్సీ విధించి, న్యాయవ్యవస్థకే సవాలుగా పరిణమించినప్పుడు... జస్టిస్ హెచ్.ఆర్. ఖన్నా ఒక్కరు మినహా మొత్తం సుప్రీంకోర్టు యావత్తూ అచేతనంగా ఉండిపోయిందన్న విమర్శలు వచ్చాయి. అలాంటి రోజులు 'మళ్లీ ఇప్పుడు దాపురించాయా అనిపిస్తోంది' అని జస్టిస్ ఎ.పి. షా తన తాజా వ్యాసంలో వ్యాఖ్యానించారు. ప్రస్తుత పాలకులు ఇందిరాగాంధీలా నూటిగా తలపడినట్టు కన్పించకపోవచ్చుగానీ, ప్రజాస్వామ్య సంస్థలను నర్మగర్భంగా శక్తిహీనం చేస్తూ పౌరహక్కులకు భంగం కలిగించడం చూస్తున్నామని ఆ వ్యాసంలో ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో.. ఇటీవల కొందరు గట్టివాళ్ళ హయాంలలో కోర్టు తన వాణిని బలంగా వినిపించగలగడం న్యాయ వ్యవస్థపై నమ్మకం కలిగిస్తోందని పేర్కొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో జరిగే ఆర్థిక నేరాలను, దొంగచాటు ద్రవ్య లావాదేవీలను, సంబంధిత నేరాలను పసిగట్టి సాధికారికంగా బహిర్గతం చేసి.. దేశాలను, ప్రభుత్వాలను హెచ్చరించడానికి ప్రసిద్ధ న్యాయ నిపుణులతో ప్యారిస్ కేంద్రంగా ఏర్పడి పనిచేస్తున్న ఫ్రెంచి ఎన్జీవో సంస్థ 'షెర్పా'! యూరప్, లాటిన్ అమెరికా, ఆఫ్రికా ఖండాలలోని పౌర సమాజాల సాంఘిక సంస్కరణోద్యమాలకు ఈ సంస్థ బాసటగా నిలుస్తోంది. ఇదే నిపుణుల సంస్థ రాఫెల్ కొనుగోలు వ్యవహారంలోని చీకటి కోణాలను కూడా వెలికి తెచ్చింది. 2015 నుంచీ పనిచేస్తున్న 'రిలయెన్స్ డిఫెన్స్ లిమిటెడ్' కంపెనీ.. 'దస్సాల్ట్' అనే ఫ్రెంచి విమాన కంపెనీతో అనుసంధానమై 36 రాఫెల్ జెట్ విమానాలను భారత ప్రభుత్వం తరఫున కొనుగోలు చేసింది. రిలయెన్స్ కంపెనీ అధిపతి అనిల్ అంబానీ 2019లో ప్రకటించిన లెక్కల ప్రకారం అప్పటికి అతనికున్న అప్పులు రూ. 93,000 కోట్లు. కాగా, 2020లో ఒక కేసు సందర్భంగా లండన్ కోర్టులో ఆయన వెల్లడించిన తన ఆస్తి విలువ 'సున్న' (జీరో)! అలాంటి 'జీరో' ఆస్తిపరుడి కంపెనీ ద్వారా ఫ్రెంచి దస్సాల్ట్ విమాన కంపెనీ 36 రాఫెల్ జెట్ విమానాలను ఎలా అమ్మగలిగిందన్న అంశం బట్టబయలు కావడంతో, రిలయెన్స్ కంపెనీ లావాదేవీలతో ముడిపెట్టుకున్న భారతపాలకుల మెడకు చుట్టుకొంది.

ప్రభుత్వం ఈ క్షణం దాకా రాఫెల్ కుంభకోణం నుంచి బయట పడకపోగా భారతదేశ ప్రయోజనాలకు హానికరమైన అంతర్జాతీయ లావాదేవీలలో కూరుకుపోయిందని 'షెర్పా' బహిర్గతం చేసింది. 'షెర్పా' సంస్థ విఖ్యాతికి రెండే రెండు ఉదాహరణలు ఒకటి: సిరియా మాజీ వైస్–ప్రెసిడెంట్ రిఫాత్ అల్ అసాద్ 'మనీ లాండరింగ్' కుంభకోణాలను 'షెర్పా' బట్టబయలు చేయడంతో అసాద్‌కు ప్యారిస్ కోర్టు నాలుగేళ్ల కఠిన జైలు శిక్ష వేసింది. రెండు: ఫ్రాన్స్‌లో టెర్రరిస్టులకు భారీగా చందాలిచ్చి ప్రోత్సహిస్తున్న పెద్ద కంపెనీ లఫార్గే కార్యకలాపాల్ని 2018లో బహిర్గతం చేసి కంపెనీ ఉద్యోగుల ప్రయోజనాల్ని షెర్పా రక్షించగల్గింది. రాఫెల్ విమానాలను తయారు చేసే ఫ్రెంచి కంపెనీలకు బదులుగా.. అప్పటికే దేశీయంగా అత్యుత్తమ నాణ్యతా సేవలందిస్తున్న భారీ ప్రభుత్వరంగ విమాన సంస్థ 'భారత హిందుస్థాన్ లిమిటెడ్' సేవలను పాలకులు ఎందుకు వినియోగించుకోలేదన్నది ప్రధాన ప్రశ్న. దీంతోనే షెర్పా ఈ రిలయెన్స్ ఒప్పందం వెనుక ఏం జరిగిందన్నదానిపై దృష్టి సారించింది. ఈ కాంట్రాక్టులో ఎలాంటి అనుమానానికి తావులేని అవినీతి జరిగిందని, కాంట్రాక్టుపై ఉమ్మడి పార్లమెంటరీ కమిటీ విచారణ జరపాల్సిందేనని రాహుల్ గాంధీ కోరిన విషయమూ తెలిసిందే. కానీ, ప్రభుత్వం విచారణకు నిరాకరించడంతో, రిలయెన్స్ కంపెనీ ద్వారా కొనుగోలు ప్రక్రియ ముందుకు సాగింది. తద్వారా అనుమానాలు ధ్రువపడ్డాయి. అందుకే 'షెర్పా' సంస్థ స్వతంత్రమైన న్యాయమూర్తి ద్వారానే బీజేపీ–రిలయెన్స్ సంబంధాల లోతుపాతుల్ని పరిశీలించడం దేశ ప్రయోజనాల దృష్ట్యా అవసరమని చాలాకాలంగా కోరుతోంది. అంతేగాదు, రిలయెన్స్ ద్వారా ప్రస్తుత పాలకులు కుదుర్చుకున్న 'రాఫెల్' ఒప్పందంలో అవినీతిని కనిపెట్టే ఏ క్లాజుకూ అవకాశం లేకుండా జాగ్రత్త పడటం జరిగిందని 'హిందూ' పత్రిక కూడా రాసిందని 'షెర్పా' పేర్కొంది. ఒక్క ముక్కలో 'భారతదేశ ప్రయోజనాలను దెబ్బతీసే అంతర్జాతీయ అవినీతి శక్తులకు ప్రతిబింబమే రాఫెల్ ఒప్పందమ'ని షెర్పా ప్రకటించింది. షెర్పాకు ఇంత బలాన్ని చేకూర్చింది ఆ సంస్థలోని న్యాయ నిపుణులేనన్నది ఇక్కడ గమనించాలి.

రెండో మాట



ఈ పరిణామాల్ని దృష్టిలో పెట్టుకున్నప్పుడు, భారత లా కమిషన్ మాజీ అధ్యక్షులు, ఢిల్లీ, మద్రాసు హైకోర్టుల మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అజిత్ ప్రకాష్ షా తాజా హెచ్చరికను కూడా భారత రాజ్యాంగ మౌలిక నిబంధనలను, సత్యాలను రక్షించుకోగోరే వారంతా పరిగణనలోకి తీసుకోవాలి. ఇటీవల నూతనంగా దేశ ఉపరాష్ట్రపతి పదవిలోకి వచ్చిన జగదీప్ ధంకర్, కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజూ భారత సుప్రీం కోర్టుపైన, కొలీజియం వ్యవస్థపైన అసహనం వ్యక్తం చేస్తూ వచ్చారు. చివరికి భారత మౌలిక రాజ్యాంగ వ్యవస్థ రక్షణకు దోహదం చేసిన సూత్రాలను కూడా విస్మరించి దేశ న్యాయ వ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తినే ప్రశ్నించే విధంగా వ్యాఖ్యలు చేయడాన్ని జస్టిస్ షా ఖండించాల్సి వచ్చింది. ''ఈ ధోరణి 2014 నుంచీ సాగుతూనే ఉంది. సుప్రీం కోర్టు అనేది రాజ్యాంగ పరిరక్షకురాలు, చట్టాన్ని శాసించే శక్తి అని మరువరాదు'' అని జస్టిస్ షా పేర్కొన్నారు. దేశంలో ఇందిరాగాంధీ 'ఎమర్జెన్సీ విధించి, దేశ న్యాయ వ్యవస్థకే సవాలు విసరడానికి పూనుకున్నప్పుడు, పౌర హక్కులు తుడిచిపెట్టుకు పోతున్నప్పుడు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హెచ్.ఆర్. ఖన్నా ఒక్కరు మినహా మొత్తం సుప్రీంకోర్టు అలా చూస్తూ ఉండిపోయిందన్న విమర్శలు ఉన్నాయి. అలాంటి రోజులు మళ్లీ ఇప్పుడు దాపురించాయా అనిపిస్తోంది'' అని జస్టిస్ షా గుర్తు చేయవలసి వచ్చింది. ప్రస్తుత పాలకులు ఇందిరా గాంధీలా నూటిగా తలపడినట్టు కన్పించకపోవచ్చుగానీ, ప్రజాస్వామ్య సంస్థలను నర్మగర్భంగా శక్తిహీనం చేస్తూ పౌరహక్కులకు భంగం కలిగించడం చూస్తున్నామని జస్టిస్ షా తాజా వ్యాసంలో పేర్కొన్నారు.

''2014 తర్వాత దేశంలో 'లోక్‌పాల్' వ్యవస్థ కనుమరుగు అయిపోయింది. జాతీయ మానవ హక్కుల పరిరక్షణ కమిషన్ నేడు కనపడదు. ఉన్న విచారణ సంస్థలు పేరుకే! పైగా వాటిని ఇప్పుడు ప్రభుత్వ చర్యలను విమర్శించి లేదా నిరసన తెలిపే ప్రజా కార్యకర్తలు, జర్నలిస్టులు, విద్యార్థులు, రాజకీయ ప్రత్యర్థులపైన ప్రయోగిస్తున్నారు'' అని జస్టిస్ షా పేర్కొన్నారు. రానురాను కేంద్ర ఎన్నికల సంఘం కూడా రాజీపడే దుఃస్థితికి చేరిందని, ఇక సమాచార కమిషన్ కూడా జీవచ్ఛవం అయిందనీ, ఇలా బాధ్యతలు చాలించుకున్న సంస్థల జాబితా పెరిగిపోతోందని, చివరికి పత్రికలు, పౌర సంస్థల కార్యకలాపాల్ని కూడా బలహీన పరిచి విశ్వవిద్యాలయాల్ని నిర్వీర్యం చేయడం జరుగుతోందనీ జస్టిస్ షా ఆందోళన వ్యక్తం చేశారు. ఆఖరికి సుప్రీంకోర్టు కూడా దేశ పాలక వర్గ ఒత్తిళ్లకు తలొగ్గాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని జస్టిస్ ఎ.పి. షా ఘాటుగా విమర్శించారు. ఎటుతిరిగీ ఇటీవల ప్రధాన న్యాయమూర్తులుగా పదవులు స్వీకరించిన జస్టిస్ ఎన్.వి. రమణ, లలిత్, డి.వై. చంద్రచూడ్‌ల హయాంలలో కోర్టు తన వాణిని బలంగా వినిపించగల్గుతోందని జస్టిస్ షా చెబుతూ తన నమ్మకాన్ని ఇలా ప్రకటించారు: ''నేడు సుప్రీంకోర్టు మంచి న్యాయమూర్తుల చేతులలో ఉంది. పాలకుల ఒత్తిళ్లకు లొంగకుండా వారు పనిచేస్తున్నారు. అప్పటికీ పాలకులు దారికి రాకపోతే, దేశ చట్టాన్ని గౌరవించి తీరాలని వారికి తెలియచెప్పాలి. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికీ ఇదే మార్గం'' అని జస్టిస్ షా దిశానిర్దేశం చేశారు. ఈ సదవగాహన దృష్ట్యా చూస్తే సుప్రీం ప్రధాన న్యాయమూర్తి పదవిని స్వీకరించిన మరుక్షణం నుంచీ జస్టిస్ డి.వై. చంద్రచూడ్, ఆయన సోదర న్యాయమూర్తులు.. 'దేశంలో పౌరుల స్వేచ్ఛ, తదితర హక్కులకు న్యాయ స్థానాలే రక్ష అని పునరుద్ఘాటించారని భావించాలి.

ఎన్నో కష్టాలను ఓర్చుకుంటూ వచ్చి భారత ప్రజలు పోరాటాల ద్వారా సాధించుకున్న సమాచార హక్కు చట్టాన్ని గత ఎనిమిదేళ్లుగా పాలకులు చాపచుట్టి పక్కన పడేశారన్న విమర్శ ఉంది. ఆ చట్టాన్ని తు.చ. తప్పక సద్వినియోగం చేసిన పర్యవ సానంగా పాలకుల ఒత్తిళ్లను ఎదుర్కొన్న ఒక జాతీయ కమిషనర్.. 'సమాచార హక్కు కోసం' ప్రజలు జరిపిన పోరాటాలు జ్ఞప్తికి వచ్చినప్పుడల్లా తన బాధ్యతను కాపాడుకుంటూనే ఉన్నారు. ఈ సందర్భంలో.. యాభై ఏళ్ల క్రితం ఒక సన్మాన సభలో మహాకవి కృష్ణశాస్త్రి అన్న మాటలు గుర్తుకొస్తున్నాయి. ''మనిషితో ఎడతెగని సావాసమూ, ప్రేమిస్తే ఆనందం, దూరమైతే బాధతో కొట్టుకు పోవడం – ఇవే నాకు తెలుసు. ఇది నా మతం, నాకిక వేరే మతం లేదు, కులం అసలే లేదు. నేను మనిషిని'' అని ఈ లోకంలో ఎంతమంది చాటుకోగలరు?!

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అప్పుడు చూద్దాం



రైల్వేలో గత నాలుగేళ్లుగా నియామకాలు నిలిచిపోయాయి. ఇప్పుడు ఉన్నవారే ఒక్కొక్కరూ రెండు మూడు విభాగాలు నిర్వహిస్తున్నారు. అంటే ఒక వేతనంతో రెట్టింపు లేదా అంతకు మించిన పని! మొదట ఉపాధిని కల్పించండి. తర్వాత వరల్డ్ లీడర్‌గా ఎదగొచ్చు.
– టాల్ బకోలియా, సోషల్ వర్కర్

ఎట్టైనా గ్రేటే!



ట్రోఫీ అందుకుంటున్నప్పుడు మెస్సీ ధరించి ఉన్న బిష్త్ గౌన్ ప్రత్యేకత గురించి గూగుల్‌లో చదువుతూ కూర్చున్నా. సుల్తానులు, ఇతర గొప్ప వ్యక్తుల కోసం తయారయ్యే బిష్త్‌లో ప్రధానంగా మేక (గోట్) ఉన్నిని ఉపయోగిస్తారు. అలా చూసినా మెస్సీని అందరూ 'గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) అనడం సరిగ్గా సరిపోయింది.
– ఆడమ్ లెవెన్తాల్, బ్రాడ్‌క్యాస్టర్

శుభాకాంక్షలు



కాంగ్రెస్ పార్టీ పెంచి పోషించిన ప్రతిభాపాటిల్‌కు మనస్ఫూర్తిగా జన్మదిన శుభాకాంక్షలు. రాష్ట్రపతిగా ఉన్న సమయంలో ఆమె తన మనవరాళ్లతో కలిసి విదేశీ పర్యటనలకు వెళ్లడం కోసం 225 కోట్ల రూపాయల ప్రజాధనాన్ని నిస్సంకోచంగా ఖర్చుచేసి, 24 దేశాలు తిరిగొచ్చిన సంగతి కూడా ఇప్పుడు నాకు స్ఫురిస్తోంది.
– ధ్రువ్ తారిక, పొలిటికల్ అబ్జర్వర్

ఒకవైపే చూపు



బీజేపీ ఎల్లప్పుడూ.. ముస్లింలు ఏం చేస్తున్నారు, ముస్లింలు ఏం చెయ్యట్లేదు అనే ధ్యాసతో ఉండే బదులు.. అసలు తామేం కోరుకుంటున్నారో ఒక్కసారైనా ఎందుకు ఆలోచించరు! జంతుబలి కావాలంటే వాళ్లు చేసుకోవచ్చు, ఎవరికీ ఇబ్బంది లేదు. కానీ హలాల్‌ను నిషేధించాలనే ఉత్సాహం వారికి ఎందుకు?!
– జియావుర్ రెహమాన్ సిద్ధిఖి, ఇండియన్

గోవా విముక్తి



స్వాతంత్ర్యోద్యమంలో సంఘ్ పరివార్ పాత్ర ఏమిటని ప్రశ్నించే వారికి... స్వాతంత్ర్యానంతరం గోవా విముక్తి కోసం జరిగిన ప్రయత్నాలలో సంఘ్ ఎంత కీలకమైన కృషి సల్పిందో ఏమీ తెలీదనే అనుకోవాలి.
– శివమ్, రాథోడ్, ఉజ్జయిని కార్యకర్త

లింగ సమానత్వం!!



విడాకుల కోసం కోర్టుకు వెళ్లిన ఓ భర్తను... మధ్యంతర భరణంగా నెలకు 40 వేలు, కేసుకు అయిన ఖర్చులకు 70 వేలు ఇవ్వాలని ఫ్యామిలీ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. మధ్యప్రదేశ్ హైకోర్టు ఆ మొత్తాలను 10 వేలకు, 30 వేలకు తగ్గించింది. లింగ సమానత్వం! అన్నట్లు ఆమె ప్రొఫెషనల్ డాక్టర్. భరణంగా ఆమె అడిగిన మొత్తం సంగతికొస్తే... నెలకు 2 లక్షలు!
– వాయిస్ ఫర్ మెన్, ఎన్జీవో

పాట నచ్చింది



నరోత్తమ్ మిశ్రా (ఎంపీ హోమ్ మినిస్టర్) వంటి రాజకీయ నాయకులు ఏళ్ల తరబడి కష్టపడుతున్నా చేయలేని పనిని, వచ్చే నెల విడుదల కానున్న 'పఠాన్' సినిమా పాటలోని ఒక 30 సెకన్ల సన్నివేశంతో దీపికా పదుకోన్ చేయగలిగారు. కాషాయాన్ని మన దేశానికి ఇష్టమైన వర్ణంగా ఆమె మార్చేశారు!
– కస్తూరి శంకర్, యాక్టర్ – యాక్టివిస్ట్

సహజ నైపుణ్యాన్ని ఉపయోగించుకోవాలి

సందర్భం



వనం జ్వాలా నరసింహారావు

ఈ మధ్యన ఒకటి–రెండు సందర్భాలలో మెకానికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్ చదువుతున్న ఒకరిద్దరు చురుకైన విద్యార్థులను కలవడం సంభవించింది. వాళ్లతో మాటా–మాటా కలిపి, వారి–వారి ప్రొఫెషనల్ విద్యాభ్యాసంలో భాగంగా ఏం నేర్చుకుంటున్నారూ, అధ్యాపకులు ఏం నేర్పిస్తున్నారనీ ప్రశ్నిస్తే, వారిదగ్గర నుండి ఆశించిన సమాధానం రాలేదు. మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి అయిన తరువాత ఏరకమైన మెషిన్లమీద పనిచేస్తావని ప్రశ్నిస్తే తెలియదని అమాయకంగా వచ్చింది జవాబు. కంప్యూటర్ ఇంజనీరింగ్ తరువాత సరాసరి ఏదైనా ప్రోగ్రామింగ్ చేయగలరా అంటే దానికీ జవాబు లేదు. సివిల్ ఇంజనీరింగ్ తరువాత ఎలాంటి ప్రాజెక్టులలో పనిచేయాలని అనుకుంటున్నావని అడిగితే అసలే అర్థం కాలేదు. అందరూ విద్యార్థులూ ఇలాగేనా అంటే కావచ్చు, కాకపోవచ్చు. స్వతహాగా తెలివైన కొందరి విషయంలో మినహాయింపు ఉండవచ్చు. ఇంజనీరింగ్ లాంటి ప్రొఫెషనల్ కోర్సులన్నీ ఇటీవల కాలంలో 'నాలెడ్జ్ బేస్డ్' (అంతంత మాత్రమే) తప్ప 'స్కిల్ బేస్డ్' కాకపోవడమే బహుశా దీనికి కారణం కావచ్చు.

ఇదిలా ఉంటే ఎలాంటి ఫార్మల్ ఎడ్యుకేషన్ లేకుండా రకరకాల వృత్తి నిపుణులు మన దేశంలో, రాష్ట్రంలో కోకొల్లలు. వారంతా స్వయంశక్తితో వారి వారి వృత్తుల్లో ఎలా ప్రావీణ్యం సంపాదించుకున్నారో అనేది కోటి రూకల ప్రశ్న. వారిలో గ్రామీణ వృత్తులు మొదలుకుని, పట్టణాలలో, నగరాలలో పనిచేస్తున్న వాహనాలు, ఎయిర్ కండీషన్‌లు వంటి వాటిని బాగుచేసే మెకానిక్కులు చాలామందే ఉన్నారు. వీరు రిపేర్లు చేయడానికి వచ్చేటప్పుడు తమ వెంట ఒక జూనియర్ కుర్రవాడిని తీసుకు వస్తారు. అతడు కొంతకాలానికి సీనియర్ అయిపోతాడు. అందుకే ఇటువంటివారు నేర్చుకున్న విద్య భావితరాలవారికి అందుబాటులోకి తీసుకువచ్చే విధానం ప్రవేశపెట్టాలి. వీరికి సంబంధిత విద్యార్హతలు లేకపోయినా ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులకు ప్రాక్టికల్స్ చెప్పేటప్పుడు ఉపయోగించుకునే విధానం రూపొందిస్తే మంచిదేమో! యాభై, అరవై ఏళ్ల అనుభవంతో చేస్తున్న సూచన ఇది.

చేతి గడియారం పనిచేయకపోతే, కంపెనీ షోరూమ్‌కు పోయి ఇస్తే బాగుచేసి ఇవ్వడానికి సమయం పట్టే అవకాశాలున్నాయి కాబట్టి, ఎప్పటిలాగే, అలవాటున్న ఒక రిపేర్ షాప్‌కు పోయాను ఇటీవల. ఆ చిన్న షాప్‌లో ఎప్పటిలాగే ఇద్దరు నిశ్శబ్దంగా పనిచేసుకుంటూ కూర్చున్నారు. ఆ ఇద్దరిలో సీనియర్ వ్యక్తి (బహుశా) బ్యాటరీ కొత్తది వేయాలని చెప్పి రూ. 220 అవుతుందన్నాడు. నేను సరే అనగానే ఐదు నిమిషాలలో ఆ



పని కానిచ్చి నా చేతిలో పెట్టాడు. గత ఏభై ఏళ్లుగా... తన తండ్రి కాలం నుంచి అక్కడే రిపేర్లు చేస్తున్నామనీ, గడియారాలు రిపేరు చేసే విద్య ఎప్పటినుంచో తనకు వచ్చనీ, ఎలా అబ్బిందో తెలియదనీ, ఎక్కడా నేర్చుకున్నది కాదనీ అన్నాడు.

ఇటీవల మనం వాడుకునే వస్తువులు చెడిపోయినప్పుడు ఎక్కువగా కంపెనీల సర్వీసింగ్ మెకానిక్‌లను పిలవకుండా స్వంతంగా నేర్చుకున్న పనితనంతో తక్కువ ధరకు సర్వీసు చేసి పోతున్న లోకల్ టాలెంట్‌లనే వినియోగదారులు ఆశ్రయించడం వీరికి ఉన్న విశ్వసనీయతను తెలియజేస్తోంది. ఇటువంటి నేచురల్ టాలెంట్ ఉన్న వారు అన్ని రంగాల్లోనూ ఉన్నారు. మా చిన్నతనంలో ఖమ్మం పట్టణంలో మేమున్న మామిళ్ళగూడెం బజారులో (లంబాడి) రాము అని ఆర్టీసీలో మెకానిక్‌గా పని చేస్తున్న వ్యక్తి ఉండేవాడు. అతడు ఏ మెకానికల్ ఇంజనీరింగ్ చదువుకోలేదు. కాని అద్భుతమైన రీతిలో మెకానిజం తెలిసిన వ్యక్తి. ఆ రోజుల్లో ఖమ్మంలో కార్లు, జీపులు బహుశా చాలా తక్కువ. వాటికి కానీ, లారీలకు కానీ ఏ విధమైన రిపేర్ కావాలన్నా రామునే దిక్కు. రాముకు సహజ సిద్ధంగా అబ్బిన విద్య అది. అప్పట్లో హైదరాబాద్‌లో మా బంధువు లబ్బాయి ఒకడిది అద్భుతమైన మెకానికల్ బ్రెయిన్. ఇంకా కంప్యూటర్లు ప్రాముఖ్యం చెందని రోజుల్లో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌లలో నైపుణ్యం సంపాదించాడు. ఎట్లా నేర్చుకున్నాడో, ఎవరికీ తెలియదు. ఇంటర్మీడియేట్ చదవడానికి ప్రయత్నం చేశాడు. కుదరలేదు. స్నేహితుల సహాయంతో అమెరికా చేరుకున్నాడు. చిన్నగా హార్డ్‌వేర్ మెకానిజంలో పేరు తెచ్చుకున్నాడు. ఎన్నో కంపెనీలు అప్పట్లో అతడి మీద ఆధారపడేవి. అంచెలంచెలుగా ఎదిగి ఫార్మల్ డిగ్రీలు లేకపోయినా నైపుణ్యం ప్రాతిపదికగా అక్కడ స్థిరపడిపోయాడు. అతడా విద్య ఎలా నేర్చుకున్నాడు?

చాలా కాలం క్రితం ఆంధ్రాబ్యాంక్‌లో కొఠారి చలపతి రావు అనే ఆయన పనిచేసేవారు. అక్కడ చేరడానికి ముందర కొన్ని చిన్నచిన్న ఉద్యోగాలు కూడా చేశాడు. ఇంకా అప్పటికి కంప్యూటర్లు పూర్తి స్థాయిలో వాడకంలోకి రాలేదు. కేవలం మామూలు గ్రాడ్యుయేట్ మాత్రమే అయిన కొఠారి చలపతి రావు స్వయంగా నేర్చుకుని ఆంధ్రా బ్యాంక్ కంప్యూటర్ సిస్టం ఏర్పాటు చేశాడు. ఆయన్ని అంతా కంప్యూటర్ భీష్మ పితామహుడు అని పిల్చేవారు. ఆయన ఆ విద్య ఎలా నేర్చుకున్నాడు?


వీరిలాంటి అనేకమంది సహజ నైపుణ్యం ఉన్నవారిని ప్రొఫెషనల్ కోర్సుల కాలేజీలలో క్వాలిఫికేషన్ లేకపోయినా అయినా ఉపయోగించుకోవాలి. అప్పుడే సాంకేతిక విద్య అభ్యసించే విద్యార్థులకు మంచి నైపుణ్యం అందుబాటులోకి వస్తుంది.

వ్యాసకర్త చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్, తెలంగాణ ప్రభుత్వం

పరమాత్మ సమాగమం

ఆండాళ్ రచించిన 143 పాశురాలలో నాచ్చియార్ తిరుమొళిలో ఆరవదైన 'వారణ మాయిరం' అనే మకుటంతో ప్రసిద్ధిపొందిన పది పద్యాలలో గోదాదేవి తన స్వప్నవృత్తాంతంలో శ్రీమన్నారాయణుడితో జరిగిన తన వేదోక్త వివాహాన్ని వివరిస్తుంది.

జీవాత్మ పరమాత్మను కాంక్షించి, పొందటమనే విషయానికి ప్రతీక ఐన గోదా చరితం శ్రీవైష్ణవ భక్తిభావనకు ఒక కొత్తకోణాన్ని ఆవిష్కరించింది. ఆమె తండ్రితో సహా పలువురు మహాభక్తులైన ఆళ్వారులు గోదా చూపిన పథాన్ని అనుసరించి తరించారు. ఈ దశ పాశురాలను నేటికీ శ్రీవైష్ణవ సంప్రదాయ వివాహాలలో విధిగా గానం చేస్తారు. ఈ పాశురాలలో మహాభక్తురాలు ఆండాళ్ తాత్త్వికమైన, నిగూఢమైన అంతరార్థాలు నిబిడీకృతం చేసింది. ఏ హిందూ సంప్రదాయ



వివాహమైనా ఈ పాశురాలలో శతాబ్దాల క్రితం ఆండాళ్ వర్ణించిన ఆచారాలే పునాదిగా జరుగుతాయి. ఎదుర్కోళ్ళు, నిశ్చయార్థం, ఆడపడుచు పెళ్ళికూతురికి పెళ్లి వస్త్రాలు, తదితర అలంకారాలు చెయ్యటం; విఘ్న నివారణ, పాణిగ్రహణం, అగ్ని ప్రదక్షిణ, సప్తపది, శిలారోహణం, లాజ హోమం, మంత్రించిన పసుపు నీరు చల్లటం, పురప్రదక్షిణ (ఊరేగింపు) సంప్రదాయాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. మాంగల్యధారణ గురించిన ప్రస్తావన లేని కారణం వేదోక్తమైన మంత్ర పఠనమేదీ లేకపోవటమే! కాశీయాత్ర, గృహప్రవేశం, ఊంజల్ (ఉయ్యాల ఊగే) వేడుక మొదలైనవన్నీ కాలగతిలో, తదుపరి కాలంలో వచ్చి చేరిన సంప్రదాయాలని అనుకోవలసి వస్తుంది.

నారాయణుడితో ఆండాళ్ వివాహక్రతువు ఐహిక బంధాలకు వ్యతిరేకంగా స్వప్నలోకంలో సంపన్న మౌతుంది. శ్రీకృష్ణుడి యెడ ఆమె భక్తిప్రపత్తులు 'నాచ్చియార్ తిరుమొళి' గానంతో పరిణతిని సంతరించుకున్నాయి. 'వారణం ఆయిరం' పాశురాలు పాడుతూ ఆమె తన నెచ్చెలితో శ్రీకృష్ణుడు తనను పరిణయమాడినట్లు కలగన్నాననీ, ఆ కలను కళ్ళకు కట్టినట్లు వర్ణిస్తుంది. ఇలలో కాకుండా పరమాత్మ కలలో ఆమె కోరికను ఈడేర్చి వివాహం చేసుకోవటం ఆమె భక్తి కవిత్వంలో సవివరంగా దర్శిస్తాము. 'మంగళ తూణీర వాద్యాలు, శంఖనాదాలు శుభ సూచకంగా మ్రోగుతుంటే ముత్యాల సరాలు వ్రేలాడే పందిరి క్రింద మధుసూదనుడు నా కుడి చేతిని గ్రహించి పాణిగ్రహణం చేయటం కలలో పరవశించి చూశానే సఖీ!' అని ఒక పాశురంలో ఆండాళ్ పరవశిస్తుంది.

శ్రీరంగనాథుని అనుజ్ఞపై తన తండ్రితో గోదాదేవి పెళ్లికుమార్తెగా కాక శ్రీరంగనాథుని దేవేరిగా శ్రీరంగం చేరుకుంటుంది. ఆమె పరిశుద్ధ అంతరంగంలో పరిణయం కలలో జరిగినా అది ఇలలో జరిగినట్లే! గుడి ముందు పల్లకీ దిగి పరుగు పరుగున గర్భాలయంలోకి చేరుకొని రంగనాథుని పాదపద్మాలపై వ్రాలిన ఆండాళ్ తేజస్సు దేవదేవునిలో విలీనమౌతుంది. ఆ విధంగా ఆమె కలగన్న పరమాత్మ సమాగమం పరిపూర్ణమవుతుంది.

– శ్రీదేవీ మురళీధర్

క్లుప్తంగా...

జలాధివాసం వీడుతున్న సంగమేశ్వరుడు



కృష్ణాజలాల నుంచి బయటపడుతున్న సంగమేశ్వర ఆలయ గోపురం

కొత్తపల్లి: శ్రీశైలం జలాశయ నీటిమట్టం తగ్గుముఖం పడుతుండటంతో కృష్ణానదిలో జలాధివాసం అయిన సంగమేశ్వరాలయం క్రమేపీ బయటపడుతోంది. జలాశయం నీటిమట్టం 885 అడుగులు కాగా సోమవారం నాటికి 863 అడుగులకు చేరుకుంది. దీంతో పురాతన సంగమేశ్వరాలయం గోపురం బయట పడింది. ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ గోపురానికి కుంకుమార్చన, పుష్పార్చన, నదీజలాలతో అభిషేకం, మంగళహారతి వంటి విశేష పూజలు చేశారు. మరో 24 అడుగుల మేర నీటిమట్టం తగ్గితే ప్రాచీన సంగమేశ్వరాలయం పూర్తిగా జలాధివాసం వీడి భక్తులకు దర్శనమివ్వనుంది.

ప్రపంచానికే భారత్ ఆదర్శం

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు

కొమ్మాది (భీమిలి): సంస్కృతి, సంప్రదాయాల ఆచరణలో ప్రపంచ దేశాలు భారత్‌ను ఆదర్శంగా తీసుకుంటున్నాయని.. మన దేశం ఒక విశ్వ గురువు అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. సోమవారం విశాఖలో జరిగిన లయన్స్ ఇంటర్నేషనల్ 50వ వార్షికోత్సవ ముగింపు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, క్యాన్సర్ నియంత్రణకు లయన్స్ సభ్యులు చేస్తున్న కృషిని వెంకయ్యనాయుడు అభినందించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని.. భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించాల్సిన అవసరముందన్నారు. అనంతరం తన చిత్రాన్ని గీసిన స్పీడ్ పెయింటర్ విలాస్ నాయక్‌ను వెంకయ్యనాయుడు అభినందించారు. కార్యక్రమంలో డెక్సెటిరిటీ గ్లోబల్ సీఈవో శరత్ వివేక్ సాగర్, విజయకుమార్ రాజు, వంశీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు భగవద్గీతలో పరిష్కారాలు

- కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతీ స్వామి
- శ్రీమద్భగవద్గీత దశ సహస్ర పారాయణం



సందేశం ఇస్తున్న కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి

కొవ్వూరు: మానవుని జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలకు భగవద్గీత పరిష్కారం చూపుతుందని కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతీ స్వామి అన్నారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు సంస్కృత పాఠశాల ప్రాంగణంలో చంద్రశేఖరేంద్ర సరస్వతీ ఆరాధనోత్సవాల్లో భాగంగా సోమవారం విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీమద్భగవద్గీత దశ సహస్ర పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతీ స్వామి మాట్లాడుతూ మార్గశిర ఏకాదశి రోజున భగవద్గీత పారాయణం వల్ల విశేష ఫలితాలు ప్రాప్తిస్తాయన్నారు. అనంతరం విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు భగవద్గీత పుస్తకాలు అందజేశారు. తమిళనాడుకు చెందిన మహిళా బృందం సౌందర్యలహరి పారాయణ చేశారు. సాయంత్రం వేదిక వద్ద కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆధ్యాత్మిక వేత్తల ప్రసంగాలు, సంగీత విభావరీ, హరికథ నిర్వహించారు.

టీటీడీ బోర్డు సభ్యుడిగా కిరణ్ ప్రమాణస్వీకారం



దాసరి కిరణ్‌కు స్వామి చిత్రపటం అందిస్తున్న డిప్యూటీ ఈవో రమేష్ బాబు

తిరుమల: టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడిగా దాసరి కిరణ్‌కుమార్ సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి చెంత ఆలయ డిప్యూటీ ఈవో రమేష్‌బాబు ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. దాసరి కిరణ్ కుమార్ శ్రీవారిని దర్శించుకున్న అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. శ్రీవారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బోర్డు సెల్ డిప్యూటీ ఈవో కస్తూరి బాయి తదితరులు పాల్గొన్నారు.

చెరువు పోరంబోకులో టీడీపీ ఆఫీసు

మదనపల్లె టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నిర్వాకం

- టీడీపీ ప్రభుత్వంలో అధికార బలంతో ప్రభుత్వ స్థలం దురాక్రమణ
- హైకోర్టు కేసు పేరుతో ఇతరులు లోనికి రాకుండా బెదిరింపులు
- స్టే ఉన్నప్పటికీ అందులో అడ్డగోలుగా నిర్మాణాలు.. రికార్డింగ్ డ్యాన్సుల నిర్వహణ
- కలెక్టర్ ఆదేశాలతో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



కోర్టులో స్టే ఉన్నప్పటికీ నిబంధనలు అతిక్రమించి అనుమతి లేకుండా నిర్మిస్తున్న భవంతి



ఆక్రమిత స్థలంలో నిర్మాణాలు చేయవద్దని మాజీ ఎమ్మెల్యే రమేష్‌కు నోటీసులు ఇస్తున్న రెవెన్యూ అధికారులు

మదనపల్లె : టీడీపీ ప్రభుత్వ హయాంలో అధికార బలంతో అక్రమంగా ఆక్రమించుకున్న చెరువు పోరంబోకు స్థలంలో టీడీపీ కార్యాలయం ఏర్పాటుచేయడమే కాక అనుమతిలేకుండా అందులో అక్రమ నిర్మాణాలు చేపట్టడం అధికారుల తనిఖీలో బట్టబయలైంది. అన్నమయ్య జిల్లా మదనపల్లె టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ అవినీతి, ఆక్రమణ, అక్రమ నిర్మాణాల బాగోతం అధికారుల హెచ్చరిక బోర్డు ఏర్పాటుతో మరోసారి వెలుగులోకి వచ్చింది. ఇన్నాళ్లు హైకోర్టులో కేసు ఉందని, లోనికి ఎవరూ ప్రవేశించరాదంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసిన ఆయన.. లోపల మాత్రం అక్రమ నిర్మాణాలు చేపట్టడంతోపాటు టీడీపీ కార్యాలయం ఏర్పాటుచేసుకుని దర్జాగా పార్టీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. అంతేకాక.. పెద్ద షెడ్‌లు ఏర్పాటు చేసి రికార్డింగ్ డ్యాన్సులు ఏర్పాటుచేయడంపై పట్టణ ప్రజలు విస్తుపోతున్నారు. దీనిపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో.. పట్టణంలోని బండమీద కమ్మపల్లె రెవెన్యూ గ్రామం సర్వే నంబర్–8 పార్టు, విస్తీర్ణం.3.09 ఎకరాల్లో ప్రభుత్వ స్థలానికి సంబంధించి హైకోర్టులో కేసులు పెండింగులు ఉన్నందున భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేయరాదని జిల్లా కలెక్టర్ గిరీషా ఉత్తర్వులతో మాజీ ఎమ్మెల్యే ఆక్రమిత స్థలంలో జాయింట్ కలెక్టర్ హెచ్చరిక బోర్డు పెట్టారు. అంతేకాక.. మున్సిపల్, రెవెన్యూ అధికారులు భూమి మొత్తం కలియతిరిగి అందులోని చెట్లను, టీడీపీ కార్యాలయాన్ని, కొత్తగా నిర్మించిన భవనాన్ని, అనుమతిలేకుండా ఏర్పాటుచేసిన రెండు షెడ్‌ల కొలతలు తీశారు. ఈ సమయంలో.. తాను మాజీ ఎమ్మెల్యేనని, కావాలంటే గూగుల్ మ్యాప్స్ తీసుకోవాలని దొమ్మలపాటి రమేష్ వ్యాఖ్యానించారు.

అడ్డదారుల్లో దురాక్రమణ ఇలా..

బండమీద కమ్మపల్లె పంచాయతీలో సర్వే నంబర్–8లో ఐదెకరాలు పూర్తిగా చెరువు పోరంబోకు స్థలం. అందులో తప్పుడు రికార్డులతో దొంగపట్టాలు పుట్టించి సర్వే నెం.8/1 పేరుతో ఇంద్రసేనరాజు పేరుతో 1984లో ఇచ్చినట్లుగా డీకేటీ పట్టా సృష్టించారు. అయితే, అదే సంవత్సరం అదే నంబర్‌తో వేరే వారికి పట్టా ఇచ్చినట్లుగా రెవెన్యూ రికార్డుల్లో ఉంది. మరోవైపు.. మాజీ ఎమ్మెల్యే దొంగ డీకేటీ పట్టాను ఆన్‌లైన్‌లో ఎక్కించేందుకు కుదరకపోవడంతో కొన్నాళ్లు స్తబ్దుగా ఉండిపోయారు. 2016లో తహసీల్దార్ శివరామిరెడ్డి హయాంలో ఆన్‌లైన్‌లోకి ఎక్కించి ఇంద్రసేనరాజు నుంచి దొమ్మలపాటి రమేష్ భార్య దొమ్మలపాటి సరళ పేరు మీద రిజిస్టర్ డాక్యుమెంట్ ద్వారా కొనుగోలు చేశారు. ఈ విషయమై అప్పట్లో పత్రికల్లో వార్తలు రావడంతో అధికారులు నోటీసు పంపగా దానిమీద హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. హైకోర్టు కేసు నంబర్లను ప్రహరీగోడ మీద ప్రత్యేకంగా పేర్కొంటూ అనుమతిలేకుండా ప్రవేశించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాయించారు. లోపలమాత్రం అనుమానం రాకుండా పెద్ద భవనాలు, షెడ్‌ల నిర్మాణాలు చేస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు వెళ్లడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. మరోవైపు.. ఆక్రమిత ప్రభుత్వ స్థలాన్ని మున్సిపల్, రెవెన్యూ అధికారులు పరిశీలిస్తుంటే టీడీపీ మండల అధ్యక్షుడు దేవరింటి శీను, మాజీ ఎమ్మెల్యే డ్రైవర్ వెంకటేష్, ఇతర టీడీపీ నాయకులు అధికారుల విధులకు భంగం కలిగిస్తూ వారిని వీడియోలు, ఫొటోలు తీశారు. తాము విధి నిర్వహణలో ఉన్నామని అధికారులు వారిని వారిస్తున్నా మీ పని మీరు చేసుకోండి.. మా పని మేం చేసుకుంటామని వ్యాఖ్యానించడం కనిపించింది.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కంపార్ట్‌మెంట్లు 14 నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 75,611 మంది స్వామి వారిని దర్శించుకోగా, 29,228 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.55 కోట్లు వేశారు. శ్రీవారి దర్శన టోకెన్లు లేని భక్తులకు 24 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి మూడు గంటల సమయం పడుతోంది. కాగా, తిరుమల శ్రీవారిని సోమవారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, సీఆర్‌పీఎఫ్ డీజీ ఆర్‌కే యాదవ్ దర్శించుకున్నారు.

శ్రీసిటీలో వసతులు భేష్

- టాంజానియా భారత హైకమిషనర్ ప్రశంస



బినయ శ్రీకాంత ప్రధాన్‌తో శ్రీసిటీ ఎండీ రవీంద్ర

వరదయ్యపాళెం(తిరుపతి జిల్లా): శ్రీసిటీ పారిశ్రామికవాడలో ప్రపంచశ్రేణి మౌలిక సదుపాయాలు కల్పించడంపై టాంజానియాలోని భారత హైకమిషనర్ బినయ శ్రీకాంత ప్రధాన్ ప్రశంసించారు. ఆయన సోమవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికి శ్రీసిటీలోని మౌలిక సదుపాయాలు, ప్రత్యేకతల గురించి వివరించారు. బినయ శ్రీకాంత ప్రధాన్ మాట్లాడుతూ.. 6 దశాబ్దాలుగా భారతదేశం, టాంజానియా రెండు సాంప్రదాయక సన్నిహిత వాణిజ్య సంబంధాలను కలిగి ఉన్నాయన్నారు. భారతదేశం ప్రధాన అభివృద్ధి సహాయక భాగస్వాముల్లో టాంజానియా ఒకటని తెలిపారు. టాంజానియాలో మన దేశానికి చెందిన ఓ సెజ్‌ను ప్రారంభించే అవకాశాలను భారత ప్రభుత్వం అన్వేషిస్తోందని ఆయన పేర్కొన్నారు. అనంతరం శ్రీసిటీ పరిధిలోని హంటర్ డగ్లస్, వెర్మీరియన్ పరిశ్రమలను సందర్శించారు.

ఫైవ్‌స్టార్ సదుపాయాలతో ఢిల్లీలో దొంగ దీక్షలు

- 813వ రోజు రిలే నిరాహార దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: అమరావతి పేరుతో కులవాదులంతా ఢిల్లీలో చేరి ఫైవ్‌స్టార్ హోటళ్లలో ఉంటూ ఎన్‌ఆర్‌ఐ చందాలు, బాబు పెట్టుబడులతో లేనిది ఉన్నట్లు భ్రమింపజేసేందుకు దొంగ దీక్షలు చేస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి 813వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ 75 సంవత్సరాల్లో ఏ ప్రభుత్వం చేయని విధంగా వినూత్న పరిపాలన ప్రజలకు అందిస్తూ పేదలకు ఆలంబనగా ఉంటున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూరేళ్లు వర్ధిల్లాలని అన్నారు. చంద్రబాబుకు పవన్‌కళ్యాణ్ అమ్ముడుపోయి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శిస్తున్నాడని మండిపడ్డారు. ఎన్నికల ముందు ప్రజల్లో తిరిగి గోబెల్స్ ప్రచారం ద్వారా ప్రజలను తప్పుదారి పట్టించాలని చూస్తున్న చంద్రబాబుకు మరోసారి ప్రజల చేతుల్లో గుణపాఠం తప్పదన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, బొలిమేర శామ్యూల్, నూతక్కి జోషి, పులి దాసు, ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

గజరాజుల దాడిలో ఆవు దూడ మృతి

- మరో రెండు దూడల పరిస్థితి విషమం
- అటవీశాఖ సిబ్బందిని నిర్బంధించిన గ్రామస్తులు



ఆవు, దూడ కళేబరాల వద్ద అటవీశాఖ రేంజర్ త్రినాథరావు, తదితరులు

కొమరాడ: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతాల ప్రజలను గజరాజులు వణికిస్తున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం కుమ్మరిగుంట పంచాయతీ పరిధి కందివలసలో ఉన్న టమాటా పంటను ఆదివారం అర్ధరాత్రి ధ్వంసం చేశాయి. విద్యుత్ స్తంభాలను నేలకూల్చాయి. రావికర్రవలస గ్రామంలో ఉడతల సత్యంకు చెందిన మూడు ఆవుదూడలపై దాడిచేశాయి. ఈ ఘటనలో ఒక ఆవుదూడ మృతి చెందగా, మరో రెండు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో గ్రామస్తులు ఆగ్రహంతో ఊగిపోయారు. ఘటనా స్థలాన్ని పరిశీలించేందుకు సోమవారం వెళ్లిన అటవీశాఖ సిబ్బందిని సీపీఎం నాయకుడు కొల్లి సాంబమూర్తి ఆధ్వర్యంలో గృహ నిర్బంధం చేశారు. పార్వతీపురం అటవీశాఖ రేంజర్ బి.త్రినాథరావు గ్రామానికి చేరుకుని మృతి చెందిన దూడకు వైద్యాధికారితో పోస్టుమార్టం జరిపించి ఖననం చేయించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. గజరాజుల దాడితో దూడను కోల్పోయిన రైతుకు పరిహారం అందజేస్తామని చెప్పారు. గ్రామస్తులకు నచ్చజెప్పి అటవీశాఖ సిబ్బందిని విడిపించారు. గజరాజుల వల్ల నష్టపోయిన ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం తరఫున నష్టపరిహారం అందజేస్తున్నామని చెప్పారు.

దుబాయ్‌లో శ్రీకాకుళం మహిళకు భర్త వేధింపులు

- బాధితురాలిని క్షేమంగా స్వదేశానికి చేర్చిన ఏపీఎన్‌ఆర్టీఎస్



విమానాశ్రయంలో కావ్య, కుటుంబ సభ్యులు

సాక్షి, అమరావతి: దుబాయ్‌లో భర్త వేధింపులకు గురవుతున్న శ్రీకాకుళానికి చెందిన మహిళతోపాటు ఆమె తల్లిదండ్రులను ఏపీ ప్రవాసాంధ్రుల సొసైటీ(ఏపీఎన్‌ఆర్టీఎస్) సురక్షితంగా భారతదేశానికి చేర్చింది. శ్రీకాకుళానికి చెందిన కావ్య, తన భర్త అవినాష్, రెండేళ్ల కుమార్తె, తల్లిదండ్రులతో కలిసి దుబాయ్‌లో ఉంటున్నారు. ఇటీవల భర్త అవినాష్ అదనపు కట్నం కోసం తనతోపాటు కుమార్తెను, తల్లిదండ్రులను సైతం వేధిస్తున్నాడని కావ్య ఇటీవల వీడియో ద్వారా తెలియజేసింది. తాము భారత్ రాకుండా అడ్డుకునేందుకు అవినాష్ అక్కడి కోర్టును ఆశ్రయించి తన రెండేళ్ల కుమార్తె ప్రయాణంపై నిషేధం విధించేలా చేశాడని ఆవేదన వ్యక్తంచేసింది. ఈ విషయాన్ని రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి డ్నాకర్ సీదిరి అప్పలరాజు తమ దృష్టికి తీసుకువచ్చారని ఏపీఎన్‌ఆర్‌టీఎస్ అధ్యక్షుడు వెంకట్ మేడపాటి తెలిపారు. తాము వెంటనే వివరాలు సేకరించి కావ్య తల్లిదండ్రుల ఆరోగ్య పరిస్థితి బాగాలేకపోవడంతో ఇండియాకు తిరిగి వెళ్లే విధంగా ఎంబసీ అధికారుల నుంచి ప్రత్యేక అనుమతి తీసుకున్నామని పేర్కొన్నారు. త్వరలోనే కావ్య కుమార్తెను కూడా స్వదేశానికి తీసుకువచ్చే విధంగా కృషి చేస్తామని ఆయన తెలిపారు. దుబాయ్ నుంచి స్వదేశానికి చేరుకున్న తర్వాత కావ్య సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. తాము క్షేమంగా భారత్‌కు చేరుకునేందుకు ఏపీఎన్‌ఆర్టీఎస్ చేసిన సాయం మరువలేనిదని, తన పాపను కూడా తీసుకొచ్చే విధంగా చూడాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులు

- రాష్ట్ర ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ టి.కృష్ణబాబు



బ్లడ్ బ్యాంక్ ప్రారంభిస్తున్న కృష్ణబాబు, చిత్రంలో కలెక్టర్ మల్లికార్జున

ఆరిలోవ(విశాఖ తూర్పు): కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేయడానికి చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ టి.కృష్ణబాబు తెలిపారు. విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో ఏర్పాటు చేసిన బ్లడ్ బ్యాంక్‌ను సోమవారం ఆయన కలెక్టర్ మల్లికార్జునతో కలిసి ప్రారంభించారు. బ్లడ్ బ్యాంక్‌లోని యంత్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు కృషితో విమ్స్‌లో 1000 యూనిట్ల సామర్థ్యంతో రూ.1.50 కోట్లతో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేశామన్నారు. నాడు–నేడులో భాగంగా విమ్స్‌లో రూ.250 కోట్లతో అదనపు బ్లాకులు, మౌలిక సదుపాయాల ఏర్పాటు, కేజీహెచ్‌ను రూ.600 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. విమ్స్‌లో స్పెషలిస్టు, సూపర్ స్పెషలిస్టుల పోస్టులను భర్తీ చేస్తామన్నారు. త్వరలో ఇక్కడ కేథ్‌ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మైథిలీ, డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన భవానీ దీక్షల విరమణలు

- అమ్మవారిని దర్శించుకున్న 4.5 లక్షల మంది భవానీలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న దుర్గ గుడి ఆలయ ప్రధాన అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం వద్ద ఈ నెల 15వ తేదీన ప్రారంభమైన భవానీ దీక్షల విరమణలు సోమవారంతో ముగిశాయి. మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో ఆలయ స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ పర్యవేక్షణలో ఆలయ వైదిక కమిటీ సభ్యులు కోట ప్రసాద్, రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి, అర్చకులు మహా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం కలశ ఉద్వాసన, వేద ఆశీర్వచనంతో దీక్షలు పరిసమాప్తం అయ్యాయి. ఈ సందర్భంగా ఈవో భ్రమరాంబ మాట్లాడుతూ దీక్షల విరమణకు దాదాపు 4.5 లక్షల మంది భవానీలు విచ్చేశారని తెలిపారు. ఈ కార్యక్రమానికి సుమారు రూ.6 కోట్ల మేర ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. మంగళవారం నుంచి ఆర్జిత సేవలు యధాతథం జరుగుతాయని వివరించారు.

మునిగిన యుద్ధ నౌక

థాయ్‌లాండ్‌లో 31 మంది గల్లంతు

బ్యాంకాక్: థాయ్‌లాండ్ సముద్రజలాల్లో ఆ దేశ యుద్ధనౌక ఒకటి మునిగిపోయింది. ఆ ఘటనలో 75 మందిని కాపాడారు. అయితే 31 మంది నావికుల జాడ తెలియాల్సి ఉంది. వీరి కోసం థాయ్‌లాండ్ నావికాదళ హెలికాప్టర్లు, నౌకల్లో సైన్యం అన్వేషణ పనుల్లో నిమగ్నమైంది. ప్రచుయాప్ ఖీరి ఖాన్ ప్రావిన్స్‌లోని బాంగ్‌సఫాన్ జిల్లాలోని సముద్ర తీరం నుంచి 32 కిలోమీటర్ల దూరంలో సముద్రజలాల్లో హెచ్‌టీఎంఎస్ సుఖోథాయ్ యుద్ధనౌక గస్తీ కాస్తోంది. ఆ ప్రాంతంలో వేటకొచ్చే చేపలపడవల సిబ్బందికి అత్యవసర పరిస్థితుల్లో సహాయక కార్యక్రమాల బాధ్యతలను ఈ నౌక చూసుకునేది. ఆదివారం రాత్రి భారీ అలలు ఈ నౌకను అతలాకుతలం చేశాయి. సముద్రనీరు చేరడంతో నౌకలో విద్యుత్ వ్యవస్థ స్తంభించడంతో నావికులు నౌకను అదుపుచేయడంలో విఫలమయ్యారు. దీంతో పక్కకు ఒరగడం మొదలై పూర్తిగా మునిగిపోయింది. 75 మందిని కాపాడగా మిగతా వారి గాలిస్తున్నారు.

క్లుప్తంగా...

హిమాచల్ సీఎంకు కరోనా

సిమ్లా: హిమాచల్‌ప్రదేశ్ కొత్త ముఖ్యమంత్రి సుఖ్‌వీందర్‌సింగ్ సుఖు కరోనా బారిన పడ్డారు. దాంతో సోమవారం ఢిల్లీలో ప్రధాని మోదీతో ఆయన భేటీ వాయిదా పడింది. మంగళవారం నుంచి జరగాల్సిన అసెంబ్లీ సమావేశాలూ వాయిదా పడ్డాయి. సుఖు ఈ నెల 16న భారత్ జోడో యాత్రలో పాల్గొనడమే గాక కొన్ని రోజులుగా ఢిల్లీలో కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే తదితరులతో భేటీ అవుతున్నారు.

168% తగ్గిన ఉగ్ర ఘటనలు

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద సంబంధిత ఘటనలు 2014 నుంచి మోదీ ప్రభుత్వ హయాంలో 168% మేర తగ్గాయని కేంద్రం తెలిపింది. దేశంలో వామపక్ష తీవ్రవాద ఘటనలు 265% మేర క్షీణించాయని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ సోమవారం మీడియాకు తెలిపారు. ''ఉగ్రవాదానికి ఆర్థిక సాయమందించే వారిపై కేసులు 94% పెరిగాయి. దేశంలో విద్రోహ చర్యలు 80 శాతం, ఆ ఘటనల్లో పౌరుల మరణాలు 89% తగ్గాయి. 6 వేల మంది తీవ్రవాదులు లొంగిపోయారు'' అన్నారు.

బస్సులు ఢీ.. 8 మంది మృతి

లాహోర్: పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్ రజన్‌పూర్ జిల్లాలో సోమవారం రెండు బస్సులు ఢీకొన్న ఘటనలో 8 మంది చనిపోయారు. షావలిలోని ఇండస్ హైవేపై ఈ ఘటన జరిగింది. దట్టమైన పొగమంచే దీనికి కారణమని జియో న్యూస్ తెలిపింది.

కర్నాటక అసెంబ్లీలో సావర్కర్ ఫొటో, వివాదం

బెళగావి: కర్ణాటక సరిహద్దు జిల్లా బెళగావిలోని సువర్ణ విధాన సౌధ అసెంబ్లీ చాంబర్‌లో హిందుత్వ సిద్ధాంతకర్త సావర్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేయడం వివాదాస్పదమైంది. దీనికి నిరసనగా కాంగ్రెస్ శాసనసభా పక్ష నేత సిద్దరామయ్య, పీసీసీ చీఫ్ డీకే శివకుమార్ అసెంబ్లీ ఎదుట ఆందోళనకు దిగారు.

చెలామణిలో ఉన్న నోట్ల విలువ... రూ.31.92 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుతం దేశంలో రూ.31.92 లక్షల కోట్ల విలువైన కరెన్సీ నోట్లు చలామణిలో ఉన్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం లోక్‌సభలో చెప్పారు. ''జీడీపీలో వృద్ధి, ద్రవ్యోల్బణం, పాడయిన నోట్లకు బదులు కొత్త నోట్లను చెలామణిలోకి తేవడం, నగదుయేతర చెల్లింపుల సరళికి అనుగుణంగా ఆర్థికవ్యవస్థలో కరెన్సీ నోట్ల సంఖ్య ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. నల్లధనాన్ని అరికట్టేందుకు పరిమిత నగదు వ్యవస్థతోపాటు డిజిటల్ ఎకానమీని ప్రోత్సహించడం ఆర్‌బీఐ, కేంద్రం బాధ్యత'' అన్నారు. మరోవైపు, 60 పాత చట్టాల రద్దుకు, ఒక చట్టంలో సవరణకు ఉద్దేశించిన బిల్లును కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. ఇది ఆమోదం పొందితే భూ సేకరణ (గనులు) చట్టం (1885), టెలిగ్రాఫ్ వైర్స్ చట్టం(1950) వంటివి రద్దవుతాయి.

జేడీఎస్ తొలి జాబితా విడుదల

బెంగళూరు: కర్ణాటకలో త్వరలో శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జేడీ(ఎస్) 93 మంది అభ్యర్థులతో తొలి జాబితాను సోమవారం విడుదలచేసింది. పేర్లను ప్రకటించారు. 32 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలతో పాటు మాజీ సీఎం కుమారస్వామి, ఆయన తనయుడు నిఖిల్‌కు టికెట్లు దక్కాయి. గత ఎన్నికల్లో కాంగ్రెస్ 37 చోట్ల గెలవడం తెలిసిందే. 2019లో జేడీఎస్, కాంగ్రెస్ కూటమి ప్రభుత్వ హయాంలో ఐదుగురు ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు. అనంతరం కూటమి ప్రభుత్వం కుప్పకూలి బీజేపీ అధికారంలోకి రావడం తెలిసిందే.

విమానానికి భారీ కుదుపులు.. 11 మందికి తీవ్ర గాయాలు

హొనొలులు: సెలవుల్లో సరదాగా గడపాలని బయలుదేరిన వారికి చేదు అనుభవం ఎదురైంది. వారు ప్రయాణిస్తున్న విమానం భారీ కుదుపులకు లోనై 36 మంది గాయాలపాలయ్యారు. వీరిలో 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన అమెరికాలో ఆదివారం చోటుచేసుకుంది. అరిజోనా రాష్ట్రం ఫీనిక్స్ నుంచి హవాయిలోని హొనొలులుకు బయల్దేరిన హవాయి ఎయిర్‌లైన్స్ విమానం అరగంటలో ల్యాండవుతుందనగా భారీ కుదుపులకు లోనైంది. ఆ తాకిడికి ప్రయాణికులు గాల్లోకి ఎగిరిపడ్డారు. పైనున్న లగేజీ క్యాబిన్‌కు గుద్దుకున్నారు. వాటర్ బాటిళ్లు, సెల్‌ఫోన్లు చెల్లా చెదురుగా పడిపోయాయి.

మస్క్... నువ్వు మాకొద్దు!

ట్విట్టర్ సీఈవోగా తప్పుకోవాలన్న 57.5 శాతం ఓటర్లు



వాషింగ్టన్: సామాజిక దిగ్గజ సంస్థ ట్విట్టర్‌కు సారథ్య బాధ్యతలు నిర్వర్తించడంలో విఫలమయ్యాడంటూ సర్వత్రా విమర్శలు ఎదుర్కొంటున్న ఆ సంస్థ సీఈవో, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు మరో ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. మస్క్ అధికారిక ట్విట్టర్ ఖాతాకు ప్రపంచవ్యాప్తంగా 12.2 కోట్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. వీరిని ఉద్దేశిస్తూ మస్క్ ఆదివారం ఒక ట్వీట్‌చేశారు. ' ట్విట్టర్‌కు సీఈవోగా నేను తప్పుకోవాలా ?. ఈ పోలింగ్‌లో వచ్చే ఫలితాలకు అనుగుణంగా నడుచుకుంటా. మీ నిర్ణయాన్ని చాలా జాగ్రత్తగా ఆలోచించి చెప్పండి. మీరేం ఆశిస్తారో అదే మీకు దక్కుతుంది' అని మస్క్ ఆదివారం ఒక ట్వీట్‌చేశారు. దీనిపై ట్విటర్ యూజర్లు వెంటనే భారీగా స్పందించారు. పోలైన ఓట్లలో 57.5 శాతం ఓట్లు మస్క్‌కు వ్యతిరేకంగా పడ్డాయి. మాకు మీరు అక్కర్లేదంటూ 'యస్' చెబుతూ ఓట్లు వేశారు. ఆదివారం సాయంత్రం మొదలైన ఈ ఓటింగ్ సోమవారం తెల్లవారుజామున ముగిసింది. మస్క్ పిలుపునకు స్పందనగా 1.7 కోట్లకుపైగా ఓట్లు పోల్ అయ్యాయని సీఎన్ఎన్ పేర్కొంది. ఓటింగ్ ఫలితంపై మస్క్ ఇంకా స్పందించలేదు. దాదాపు 44 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ట్విటర్‌ను హస్తగతం చేసుకున్నాక మస్క్ తీసుకున్న కఠిన నిర్ణయాలపై విమర్శలు కొనసాగుతుండటం తెల్సిందే. భారీగా సిబ్బంది కోతలకు సిద్ధమవడం, ఎక్కువ గంటలు చెమటోడ్చి పనిచేయాలని ఒత్తిడి తేవడం వంటి నిర్ణయాలతో మస్క్ పేరు చెబితేనే ట్విటర్ సిబ్బంది హడలెత్తిపోతున్నారు. ట్విటర్ విధానపర నిర్ణయాల్లో మార్పులపైనా ఆన్‌లైన్ ఓటింగ్ చేపడతానని మస్క్ ప్రకటించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టా గ్రామ్, మాస్టోడోన్, ట్రూత్ సోషల్, ట్రైబల్, నోస్టర్, పోస్ట్ వంటి ఇతర సోషల్‌మీడియా సంస్థల ఖాతాలకు వాడుతున్న అవే యూజర్‌ఐడీలతో కొనసాగుతున్న/అనుమానమైన ట్విట్టర్ ఖాతాలను తొలగిస్తామని ట్విటర్ తెలిపింది. 'ఇన్‌స్టాగామ్‌లో నన్ను ఫాలో అవ్వండి', 'ఫేస్‌బుక్‌లో నా ప్రొఫైల్ చెక్ చేయండి' వంటి వాటికీ ట్విట్టర్ చెక్ పెట్టనుంది.

జీవ వైవిధ్యానికి గొడుగు

ఐరాస సదస్సులో చరిత్రాత్మక ఒప్పందం
- దాదాపు 200 దేశాల ఆమోదముద్ర
- జీవ వైవిధ్య పరిరక్షణే ప్రధాన లక్ష్యం
- ఏటా 200 బిలియన్ డాలర్ల నిధి





ఒప్పందం ఆమోదముద్ర పొందినట్టు ప్రకటిస్తున్న కాప్15 అధ్యక్షుడు (ఇన్‌సెట్‌లో). సభికుల హర్షధ్వానాలు

మాంట్రియల్: ఏళ్ల తరబడి జరిగిన చర్చోపచర్చలు, సంప్రదింపులు ఎట్టకేలకు ఓ కొలిక్కి వచ్చాయి. భూమిపై జీవ వైవిధ్యాన్ని పరిరక్షించే దిశగా కీలక ముందడుగు పడింది. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో కెనడాలోని మాంట్రియల్‌లో డిసెంబర్ 7 నుంచి జరుగుతున్న కాప్–15 అంతర్జాతీయ సదస్సులో భారత్‌తో సహా దాదాపు 200 దేశాలు ఈ విషయంలో విభేదాలు వీడి ఒక్కతాటిపైకి వచ్చాయి. కీలకమైన కున్మింగ్–మాంట్రియల్ జీవవైవిధ్య ప్రణాళిక (జీబీఎఫ్)కు సోమవారం అంగీకారం తెలిపాయి. ఈ మేరకు ''కున్మింగ్–మాంట్రియల్' ఒప్పందం ఆమోదముద్ర పొందినట్టు సదస్సుకు అధ్యక్షత వహిస్తున్న చైనా పర్యావరణ మంత్రి హువాంగ్ రుంక్యూ సభికుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. పారిస్ ఒప్పందం తరహాలోనే పర్యావరణ పరిరక్షణ యత్నాల్లో దీన్నో కీలక మైలురాయిగా భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా వర్ధమాన దేశాల్లో భూ భాగాలు, సముద్ర జలాలతో పాటు జంతు జాతులను కాలుష్యం, వాతావరణ మార్పుల బారినుంచి పూర్తిస్థాయిలో రక్షించడం ఈ ఒప్పందం లక్ష్యం. అయితే ఇందుకు సమకూర్చాల్సిన ఆర్థిక ప్యాకేజీపై ఎంతోకాలంగా పడ్డ పీటముడి ఎట్టకేలకు వీడింది. ఆ మొత్తాన్ని ఇతోధికంగా పెంచి 2030 కల్లా ఏటా 200 బిలియన్ డాలర్లకు చేర్చాలని నిర్ణయం జరిగింది. 2020లో అంగీకరించిన మొత్తంతో పోలిస్తే ఇది రెట్టింపు! ఈ కీలక అంగీకారం నేపథ్యంలో ఒప్పందానికి మార్గం సుగమమైంది. ఇందులో భాగంగా మొత్తం 23 లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. వాటిని 2030కల్లా సాధించాలన్నది లక్ష్యం. దీన్ని పలు పర్యావరణ సంస్థలు స్వాగతించగా ఆర్థిక, పరిరక్షణపరమైన పలు కీలకాంశాలను పట్టించుకోలేదంటూ పర్యావరణవేత్తలు పెదవి విరుస్తున్నారు. దీన్ని ప్రపంచ ప్రజల విజయంగా వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) ఇంటర్నేషనల్ డైరెక్టర్ జనరల్ మార్కో లాంబెర్టినీ అభివర్ణించారు. అయితే, లక్ష్యసాధనకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక లేకపోవడం ఈ ఒప్పందంలో కీలక లోపమని డబ్ల్యూడబ్ల్యూఎఫ్ గ్లోబల్ పాలసీ సీనియర్ డైరెక్టర్ లిన్ లీ అన్నారు.

50 ఏళ్లలో భారీ విధ్వంసం

జీవ వైవిధ్యానికి గత 50 ఏళ్లలో కనీవినీ ఎగరని స్థాయిలో ముప్పు వాటిల్లింది. చాలా రకాల జీవ జాతులు 1970 నుంచి ఏకంగా 69 శాతం క్షీణించాయని వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్–లివింగ్ ప్లానెట్ నివేదిక (ఎల్‌పీఆర్) పేర్కొంది. పర్యావరణానికి జరుగుతున్న ఈ అపార నష్టానికి అడ్డుకట్ట వేసి జీవ వైవిధ్యాన్ని పెంపొందించేందుకు తాజాగా ఒప్పందమైతే కుదిరింది. కాకపోతే దాని అమలులో దేశాలు ఏ మేరకు చిత్తశుద్ధి కనబరుస్తాయన్నది కీలకం. ఎందుకంటే ఇందుకోసం ఏటా 200 బిలియన్ డాలర్లు వెచ్చించేందుకు ఎట్టకేలకు అంగీకారం కుదిరినా, ఇందులో వర్ధమాన దేశాల అవసరాలు తీర్చేందుకు సంపన్న దేశాలు కేటాయించబోయే వాటా ఎంత వంటి కీలకాంశాలపై మాత్రం ఇంకా స్పష్టత లేదు.

ఒప్పందం లక్ష్యాలివీ...

జీవ వైవిధ్య పరిరక్షణకు 2010లో జపాన్‌లోని నగోయాలో జరిగిన కాప్–10 సదస్సులో దేశాలన్నీ పలు లక్ష్యాలు నిర్దేశించుకున్నాయి. అవి చాలావరకు లక్ష్యాలుగానే మిగిలిపోయాయి. దాంతో మరోసారి అంతర్జాతీయ స్థాయి మేథోమథనం కోసం 2020 అక్టోబర్లో చైనాలోని కున్మింగ్‌లో తలపెట్టిన కాప్–15 సదస్సు కరోనా వల్ల వాయిదా పడింది. అది తాజాగా రెండు దశల్లో జరిగింది. తొలి భాగం వర్చువల్ పద్ధతిలో ముగియగా మాంట్రియల్‌లో డిసెంబర్ 7 నుంచి 19 దాకా జరిగిన కీలకమైన రెండో భాగంలో చరిత్రాత్మక ఒప్పందం కుదిరింది. అందులో భాగంగా మొత్తం 23 లక్ష్యాలను ప్రపంచ దేశాలు నిర్దేశించుకున్నాయి. వాటిలో ముఖ్యాంశాలు...



- 2030 కల్లా మొత్తం భూభాగం, సాధారణ జలాలు, తీర ప్రాంతాలు, సముద్రాల్లో కనీసం 30 శాతాన్ని పూర్తిస్థాయిలో సంరక్షించి, పరిరక్షించే చర్యలు చేపట్టడం. అపార జీవ వైవిధ్యానికి నిలయమైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించడం. ప్రస్తుతం 17 శాతం భూభాగం, కేవలం 10 సముద్ర జలాల్లో మాత్రమే పరిరక్షణ ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.
- జీవ వైవిధ్యపరంగా అపార ప్రాధాన్యమున్న ప్రాంతాల్లో పర్యావరణ నష్టాలను అరికట్టడం
- ఇందుకోసం పేద దేశాలకు చేసే కేటాయింపులను 2025కల్లా ఏటా 20 బిలియన్ డాలర్లకు, 2030 కల్లా 30 బిలియన్ డాలర్లకు పెంచడం.
- ప్రపంచ ఆహార వృథాను సగానికి తగ్గించడం.
- వనరుల విచ్చలవిడి వాడకాన్ని, తద్వారా వ్యర్థాల ఉత్పత్తిని వీలైనంత కట్టడి చేయడం.
- సాగులో పురుగు మందులు, ఇతర అత్యంత ప్రమాదకర రసాయనాల వాడకాన్ని కనీసం సగానికి తగ్గించడం.
- జీవ వైవిధ్యానికి అపారమైన హాని కలిగించే సాగు సబ్సిడీలను 2030 నాటికి ఏటా 500 బిలియన్ డాలర్ల చొప్పున తగ్గించడం.
- జీవ వైవిధ్య సంరక్షణకు దోహదపడే పథకాలు, చర్యలకు ప్రోత్సాహకాలను పెంచడం.
- భారీ, అంతర్జాతీయ కంపెనీలు, ఆర్థిక సంస్థలు, తమ కార్యకలాపాల వల్ల పర్యావరణానికి, జీవ వైవిధ్యానికి కలిగే నష్టాన్ని ఎప్పటికప్పుడు పారదర్శకంగా వెల్లడించేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవడం.
- ఆ నష్టాలను అవి కనీస స్థాయికి పరిమితం చేసేలా చర్యలు తీసుకోవడం.

జవాన్లపై అవేం మాటలు?



రాహుల్‌పై జై శంకర్ ధ్వజం

న్యూఢిల్లీ: సరిహద్దుల్లో తవాంగ్ ఘర్షణ సదర్భంగా చైనా సేనలు మన సైనికులను కొట్టారంటూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను విదేశాంగ మంత్రి తీవ్రంగా తప్పుబట్టారు. సోమవారం లోక్‌సభలో ఈ అంశాన్ని మంత్రి ప్రస్తావించారు. ''మన సైనికులనుద్దేశించి పిటాయీ (దెబ్బలు తినడం) అనే పదం వాడటం ఏ మేరకు సబబు? ప్రభుత్వంపై రాజకీయ విమర్శలను అర్థం చేసుకోవచ్చు. కానీ సరిహద్దులను కంటికి రెప్పలా నిరంతరం కాపు కాస్తున్న వీర సైనికులపై ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ విమర్శలకు దిగడం దారుణం'' అంటూ దుయ్యబట్టారు. ఆ ఘర్షణలో మన సైనికులు అనుపమాన ధైర్య సాహసాలు ప్రదర్శించి చైనా సేనలను తరిమేశారని పునరుద్ఘాటించారు. ''దీన్ని అభినందించాలి. గౌరవించాలి'' అని సూచించారు. చైనా పట్ల కేంద్రం నిర్లిప్తంగా వ్యవహరిస్తోందన్న కాంగ్రెస్ సభ్యుడు అధీర్ రంజన్ చౌదరి వ్యాఖ్యలపైనా జై శంకర్ నిప్పులు చెరిగారు. విదేశాంగ మంత్రి అంతర్జాతీయ వ్యవహారాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరముందంటూ తనపై రాహుల్ చేసిన వ్యాఖ్యలపై చెణుకులు విసిరారు. ''ఈ వ్యాఖ్యలు చేసిందెవరో గమనించండి! ఆయనకు వినమ్రంగా శిరసు వంచి గౌరవించడం తప్ప ఇంకేంచేయగలను?'' అంటూ ఎద్దేవా చేశారు. జీ–20 సారథ్య హోదా దక్కినందుకు కేంద్రం జరుపుతున్న సంబరాలపై కాంగ్రెస్ విమర్శలను కూడా మంత్రి తిప్పికొట్టారు.

రాజ్యసభలో రగడ

న్యూఢిల్లీ: చైనా దురాక్రమణలపై తక్షణ చర్చకు సోమవారం రాజ్యసభలో విపక్షాలు పట్టుబట్టాయి. నోటీసులను చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ తిరస్కరించినా చర్చ కోరుతూ కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు నినాదాలతో హోరెత్తించి వాకౌట్ చేశాయి. సభా కార్యకలాపాలను ఇలా పదేపదే అడ్డుకోవడం సరైంది కాదని ధన్‌ఖడ్ అన్నారు.

అప్పట్లో మీరనుమతించారా: గోయల్

విపక్షాలు సభా కార్యకలాపాలను అడ్డుకోవడమే పని పెట్టుకున్నాయని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ మండిపడ్డారు. దేశ భద్రత వంటి సున్నితమైన అంశాన్ని రాజకీయం చేయొద్దని హితవు పలికారు. యూపీఏ హయాంలోనూ ఇలాంటి అంశాలపై చర్చకు అనుమతివ్వలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్‌వి దిగజారుడు రాజకీయాలన్నారు.

పేదల బిడ్డలకు ఇంగ్లిష్ వద్దా?

- మీ పిల్లలకేమో ఇంగ్లిష్ మీడియమా?
- బీజేపీ నేతలపై రాహుల్ ధ్వజం



అల్వార్(రాజస్తాన్): పాఠశాలల్లో ఆంగ్ల భాషలో విద్యా బోధనను వ్యతిరేకిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ నాయకులపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. ''వారు ఇంగ్లిష్‌ను వ్యతిరేకిస్తున్నారు. కానీ అమిత్ షా నుంచి బీజేపీ సీఎంలు, ఎంపీలు, ఎమ్మెల్యేల దాకా అందరి పిల్లలు ఇంగ్లిష్ మీడియం స్కూళ్లలో చదువుకున్నారు. ఇంగ్లిష్‌లో మాట్లాడుతున్నారు. ఇతరులు మాత్రం ఇంగ్లిష్ మాట్లాడవద్దా? ఇదేం పద్ధతి?'' అంటూ సోమవారం రాజస్తాన్‌లో భారత్ జోడో యాత్రలో మండిపడ్డారు. పేద రైతులు, కూలీల పిల్లలు ఇంగ్లిష్ నేర్చుకోవడం, పెద్ద కలలు కనడం బీజేపీ నేతలకిష్టం లేదని ఆరోపించారు. కూలీలు ఎప్పటికీ కూలీలుగానే ఉండిపోవాలన్నది వారి ఉద్దేశమని మండిపడ్డారు. మీ పిల్లలెక్కడ చదివారంటూ వారిని నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ''హిందీ, ఇతర భారతీయ భాషలూ ముఖ్యమే. కానీ ప్రపంచంతో మాట్లాడాలంటే హిందీ ఉపకరించదు. ఆంగ్లంపై పట్టుంటేనే సాధ్యం'' అన్నారు. రాజస్తాన్‌లో అశోక్ గెహ్లాట్ ప్రభుత్వం 1,700 ఇంగ్లిష్ మీడియం స్కూళ్లను ప్రారంభించడం, 10,000 మంది ఇంగ్లిష్ టీచర్లను నియమించడం గొప్ప విషయమని ప్రశంసించారు.

ప్రేమ దుకాణం తెరుస్తున్నా..

విద్వేషమనే మార్కెట్‌లో జోడో యాత్ర ద్వారా తాను ప్రేమ అనే దుకాణాన్ని తెరుస్తున్నానని రాహుల్ వ్యాఖ్యానించారు. ''గాంధీ, నెహ్రూ, సర్దార్ పటేల్, అంబేడ్కర్, అబుల్ కలాం ఆజాద్ సైతం ఇదే పని చేశారు. బీజేపీ నేతలు సైతం ప్రేమ దుకాణం తెరవాలి'' అని సూచించారు.

ఉజ్వల లబ్ధిదారులకు రూ.500కే సిలిండర్

ఏడాదికి 12 సిలిండర్లు: రాజస్థాన్ సీఎం

అల్వార్(రాజస్థాన్): కేంద్ర ప్రభుత్వ ఉజ్వల పథకం కింద లబ్ధిపొందే రాష్ట్రంలోని పేదలకు రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ అందిస్తామని రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ప్రకటించారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఏడాదికి 12 సిలిండర్లు ఈ ధరకే అందిస్తారు. ' ఉజ్వల పథకం కింద ప్రధాని మోదీ పేదలకు ఉచితంగా ఎల్పీజీ కనెక్షన్లు అయితే ఇచ్చారుగానీ ధరలు రూ.400 నుంచి ఏకంగా రూ.1,040కి పెరగడంతో ఎవరూ కొత్తగా సిలిండర్లు బుక్‌చేయట్లేరు. రాష్ట్రంలో ఇకపై ఉజ్వల పథకం లబ్ధిదారులైన దారిద్రరేఖకు దిగువన ఉన్న పేదలకు రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ అందిస్తాం. ఈ ధరకే ఏడాదికి 12 సిలిండర్లు ఇస్తాం' అని సోమవారం గెహ్లాట్ చెప్పారు. సోమవారం రాజస్థాన్‌లోని అల్వార్‌లో జరుగుతున్న రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో రాహుల్‌తోపాటు గెహ్లాట్, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే పాల్గొన్నారు.

పెళ్లి పీటలెక్కిన అభిమానం



తిరువనంతపురం: క్రికెట్‌కు అంతులేని ఆదరణ ఉన్న మన దేశంలో ఈ నూతన వధూవరులు ఫుట్‌బాల్‌పై అభిమానాన్ని వినూత్నంగా చాటుకున్నారు. కేరళకు చెందిన సచిన్.ఆర్, ఆర్.అథీరా ఆదివారం పెళ్లి చేసుకున్నారు. ప్రపంచ కప్ ఫుట్‌బాల్ ఫైనల్ మ్యాచ్ కూడా అదే రోజు జరిగింది. అర్జెంటీనా స్టార్ ఆటగాడు మెస్సీకి సచిన్ వీరాభిమాని. అథీరాకు ఫ్రెంచ్ టీమ్ అంటే ప్రాణం. ఫైనల్‌కు కొన్ని గంటల ముందే కొచ్చిలో వీరి పెళ్లి జరిగింది. దాంతో సంప్రదాయ దుస్తులు, నగలతోపాటు అర్జెంటీనా కెప్టెన్ మెస్సీ జెర్సీని సచిన్, ఫ్రెంచ్ స్టార్ ఎంబాపె జెర్సీని అథీరా ధరించి పెళ్లి పీటలపై కూర్చున్నారు. వివాహమై విందు పూర్తియన వెంటనే క్షణం కూడా ఆలస్యం చేయకుండా ఫైనల్ మ్యాచ్ తిలకించేందుకు కొత్త దంపతులు కొచ్చి నుంచి 206 కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరువనంతపురంలోని వరుని ఇంటికి ఆగమేఘాలపై చేరుకున్నారు. సచిన్‌కు ఇష్టమైన అర్జెంటీనా సంచలనం విజయం సాధించడంతో చివరికి ఇరువురూ సంబరాలు చేసుకున్నారు.

ఇదిలా ఉండగా, అర్జెంటీనా గెలిస్తే ప్రజలకు ఉచితంగా బిర్యానీ వడ్డిస్తానని కేరళలోని త్రిసూర్‌లో ఓ హోటల్ యజమాని ముందే ప్రకటించాడు. చెప్పినట్లుగానే తన హోటల్‌కు వచ్చిన వారందరికీ ఉచితంగా బిర్యానీ పంపిణీ చేసి మాట నిలుపుకున్నాడు!

ఎటునుంచైనా

ఈశాన్య రాష్ట్రాలపై డ్రాగన్ గురి

- టిబెట్ వైమానిక స్థావరాల్లో యుద్ధ విమానాలు, డ్రోన్ల మోహరింపు
- కవ్వింపు చర్యలకు దిగుతున్న కయ్యాలమారి
- గగనతలంలో యుద్ధవిమానాలతో భారత్ నిరంతర గస్తీ

కయ్యాలమారి చైనా దుందుడుకుగా వ్యవహరిస్తూ ఈశాన్య రాష్ట్రాలపై గురి పెట్టింది. అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్‌లో ఇటీవల ఘర్షణల అనంతరం టిబెట్‌లోని వైమానిక స్థావరాల్లో భారీ సంఖ్యలో డ్రోన్లు, యుద్ధ విమానాలను మోహరించి మనపై కయ్యానికి కాలు దువ్వే ప్రయత్నాలు చేసింది. మల్టీ నేషనల్ ఐటీ కంపెనీ మక్సర్ తీసిన హై రిజల్యూషన్ ఉప గ్రహ ఛాయాచిత్రాల ద్వారా ఈ విషయం తేటతెల్లమైంది. మన వైమానిక దళం అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ చైనా కవ్వింపు చర్యల్ని దీటుగా ఎదుర్కొంది. గగనతలంలో నిరంతరం యుద్ధ విమానాలతో గస్తీ నిర్వహిస్తూ డ్రాగన్ దేశం కార్యకలాపాలను గట్టిగా అడ్డుకుంటామని చాటి చెప్పింది. భవిష్యత్‌లో చైనా నుంచి ఎటు నుంచైనా ముప్పు పొంచి ఉందని ఈ ఛాయా చిత్రాలు హెచ్చరిస్తున్నాయి. **- సాక్షి, నేషనల్ డెస్క్**

బాంగ్డా వైమానిక కేంద్రం



అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దుకి 150 కి.మీ. దూరం

డబ్ల్యూజెడ్–7 ''సోరింగ్ డ్రాగన్'' డ్రోన్, ఈ డ్రోన్‌ని గత ఏడాది చైనా అధికారికంగా వైమానిక దళంలోకి ప్రవేశపెట్టింది. 10 గంటల సేపు నిరంతరాయంగా ప్రయాణించగలదు. నిఘా వ్యవస్థకు ఈ డ్రోన్ పెట్టింది పేరు. భారత్‌లో నిర్దేశిత లక్ష్యాలను ఛేదించడానికి క్రూయిజ్ క్షిపణులు పని చేసేలా డేటాను ప్రసారం చేసే సామర్థ్యం కూడా ఈ డ్రోన్ కలిగి ఉంది. ఈ తరహా డ్రోన్లు భారత్ వద్ద లేవు. ఇక డిసెంబర్ 14నాటి ఉపగ్రహ ఛాయా చిత్రాల్లో బాంగ్డాలో ఫ్లాంకర్ టైప్ యుద్ధ విమానాలు రెండు మోహరించి ఉన్నాయి. ఈ యుద్ధ విమానాలు భారత్ దగ్గర ఉన్న ఎస్‌యూ–30ఎంకేఐ మాదిరిగా పని చేస్తాయి.

లాసా వైమానిక కేంద్రం

అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దుకి 260 కి.మీ. దూరం

నాలుగు జే–10 యుద్ధవిమానాలను సిద్ధంగా ఉంచింది. చైనా పీపుల్ లిబరేషన్ ఆర్మీలో ఈ యుద్ధ విమానాలు అత్యంత విశ్వసనీయమైనవిగా గుర్తింపు పొందాయి. 1988 నుంచి వీటిని వాడుతున్న చైనా ఆర్మీకి ఈ యుద్ధ విమానాలు బాక్ బోన్ అని చెప్పొచ్చు. ఇక లాసాలో మౌలిక సదుపాయాల కల్పనకి సంబంధించిన పనులు కూడా యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తోంది. రెండో రన్‌వే నిర్మాణం శరవేగంగా సాగుతోంది.



బలం పెంచుకుంటున్న ఇరుపక్షాలు




2017లో డోక్లాం సంక్షోభం తర్వాత భారత్, చైనా వాస్తవాధీన రేఖ వెంబడి ఆయుధాలపరంగా, సదుపాయాలపరంగా బలం పెంచుకుంటున్నాయి. వివాదాస్పద జోన్లలో భారత్ సైన్యం కదలికల్ని అనుక్షణం అంచనా వేయడానికి చైనా వైమానిక సామర్థ్యాన్ని పెంచుకుంటూ పోతోంది. సరిహద్దుల్లో చైనా మోహరిస్తున్న ఆధునిక యుద్ధ విమానాలు, ఇతర కొత్త ప్రాజెక్టులు, నిర్మాణాలు డ్రాగన్ బలాన్ని విపరీతంగా పెంచేస్తున్నాయని టిబెట్ ప్రాంతంలో ఆ దేశ మిలటరీ కార్యకలాపాలను నిరంతరం ట్రాక్ చేసే మిలటరీ అనలిస్ట్ సిమ్ టాక్ అభిప్రాయపడ్డారు. టిబెట్, తూర్పు లద్దాఖ్ మీదుగా చైనా బలగాలను అనుసంధానం చేయడానికి కొత్త మార్గాలను నిర్మించే పనిలో డ్రాగన్ దేశం ఉందని చెప్పారు. అస్సాం, బెంగాల్‌లో మైదాన ప్రాంతాలైన తేజ్‌పూర్, మిసామరి, జోర్హాట్, హషిమారా, బాగ్‌డోగ్రాలో దశాబ్దాలుగా భారతీయ యుద్ధ విమానాల నిర్వహణ మన దేశానికి ఎంతో కలిసొస్తోంది. కొండ ప్రాంతాల్లోని టిబెట్ వైమానిక స్థావరాల నిర్వహణలో చైనాకు యుద్ధ విమానాల బరువుపై పరిమితులున్నాయి. మనకది లేకపోవడం కలిసొచ్చే అంశమని విశ్లేషకులు అంటున్నారు.

షిగాట్సే వైమానిక కేంద్రం

సిక్కిం సరిహద్దుకి 150కి.మీ. దూరం

ఇక్కడ చైనా అన్‌మాన్డ్ ఏరియల్ వెహికల్స్ (యూఏవీ)లను మోహరించింది. టిబెట్‌లో మొత్తం రక్షణ వ్యవస్థనే ఆధునీకరిస్తోంది. ఆధునిక యుద్ధ విమానాలైన జే–10సీ, జే–11డీ, జే–15 విమానాలు కూడా మోహరించి ఉన్నాయి. ఇవన్నీ గతంలో ఎన్నడూ లేని విధంగా భారత్ వినియోగించే జెట్స్‌ను అడ్డుకునే అవకాశాలున్నాయి.



సాక్షి విజయనగరం

మంగళవారం । 20 । డిసెంబర్ । 2022



జాకరమ్మకు పూజలు

బొబ్బిలి రూరల్: బొబ్బిలి మండలం రాజచెరువువలస గిరిజనులు జాకరమ్మతల్లికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. పూలు, కొత్తగా చేతికందిన పంటలను నైవేద్యంగా సమర్పించారు.



పౌష్టికాహారంతో క్షయ దూరం

విజయనగరం ఫోర్ట్: క్షయ రోగులు పౌష్టికాహారం తీసుకుంటే వేగంగా కోలుకుంటారని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ రామేశ్వరిప్రభు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రం ఆవరణలో క్షయ రోగులకు సోమవారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.



గిరిజన గ్రామాల్లో 'గాండ్రింపు'

రామభద్రపురం మండలంలో పులి గాండ్రిస్తోంది. మూలసెలగాం, పెదసెలగాం, పాతరేగ గ్రామానికి అతి సమీపంలో ఉన్న కొండ పరిసరాల్లో సంచరిస్తోంది.

- 8లో

న్యూస్‌రీల్

కనకమహాలక్ష్మి హుండీల ఆదాయం రూ.3,39,912



అమ్మవారి దేవస్థానంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న దేవదాయశాఖ సిబ్బంది

చీపురుపల్లి: భక్తుల ఇలవేల్పు కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలోని హుండీల ద్వారా రూ.3,39,912లు ఆదాయం లభించింది. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ పీవీ లక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం అమ్మవారి దేవస్థానంలో హుండీలను లెక్కించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 5 నుంచి డిసెంబర్–19 వరకు భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించారు. కార్యక్రమంలో దేవస్థానం పాలకవర్గం చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరుకుమార్, ఈఓ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అందుబాటులోకి బియ్యం గొడౌన్



బియ్యం గొడౌన్ వద్ద కాటాను ప్రారంభిస్తున్న అధికారులు

గజపతినగరం: మిల్లర్లు మరపట్టిన బియ్యాన్ని భద్రపరిచేందుకు గజపతినగరం నియోజకవర్గం మార్కెట్‌యార్డులో ఓ గొడౌన్‌ను ఏపీ గిడ్డంగుల సంస్థ రీజనల్ మేనేజర్ ఎస్.రవికుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 వేల మెట్రిక్ టన్నుల బియ్యంను ఇక్కడ భద్రపరచవచ్చున్నారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.నరేష్, వేర్‌హౌస్ మేనేజర్ వై.రాజశ్రీ, గజపతినగరం మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరిశెట్టి బాబ్జి, సివిల్ సప్లయ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఓటరు జాబితా పరిశీలకుడు జిల్లాకు రాక

విజయనగరం అర్బన్: ఓటరు జాబితా పరిశీలకుడు ఎ.బాబు మంగళవారం జిల్లాకు రానున్నారు. ఓటరు జాబితా సంక్షిప్త సవరణలపై కలెక్టర్, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌లతో మధ్యాహ్నం 3.30 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో సమీక్షించనున్నారు. మధ్యాహ్నం 4.15 గంటలకు రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి ఓటరు జాబితా సవరణల కార్యక్రమంపై వినతులు, ఫిర్యాదులు, సలహాలు స్వీకరిస్తారు. అదే రోజు సాయంత్రం 4.30 గంటలకు విశాఖ బయలుదేరి వెళతారని కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు.

అథ్లెటిక్స్‌లో రాణించిన పోలీస్



రెండు పతకాలు సాధించిన జయరామ్‌నాయుడు

బొబ్బిలి: నెల్లూరు ఏవీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈ నెల 16 నుంచి జరుగుతున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో బొబ్బిలి ఎస్‌ఈబీ సర్కిల్ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జయరామ్‌నాయుడు సత్తాచూపాడు. రేస్ వాకింగ్, హైజంప్ పోటీల్లో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 23లో పశ్చిమబెంగాల్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. కానిస్టేబుల్‌ను సీఐ ఆర్ జైభీమ్, సిబ్బంది సోమవారం అభినందించారు.

నేడు అంతర్ జిల్లాల బాడీబిల్డింగ్ పోటీలు

రాజాం సిటీ: రాజాంలోని జీఎంఆర్ ఐటీలో మంగళవారం అంతర్ జిల్లాల బాడీబిల్డింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్టు ఆంధ్రా బాడీబిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.బాబు సోమవారం విలేకరులకు తెలిపారు. ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు పది కేటగిరీల్లో పాల్గొంటారన్నారు. 20 మంది టెక్నికల్ సిబ్బందితోపాటు రిఫరీస్ హాజరవుతారని చెప్పారు. ఆయా కేటగిరీలలో ప్రథమ స్థానం పొందిన వారు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పంజాబ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో తలపడతారన్నారు. ఎడ్యుకేషన్ డైరెక్టర్ డీజే గిరీష్, జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్ వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్, శశికుమార్, పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ పర్యవేక్షణలో పోటీలు సాగుతాయని చెప్పారు.



- ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో బైజూస్ బోధన
- డిజిటల్ పాఠాలు లోడ్‌చేసిన ట్యాబ్‌లు పంపిణీకి సిద్ధం
- తొలివిడతలో 8వ తరగతి విద్యార్థులకు అవకాశం
- ఉమ్మడి విజయనగరం జిల్లాలో 27,701 మందికి ట్యాబ్‌లు
- ఇప్పటివరకూ చేరిన ట్యాబ్‌లు 14,325
- 21న పంపిణీని లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం జగన్
- నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల చేతుల మీదుగా పంపిణీ

సర్కారు బడి విద్యార్థులకు...
హైటెక్ కానుక



జగన్ మామయ్యకు థాంక్స్...

లెసన్ ఏదైనా అర్థంగాకపోతే క్లాస్‌లోనే టీచర్లను అడిగేవాళ్లం. తర్వాత ఎప్పుడైనా సందేహం వస్తే మళ్లీ క్లాస్‌కు వెళ్లినప్పుడే అడిగే అవకాశం ఉంటుంది. ఇప్పుడు ట్యాబ్ వస్తే అలా కాదు. కఠినంగా ఉండే పాఠ్యాంశాలను ఎన్నిసార్లయినా వినొచ్చు. ట్యాబ్‌లో లోడ్ చేసిన ఇ–లెసన్స్ బాగా ఉపయోగపడతాయి. మ్యాథ్స్, ఇంగ్లిష్ వంటి సబ్జెక్టులపై భయం పోయి మరింత ఆసక్తి పెరుగుతుంది. కంటెంట్ లోడ్ చేసి ఇవ్వడం వల్ల ఇంటర్నెట్ సౌకర్యం లేకపోయినా చదువుకోవడానికి అడ్డంకి ఏమీ ఉండదు. అందులో ఉండే క్విజ్‌లాంటి కార్యక్రమాలు కూడా ఎంతో ఉపయోపడతాయని మా టీచర్లు చెబుతున్నారు. మాలాంటి విద్యార్థుల ఉన్నత భవిష్యత్ కోసం అనేక సౌకర్యాలు కల్పిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మామయ్యకు థాంక్స్.

– పాలూరి రేణుకశ్రీ, 8వ తరగతి, బొండపల్లి ఉన్నత పాఠశాల

తొలి విడతలో ట్యాబ్ అవకాశం వీరికే...

నియోజకవర్గం	విద్యార్థులు	ఉపాధ్యాయులు
బొబ్బిలి	2,532	335
చీపురుపల్లి	2,621	390
గజపతినగరం	2,371	370
నెల్లిమర్ల	3,358	448
రాజాం	2,650	340
సాలూరు	2,747	263
ఎస్‌కోట	2,114	271
విజయనగరం	1,979	235
పాలకొండ	2,592	281
పార్వతీపురం	1,849	249
కురుపాం	3,079	295
మొత్తం	27,892	3,477

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

విద్యారంగానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. విప్లవాత్మక సంస్కరణలు అమలుచేస్తోంది. ఇవి విద్యార్థుల అభ్యసనకు తోడ్పడుతున్నాయి. భవిష్యత్‌కు గట్టిపునాది వేస్తున్నాయి. ప్రభుత్వ బడుల్లో ఆంగ్లమాధ్యమాన్ని అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం... విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు ఉపాధ్యాయులకు ఓ వైపు శిక్షణ ఇస్తూనే, మరోవైపు దేశంలోనే అతిపెద్ద ఎడ్యుకేషనల్ టెక్ కంపెనీ బైజూస్‌తో ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. ఉపాధ్యాయుడు తరగతి గదిలో బోధించే పాఠాలను విద్యార్థులు మళ్లీ తమకు అనుకూలమైన సమయంలో పునశ్చరణ చేసుకోవడానికి వీలుగా ట్యాబ్‌లను ఉచితంగా అందిస్తోంది. బైజూస్ సంస్థ అందించే పాఠ్యాంశాల బోధనలను క్రోడీకరించిన ట్యాబ్ (కిటెల్)ను విద్యార్థికి ఒకటి చొప్పున సమకూర్చుతోంది. ఈ ప్రక్రియను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 21వ తేదీన లాంఛనంగా ప్రారంభించనున్నారు. తర్వాత నియోజకవర్గాల్లో ఆయా ఎమ్మెల్యేల చేతుల మీదుగా విద్యార్థులకు అందించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కేంద్రాలకు వచ్చిన ట్యాబ్‌లను మండల కేంద్రాలకు పంపుతున్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు 13,781 ట్యాబ్‌లు ఇంతవరకు వచ్చాయి.

తొలి విడతలో 8వ విద్యార్థులకు చాన్స్...

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 27,892 మంది 8వ తరగతి విద్యార్థులకు తొలి విడతలో ట్యాబ్ అందుకునే అవకాశం వచ్చింది. విజయనగరం జిల్లాలోని 457 హైస్కూళ్లు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 18101 మంది, పార్వతీపురం మన్యం జిల్లాలో 263 హైస్కూళ్లు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 9,952 మంది విద్యార్థులు ఉన్నారు. విజయనగరం జిల్లాలో 2,457 మంది, పార్వతీపురం మన్యం జిల్లాలో 1021 మంది సబ్జెక్టు టీచర్లు వారికి బోధిస్తున్నారు.



ట్యాబ్‌ల్లో కంటెంట్‌ను ప్రీలోడ్ చేస్తున్న విద్యాశాఖ సిబ్బంది

ముందస్తుగానే కంటెంట్ ప్రీలోడ్...

విద్యార్థికి ట్యాబ్‌తో పాటు ట్యాబ్ కవర్, ఓటీసీ ఇవ్వనున్నారు. బైజూస్ రూపొందించిన పాఠ్యాంశాల కంటెంట్ బోధనలను ట్యాబ్‌లలో ప్రీలోడ్ చేస్తున్నారు. ఇన్‌స్టాల్ కోసం హై స్పీడ్ ఇంటర్నెట్‌ను మండల కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. ప్రతి మండలంలో రోజుకు కనీసం వంద ట్యాబ్‌లకు ఇన్‌స్టాలేషన్ పూర్తి చేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ట్యాబ్ వివరాలు అప్‌డేట్ చేసేందుకు స్కూల్ అకడమిక్ యాప్‌లో సదుపాయం కల్పించారు. సులభమైన పర్యవేక్షణ కోసం ఎంఈఓ, డీఈఓ లాగిన్‌ల్లో పురోగతి వివరాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. టీచర్లకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని వెబెక్స్ ద్వారా విద్యాశాఖ రెండు రోజులుగా చేపడుతోంది.

విద్యార్థులకు పూర్తి అవగాహన...

బైజూస్ యాప్ ద్వారా ట్యాబ్‌లో రూపొందించిన 8వ తరగతికి సంబంధించిన ఈ–కంటెంట్‌పై విద్యార్థికి అవగాహన కల్పిస్తారు. పాఠ్యపుస్తకాల్లోని అధ్యాయాల వారీగా కంటెంట్ ఇండెక్స్ పొందుపరిచి ఉంటుంది. గణితం, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, రసాయన శాస్త్రం, చరిత్ర, భూగర్భశాస్త్రం, పౌరశాస్త్రం సబ్జెక్టుల పాఠాలను బోధించేలా అవకాశం కల్పిస్తున్నారు. ప్రతి అధ్యాయం కాన్సెప్ట్‌లుగా విభజించారు. ప్రతి కాన్సెప్ట్‌ను రెండు నుంచి నాలుగు నిమిషాల వ్యవధితో వీడియోలుగా పొందుపర్చారు. అలా 300 వీడియోలతో మొత్తం 57 అధ్యాయాలు, 472 కాన్సెప్ట్‌లను రూపొందించారు. అన్ని సబ్జెక్టులకు సంబంధించి 168 ప్రశ్నపత్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నారు.



మండలాల వారీగా ట్యాబ్‌ల పంపిణీ...

జిల్లా కేంద్రానికి వస్తున్న ట్యాబ్‌లను ఆయా మండల కేంద్రాలకు పంపిణీ చేస్తున్నాం. వార్షిక పరీక్షల ప్రశ్నపత్రంలో బైజూస్ ప్రీమియం యాప్‌లో పొందుపరిచిన ప్రశ్నలు ఉంటాయి. ట్యాబ్ రిపేర్లు, పరికరాల రీప్లేస్‌మెంట్ కోసం స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రాష్ట్ర స్థాయిలో ఉంటుంది. రాష్ట్ర కమిషనరేట్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నారు. డిపార్ట్‌మెంట్ అధికారిక వెబ్ పోర్టల్‌లో కూడా ట్యాబ్ వినియోగంపై విద్యార్థులు తరచుగా అడిగే సందేహాలు, సమస్యలను పొందుపరుస్తారు. అవి మిగతా విద్యార్థులు చూడవచ్చు.

– బి.లింగేశ్వరరెడ్డి, డీఈవో, విజయనగరం జిల్లా



ఉత్తమ ఫలితాలను సాధించవచ్చు

సాధారణంగా తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను విద్యార్థులు ఒకసారి వింటారు. తరువాత వేరే పాఠ్యాంశాలు ఉంటాయి. మొత్తం సిలబస్ పూర్తయిన వరకు వెనుక పాఠ్యాంశాల అంశాన్ని ఉపాధ్యాయులు మరోసారి చెప్పలేని పరిస్థితులు ఉంటాయి. దీనివల్ల వెనుకబడిన విద్యార్థులు అందుకోలేరు. కానీ బైజూస్ ప్రీమియం యాప్ ద్వారా అలాంటి పరిస్థితిని అధిగమించవచ్చు. ఉత్తమ ఫలితాలను సాధించవచ్చు.

– టి.సన్యాసిరాజు, జిల్లా సెక్రటరీ, డీసీఈబీ



ఇంటర్నెట్ లేకపోయినా ట్యాబ్ ఉపయోగం...

బైజూస్ ప్రీమియం యాప్ వల్ల ఇంటర్నెట్ లేని ప్రాంతాల విద్యార్థులు కూడా ఈ–లెసన్స్‌ను వినే అవకాశం లభిస్తుంది. తరగతి గదిలో విన్న తరువాత అర్థం కాని అంశాలను ఇంటివద్ద పూర్తిగా అవగాహన వచ్చేవరకు వినొచ్చు. పాఠ్యాంశాలపై ప్రతి ఒక్కరూ క్షుణ్ణంగా పట్టు సాధించుకోవచ్చు.

– బి.ఆనందరావు, మాథ్స్ టీచర్, మలిచర్ల ఉన్నతపాఠశాల, విజయనగరం మండలం

దరఖాస్తు గడువు పెంపు

విజయనగరం ఫోర్ట్: మెడికల్ రికార్డు టెక్నీషియన్ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 21వ తేదీ వరకు గడువు పొడిగించినట్టు మెడికల్ హెల్త్ సర్వీసెస్ రీజనల్ డైరెక్టర్ ఎస్.ఉమాసుందరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ రికార్డు టెక్నీషియన్ పోస్టులు– 2ఖాళీగా ఉన్నాయన్నారు.

పేదలందరికీ సొంతింటి భాగ్యమే
ప్రభుత్వ ధ్యేయం

- ఇళ్ల లబ్ధిదారులకు రూ.603.13 కోట్ల బిల్లుల చెల్లింపు
- రూ.21.39 కోట్లతో మౌలికసదుపాయాల కల్పన
- ఈ నెలాఖరు నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తికి చర్యలు
- హౌసింగ్ ఈఈ వి.శ్రీనివాస్

రామభద్రపురం: రాష్ట్రంలో ఇళ్లలేని పేదవారు ఉండకూడదని, అద్దె ఇళ్లలో అవస్థలు పడకుండా సొంతింట్లో సంతోషంగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని హౌసింగ్ ఈఈ వి.శ్రీనివాస్ తెలిపారు. రామభద్రపురం హౌసింగ్ కార్యాలయంలో తెర్లాం, బాడంగి, బొబ్బిలిరూరల్ మండలాల హౌసింగ్ డీఈఈ పి.అప్పయ్యతో కలిసి విలేకరులతో సోమవారం మాట్లాడారు. 'పేదలందరికీ ఇళ్ల పథకం'లో జిల్లాలో 78,158 మందికి ఇళ్ల మంజూరు చేశామన్నారు. అందులో 16,855 ఇళ్ల నిర్మాణాలు పూర్తయినట్టు వెల్లడించారు. శ్లాబ్ పూర్తయినవి 6,957 ఇళ్లుకాగా, శ్లాబ్ స్థాయిలో 4,990, బేస్‌మెంట్ స్థాయిలో 14,926, పునాది దశలో 27,681 ఇళ్లు ఉన్నట్టు వెల్లడించారు. మిగిలిన 6,741 ఇళ్ల నిర్మాణాలు ఈ నెలాఖరు నాటికి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటి వరకు ఇళ్ల బిల్లుల కింద లబ్ధిదారులకు రూ.603,13 కోట్లు చెల్లించామన్నారు. 651 జగనన్న లే అవుట్‌లలో ఇంటి నిర్మాణాలకు ఇబ్బంది లేకుండా రూ.21.39 కోట్లతో నీటివసతి, అప్రోచ్ రోడ్లు, విద్యుత్ స్తంభాల మార్పు, ఇంటర్నల్ రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. వర్షాల కారణంగా నెలరోజుల కిందట నెమ్మదిగా సాగిన నిర్మాణాలు ప్రస్తుతం ఊపందుకున్నాయని చెప్పారు. ప్రతీ లబ్ధిదారుకు రూ.1.80 లక్షల ఆర్థిక సహకారంతో పాటు బ్యాంకుల నుంచి అదనంగా రూ.35 వేల రుణసదుపాయం కల్పిస్తున్నట్టు వెల్లడించారు. ఇసుక, ఇనుము, సిమెంట్, సున్నం, కిటికీల మెటీరియల్ తదితర నాణ్యమైన నిర్మాణ సామగ్రిని సమకూర్చుతున్నామని చెప్పారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈఈ వై.సత్యారావునాయుడు ఉన్నారు.



మాట్లాడుతున్న హౌసింగ్ ఈఈ వి.శ్రీనివాస్

'తాటిపూడి' మూడో దశ పనులకు రూ. 90కోట్లు

శృంగవరపుకోట: గ్రామీణ ప్రజలకు రక్షిత జలం సరఫరాలో భాగంగా తాటిపూడి వాటర్ ప్రాజెక్టు 3వ దశ పనులకు రూ.90 కోట్ల నిధులు మంజూరైనట్టు ప్రాజెక్టు డీఈ వై.గోవిందరావు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కేఆర్‌వీ పైడిరాజు, జేఈ సత్యకిశోర్, ప్రాజెక్టు జేఈ శైలజతో కలిసి మూడో విడత తాగునీరు అందివ్వాల్సిన వేపాడ, లక్కవరపుకోట మండలాల్లోని కొన్ని గ్రామాలను సోమవారం క్షేత్రస్థాయిలో డీఈ పరిశీలించారు. ఈ సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో రైల్వే ట్రాక్‌ను దాటాల్సిన పరిస్థితులు, కొన్ని గ్రామాలకు గ్రావెటీతో నిమిత్తం లేకుండా పంపింగ్ చేసేందుకు కావాల్సిన సంప్‌లు, వాటి కోసం కేటాయించాల్సిన నిధులు తదితర అంశాలపై అవగాహనకు వచ్చారు. అనంతరం ఎస్.కోట ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో డీఈ విలేకరులతో మాట్లాడుతూ జలజీవన్ మిషన్‌లో భాగంగా తాటిపూడి ప్రాజెక్టు ఫేజ్–3కి రూ.90 కోట్లు, ఎస్.కోట మండలానికి రూ.22.59 కోట్లు, జామికు రూ.20.74 కోట్లు, కొత్తవలసకు రూ.50.72 కోట్లు, లక్కవరపుకోటకు రూ.15.51 కోట్లు, వేపాడకు రూ.16.66 కోట్ల నిధులు జలజీవన్‌మిషన్ నుంచి మంజూరైనట్టు ఆయన తెలిపారు.



పైప్‌లైన్ ఏర్పాటుకోసం వేపాడ మండలం బొద్దాం గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్న అధికారులు

మడ్డువలస నీరు విడుదల

- ఆరుతడి పంటలు సాగుచేయాలని సూచన

వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ద్వారా సోమవారం సాగునీటిని విడుదల చేశారు. ముందుగా ప్రాజెక్టు డీఈ నర్మదాపట్నాయక్ హెడ్ స్లూయిస్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి స్విచ్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది రబీ సీజన్‌కు 10వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తామని తెలిపారు. ఆయకట్టు రైతులు మొక్కజొన్న, పెసర, మినుము పంటలతోపాటు ఆరుతడి పంటల సాగుచేసుకోవాలని సూచించారు. ప్రతీ 15 రోజులకు ఒకసారి మూడు నెలలపాటు సాగునీటిని సరఫరా చేస్తామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఏఈలు అన్వేష్, అనీల్, ప్రాజెక్టు సిబ్బంది పాల్గొన్నారు.



నీటిని విడుదల చేస్తున్న డీఈ నర్మదాపట్నాయక్

నిరుద్యోగులూ జరజాగ్రత్త..

విజయనగరం లీగల్: ఉద్యోగాల పేరిట నిరుద్యోగులకు ఎరవేసే మోసగాళ్లు ఉన్నారని, అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.కల్యాణచక్రవర్తి సోమవారం కోరారు. న్యాయ శాఖలో వివిధ పోస్టుల భర్తీల కోసం హైకోర్టు ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టుల ఇప్పిస్తామని దళారులు ఇప్పటికే పలు జిల్లాల్లో నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోందని, దరఖాస్తుదారులు అటువంటి వారి భారిన పడి మోసపోవద్దని హితవు పలికారు. న్యాయ శాఖలో పారదర్శకంగా నియామకాలు జరుగుతాయని, ఎటువంటి పైరవీలకు తావుండదని మరోసారి హెచ్చరించారు. మోసపూరితమైన చర్యలకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు తప్పవన్నారు.



కల్యాణచక్రవర్తి

భూగర్భ జలాలు పుష్కలం

- పరిరక్షణకు విరివిగా రీచార్జ్ పిట్స్
- ఊట బావుల చుట్టూ ట్రెంచ్‌ల నిర్మాణం
- కలెక్టర్ ఎ.సూర్యకుమారి

విజయనగరం అర్బన్: జిల్లాలో భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నాయని, వీటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని కలెక్టర్ ఎ.సూర్యకుమారి అన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ భూగర్భ జలాల లభ్యతలో మన జిల్లా రాష్ట్రంలోనే ఐదో స్థానంలో నిలిచిందన్నారు. సగటున కేవలం 1.99 మీటర్ల లోతులోనే మనకు భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయన్నారు. భూగర్భ జలాలను సక్రమంగా వినియోగించుకునేందుకు తగిన ప్రణాళికలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అందరికీ సురక్షిత తాగునీటిని అందించడం, రబీలో సాగు విస్తీర్ణాన్ని పెంచడం, పరిశ్రమలను ప్రోత్సహించడం వంటివి చేపట్టాలని సూచించారు. భూగర్భజలాల పరిరక్షణకు ఉపాధిహామీ నిధులతో విరివిగా రీచార్జి పిట్స్‌ను, చెక్‌డ్యాములు నిర్మించాలని సూచించారు. ఊటబావుల చుట్టూ ట్రెంచ్‌లు నిర్మించాలన్నారు. నీటి వృథాను అరికట్టేందుకు బిందు, తుంపర సేద్యాన్ని ప్రోత్సహించాలన్నారు. భూగర్భ జలశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ భూగర్భ జల అంచనా 2021–22 ముఖ్య అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో సుమారు 1132 వాగులు, గెడ్డలు, నదులు తదితర నీటి ప్రవాహాలు ఉన్నాయని, వీటి ద్వారా భూగర్భ జలాలు సమృద్ధిగా లభిస్తున్నాయన్నారు. జిల్లాలో 150 మీటర్ల లోతుకు మించి బోరు తీయడానికి ఆమోదం లేదని తెలిపారు. సమావేశంలో సీపీఓ పి.బాలాజీ, జిల్లా వ్యవసాయాధికారి తారకరామారావు, పశు సంవర్థక అధికారి డాక్టర్ వై.వి.రమణ, మత్స్యశాఖాధికారి నిర్మలాకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఉమాశంకర్, డ్వామా పీడీ జి.ఉమాపరమేశ్వరి, ఏపీఎంఐపీ పీడీ పీఏవీ లక్ష్మీనారాయణ, పరిశ్రమలశాఖ జీఎం పాపారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.సూర్యకుమారి

79 కుటుంబాలకు ఆర్థిక సాయం

విజయనగరం క్రైమ్: అబ్కారీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పరివర్తన 2.0 కార్యక్రమంలో భాగంగా జీవనోపాధి నిమిత్తం 79 కుటుంబాలకు వివిధ శాఖల ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందింది. ఈ మేరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో సమకూర్చిన రూ.43.31 లక్షల విలువైన చెక్కులను పాత అబ్కారీ నేరస్తులకు కలెక్టర్ ఎ.సూర్యకుమారి సోమవారం అందజేశారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, ఎక్సైజ్, డీఆర్‌డీఏ, పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో పరివర్తన 2.0 కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రుణ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని మెరుగైన జీవనోపాధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఈబీ జేడీ, ఏఎస్పీ ఆస్మా పర్వీన్, డీఎస్పీ శైలజారాణి, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్‌చక్రవర్తి, పశుసంవర్థక శాఖ జేడీ రమణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

- జగన్నాథవలసలో మ్యాంగో కలెక్షన్ సెంటర్ ప్రారంభం
- పాల్గొన్న జెడ్పీ చైర్మన్, బొబ్బిలి ఎమ్మెల్యే

తెర్లాం: రైతు సంక్షేమానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యమిస్తున్నారని, వారికి ఉపయోగపడే పథకాలు ఆచరణలోకి తెస్తున్నారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు(చిన్నశ్రీను), బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పేర్కొన్నారు. తెర్లాం మండలం గోపాలవలస పంచాయతీ జగన్నాథవలస గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించిన మామిడి కలెక్షన్ సెంటర్‌ను సోమవారం ప్రారంభించారు. మామిడి ఉత్పత్తిదార్ల సంఘం మండలాధ్యక్షుడు గొందాల వెంకటరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ రైతును రాజుగా చేయాలన్న ఏకైక లక్ష్యంతో సీఎం పనిచేస్తున్నారన్నారు. ఆర్‌బీకేలలోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. మామిడి పంట నిల్వకు, మద్దతు ధర వచ్చినప్పుడు విక్రయించుకునేందుకు ఇక్కడి కలెక్షన్ సెంటర్ ఉపయోగపడుతుందన్నారు. ఉద్యానవన శాఖ డీడీ జమదగ్ని మాట్లాడుతూ జిల్లాలో 11 మ్యాంగో కలెక్షన్ సెంటర్లు మంజూరు చేయగా జగన్నాథవలసలో పనులు పూర్తయ్యాయని, మిగిలిన చోట్ల వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పెదబాబు, వైఎస్సార్ సీపీ తెర్లాం, బొబ్బిలి మండలాల అధ్యక్షులు బాబ్జీరావు, వేణుగోపాలనాయుడు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, బుడా చైర్మన్ ప్రతినిధి గోపాలరావు, తెర్లాం, బాడంగి జెడ్పీటీసీలు గర్భాపు లూర్దు, రామారావు, వైస్ ఎంపీపీ రమాదేవి, గోపాలవలస, పెరుమాళి సర్పంచ్‌లు గొందాల కుమారి, హేమలత, జిల్లా అటవీశాఖాధికారి వెంకటేష్, ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, తహసీల్దార్ రాజేశ్వరరావు, రామారావు, జగన్నాథం, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



జగన్నాథవలసలో నిర్మించిన మ్యాంగో కలెక్షన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీచైర్మన్, ఎమ్మెల్యే

స్పందన అర్జీలు వెంటనే పరిష్కరించాలి

• కలెక్టర్ నిషాంత్ కుమార్


వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణు చరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట రావు ప్రజల నుంచి 106 అర్జీలు స్వీకరించారు. అలాగే విభిన్న ప్రతిభావంతులకు సంబంధించి కలెక్టర్ కార్యాలయంలోని సెల్లార్‌లో ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించి వారినుంచి ఆరు దరఖాస్తులు స్వీకరించారు.

నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలి

నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులకు సూచించారు. ఈ మేరకు సోమవారం ఆయన ప్రభుత్వ పథకాల లక్ష్యాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాక్సినేషన్, బాలికలు, గర్భిణులు, ఆయుష్మాన్ భారత్, జగనన్న స్వచ్ఛ సంకల్పం పథకాల లక్ష్యాలను పూర్తిచేయాలని ఆదేశించారు. బడి ఈడు పిల్లలు తప్పనిసరిగా పాఠశాలలకు వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎక్కడైనా బడి ఈడు పిల్లలతో పనిచేయిస్తే వారిపై చైల్డ్ లేబర్ చట్టం ప్రకారం కేసులు పెట్టాలని సూచించారు. విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అమ్మ ఒడి, మధ్యాహ్న భోజన పథకం, జగనన్న విద్యా కానుక కిట్లు, అమలు చేస్తోందన్నారు. సచివాలయసిబ్బంది పనితీరుపై జిల్లా అధికారులు పర్యవేక్షణ చేయాలని, ప్రతి పంచాయతీలో సచివాలయం, సిబ్బందిని నియమించినప్పటికీ వారు సరిగా పనిచేయకపోవడంవల్ల జిల్లా కార్యాలయాలపై పనిభారం తగ్గడం లేదన్నారు. ప్రజలు ప్రతి పనికి జిల్లా కార్యాలయాలకు వస్తున్నారని, కావున సచివాలయ సిబ్బంది పనితీరును మదింపు చేసి శాఖలవారీగా పరిశీలించి నివేదికలను అందజేయాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎ.ఈశ్వర రావు, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, పీఆర్ ఈఈ ఎంవీజీ కృష్ణాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ.ప్రభాకర రావు, గృహ నిర్మాణసంస్థ పీడీ పి.రఘురాం, డీఈఓ ఎస్‌డీవీ రమణ, డ్వామా పీడీ కె. రామచంద్రరావు, గ్రామ, వార్డు సచివాలయాల సమన్వయ అధికారి వి.చిట్టిబాబు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి కేవీఎల్.ఎస్ మూర్తి, ఐసీడీఎస్ పీడీ జి.వరహాలు, జిల్లా మలేరియా అధికారి కె.పైడిరాజు, డీపీఓ బి.సత్యనారాయణ, జిల్లా ఔషధ నియంత్రణ అధికారి ఎ.లావణ్య, డీటీఓ ఎం.శశికుమార్, జిల్లా ప్రధాన అగ్నిమాపక శాఖ అధికారి కె.శ్రీను బాబు, జిల్లా ప్రజా రవాణా అధికారి టీవీఎస్. సుధాకర్, క్రీడల చీఫ్‌కోచ్ ఎస్.వేంకటేశ్వర రావు, జిల్లా రిజిస్ట్రార్ ఎంఎస్‌కే పూర్ణచంద్, జిల్లా పరిశ్రమల అధికారి పి.సీతారాం తదితరులు పాల్గొన్నారు.


ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

ఫిర్యాదులపై తక్షణమే చర్యలు: ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

పార్వతీపురంటౌన్: స్పందన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని ఆయన నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, వారి సమస్యలను చట్ట పరిధిలో తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని ఆదేశించారు. వారం రోజుల్లోగా ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించి, జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదికలు పంపాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు దిశ డీఎస్పీ హరిత చంద్ర, ఎస్బీ సీఐ ఎస్.శ్రీనివాస రావు, ఎస్సై దినకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ స్పందనకు 133 వినతులు


స్పందనలో వృద్ధుడి సమస్య వింటున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: కలెక్టర్ ఎ.సూర్యకుమారి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 133 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి 76 అర్జీలు ఉన్నాయి. పింఛన్ల కోసం, రేషన్ కార్డుల జారీ, ఉపాధి కల్పన, ఉపాధి హామీ బిల్లుల చెల్లింపు ఇతర సమస్యలపై మిగిలిన వినతులు అందాయి. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ఎ. సూర్యకుమారి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ప్రత్యేక సబ్‌కలెక్టర్లు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు

ఎస్పీ స్పందనకు 45 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఎస్పీ స్పందనకు 45 ఫిర్యాదులు అందాయి. విజయనగరం ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని పరిశీలించి, బాధితులతో నేరుగా మాట్లాడారు. అనంతరం సంబంధిత అధికారులతో జూమ్‌కాన్ఫరెన్స్‌లో మాట్లాడి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను ఎస్పీ ఎం.దీపికకు నివేదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐలు రుద్రశేఖర్, జి.రాంబాబు, ఎస్సై వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో 'గాండ్రింపు'

• రామభద్రపురం మండలంలో పులి సంచారం
• పెదసెలగాంలో ఆవుదూడపై దాడి
• కొండ పరిసరాల్లో పాదముద్రల ఆనవాళ్లు
• నిర్ధారించిన అటవీశాఖాధికారులు
• భయాందోళనలో ప్రజలు


పాతరేగ కొండ పరిసరాల్లో పులి పాదముద్రలు


పెదసెలగాంలోని పులి చంపేసిన ఆవుదూడ

రామభద్రపురం: మండలంలోని గిరిజన పంచాయతీ రావివలస పరిధిలోని మూలసెలగాం, పెదసెలగాం గ్రామాల పరిసరాలతో పాటు పాతరేగ గ్రామానికి అతి సమీపంలో ఉన్న కొండ పరిసరాలలో పులి సంచరిస్తోంది. పెదసెలగాంలో శనివారం రాత్రి బోయిన జయరావుకు చెందిన ఆవుదూడపై దాడిచేసి చంపేసి పొదలలోకి ఈడ్చుకెళ్లి తినేసింది. శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో మేతకు వెళ్లిన మేకల మందపై దాడికి పాల్పడడంతో పెద్దగా కేకలు వేస్తూ రాళ్లు రువ్వగా పక్కనే ఉన్న కొండ పొదల్లోకి పరుగులు తీసిందని మేకల కాపలాదారు సీతయ్య తెలిపాడు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు గ్రామాలకు వెళ్లి పులి సంచారంపై అడిగి తెలుసుకుని అటవీశాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. ఆయా గ్రామాలకు సోమవారం వచ్చి పరిశీలించిన అటవీశాఖాధికారులు ఆవుదూడపై దాడిచేసింది పులేనని పాదముద్రలు చూసి నిర్ధారించడంతో అక్కడి ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గడిచిన ఆరునెలలుగా తిరుగుతున్న పులి ఇప్పటివరకు ఇక్కడ సంచరించకపోవడంతో మండల ప్రజలు భయాందోళనకు గురికాకుండా ఉన్నారు. తాజాగా పాతరేగలో పులి కలకలం రేగడంతో గ్రామ ప్రజలే కాకుండా మండల ప్రజలు భయాందోళనతో బిక్కుబిక్కుమంటున్నారు. త్వరితగతిన పులిని బంధించాలని కోరుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దీనిపై జిల్లా అటవీశాఖాధికారి వెంకటేష్‌ను వివరణ కోరగా శికారుగంజి, మెరకముడిదాం, రామభద్రపురం, సాలూరు మండలాల్లోని కొండ ప్రాంతాలలో పులి సంచరించడం వాస్తవమేనని, ఆవులు, మేకలను చంపుతోంది తప్ప మనుషులకు ఏవిధమైన ప్రమాదం ఇప్పటి వరకూ సంభవించలేదన్నారు. ఒడిశా ప్రాంత అడవుల వరకు వెళ్లి తిరిగి వెనక్కి వచ్చేసిందని చెప్పారు. మనుషులు ఒంటరిగా వెళ్లకుండా మూకుమ్మడిగా వెళ్తే ఏమీ చేయదని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మూగజీవాలను సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలని చెప్పారు.

బధిర క్రీడాకారులకు అభినందన


రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

విజయనగరం: విజయ సాధనకు వైకల్యం అడ్డు కాదని, కృషి పట్టుదల ఉంటే ఎంతటి విజయాన్నైనా సాధించవచ్చని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్‌కౌశిక్ అన్నారు. విజయనగరం జిల్లా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ది డెఫ్ కు చెందిన 21 మంది బధిర విద్యార్థులు ఈనెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో జరిగిన బధిరుల సీనియర్ స్పోర్ట్స్ చాంపియన్ షిప్, జూనియర్ స్పోర్ట్స్ చాంపియన్ షిప్ పోటీలలో 4 బంగారు పతకాలు, 1 వెండి పతకం, 13 కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్ సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పోటీలలో క్రీడాకారులు పాల్గొని, ప్రతిభ కనబరిచి మంచి విజయాన్ని సాధించారని మెచ్చుకున్నారు. వైకల్యం కలిగిన వ్యక్తులలో మిగిలిన వారి కంటే అద్భుత శక్తులు ఉంటాయని, వాటిని వినియోగించుకుని చరిత్ర గుర్తించే విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఎంతోమంది వికలాంగులు అద్భుత విజయాలు సాధించి, భావితరాలకు స్ఫూర్తి శిఖరాలుగా నిలిచారని ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సూరిబాబు, అసోసియేషన్ సహాయకార్యదర్శి కనకల రమేష్ తదితరులు ఉన్నారు.

1200 సారా ప్యాకెట్లతో ఇద్దరి అరెస్ట్


స్వాధీనం చేసుకున్న సారా ప్యాకెట్లు, నిందితులతో ఎస్సై వెంకటరమణ

పాచిపెంట: మండల కేంద్రానికి చెందిన కిల్లాడి నానిబాబు, యజ్జల గౌరీస్‌ల నుంచి 1200 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్సై వెంకటరమణ తెలిపారు. సోమవారం ఉదయం వారిద్దరూ ఒడిశా నుంచి పాచిపెంట వైపు ద్విచక్ర వాహనంపై సారా తరలిస్తుండగా, కేసలి పంచాయతీ కుమ్మరవలస వద్ద పట్టుకుని సారా ప్యాకెట్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అనిల్‌కుమార్‌కు జెడ్పీ ఛైర్మన్ అభినందనలు


అనిల్‌కుమార్‌ను అభినందిస్తున్న జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం గంటస్తంభం: పవర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్ బోదంకి అనిల్‌కుమార్‌ను జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అభినందించారు. ఈ మేరకు జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసరావును జిల్లా పరిషత్ కార్యాలయంలో అనిల్‌కుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా న్యూజిలాండ్‌లో నవంబరు 24వతేదీ నుంచి డిసెంబరు 4వతేదీ వరకు జరిగిన అంతర్జాతీయ కామన్వెల్త్ క్రీడల్లో పవర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 83కేజీల కేటగిరిలో గోల్డ్‌మెడల్ సాధించినందుకు అనిల్‌కుమార్‌ను జెడ్పీ ఛైర్మన్ అభినందించారు. నాలుగు పోటీల్లో మెడల్స్ సాధించినట్లు అనిల్‌కుమార్ తెలపడంతో సంతోషం వక్తం చేశారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి


మృతి చెందిన పూసర్ల శ్రీనివాస్


స్థానికుల నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ రంగనాథం

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి శివారు రావలమ్మపాలెంలో సోమవారం ఒక వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామంలో దాసరి పైడితల్లి భార్య దేవుడమ్మతో కలిసి 10 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నాడు. దేవుడమ్మ ఆదిరెడ్డిపాలెం సమీపంలోని ఓ చర్చికి వెళ్తుండేది. అదే చర్చికి పూసర్ల శ్రీనావాస్(45) కూడా వస్తుండడంతో రెండేళ్ల కిందట దేవుడమ్మతో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయంతో గ్రామంలో దేవుడమ్మ ఇంటికి అప్పుడప్పుడు వస్తూ పోతూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం కూడా శ్రీనివాస్ దేవుడమ్మ ఇంటికి వచ్చాడు. సోమవారం ఉదయం దేవుడమ్మ ఇంటి ముందు మృతి చెంది ఉండటాన్ని గుర్తించి వీఆర్వో మూర్తికి సమాచారం అందించింది. దీంతో ఆయన పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ పైడి రంగనాథం సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్ అధిక మోతాదులో మద్యం సేవించడం, లేదంటే గుండె పోటుతో గాని మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడు స్వగ్రామం విజయనగరం జిల్లా జామి మండలంలోని కుమరాం గ్రామం. ప్రస్తుతం పెందుర్తిలోని ఒక సామిల్లులో పనిచేస్తున్నట్లు చెబుతున్నారు. మృతుడి కుంటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మండల అధికారులతో కలెక్టర్ సమీక్ష


వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం కచ్చితంగా అమలు చేయాలని, సమీక్షా సమావేశాలకు హాజరయ్యే అధికారులు కచ్చితమైన సమాచారంతో, పూర్తి అవగాహనతో హాజరవాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, లక్ష్యాల సాధనపై మండల స్థాయి అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్ష చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ, ఇళ్ల నిర్మాణం, నాడు-నేడు పనులు, ప్రభుత్వ భవనాల నిర్మాణం, వైద్య ఆరోగ్య శాఖ, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ తదితర శాఖల అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా నిషేధించామని, వాడకం, అమ్మకం చట్టప్రకారం నేరమన్నారు. ప్లాస్టిక్ నిషేధ చట్టం ప్రకారం వీధివ్యాపారులు వినియోగిస్తే మొదటిసారి రూ.2,500, రెండవసారి రూ.5వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అలాగే షాపులలో వినియోగిస్తే మొదటిసారి రూ.20వేలు, రెండవసారి రూ.40వేలు జరిమానా విధించి, ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణు చరణ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో 'కూత' అదరాలి

• సీఎం కప్ పోటీల్లో విజేతలై తిరిగి రావాలి
• జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
• రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వెళ్తున్న క్రీడాకారిణులకు దుస్తుల పంపిణీ


క్రీడాకారిణులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 50వ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న సీఎం ప్రైజ్ మనీ కప్ క్రీడా పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభాపాటవాలు ప్రదర్శించి విజేతలుగా నిలవాలని విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు సంబంధించి జోనల్‌స్థాయిలో విజేతలుగా నిలిచిన నెల్లిమర్ల నియోజకవర్గ బాలికల జట్టుకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన క్రీడాదుస్తులను ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను జిల్లా పరిషత్ ఛైర్మన్‌తో పాటు నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు. అనంతరం జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిభగల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న జగనన్న క్రీడా సంబరాలతో రాష్ట్ర వ్యాప్తంగా పండగ వాతావరణం నెలకొందన్నారు.

క్రీడాకారులకు సహకారం

నియోజకవర్గ, జిల్లా, జోనల్ స్థాయిలో జరిగిన కబడ్డీ పోటీల్లో నెల్లిమర్ల నియోజకవర్గం బాలికల జట్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఈనెల 21వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు హాజరు కానున్న వారు ఆ పోటీల్లో విజేతలుగా నిలిచి జిల్లా కీర్తి ప్రతిష్ఠలను చాటి చెప్పాలని ఆకాంక్షించారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్‌కౌశిక్ నేతృత్వంలో కబడ్డీ క్రీడకు తమ వంతు సహకారం, ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఎటువంటి సమస్య వచ్చినా తనతో పాటు మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, పార్లమెంటుసభ్యుడు, శాసన సభ్యులు, జిల్లా ప్రజా ప్రతినిధులు అండగా ఉంటామని, సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో నెల్లిమర్ల నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు అందవరపు సూరిబాబు, జిల్లా కమిటీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సూరిబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పతివాడ శ్రీనివాసరావు, జాయింట్ సెక్రెటరీ కనకల రమేష్, కోచ్ సూర్యారావు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎల్‌వీరమణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న జేపీఎల్ క్రికెట్ లీగ్

• విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్న ప్రజాప్రతినిధులు


క్రీడాకారులకు హెల్త్‌కార్డు పత్రాలను అందజేస్తున్న అవనాపు విక్రమ్

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అవనాపు విక్రమ్, డీసీఎంఎస్ ఛైర్మన్ అవనాపు భావనల ఆధ్వర్యంలో పది రోజులుగా నిర్వహిస్తున్న జేపీఎల్ క్రికెట్ లీగ్ పోటీలు ముగింపు దశకు చేరుకున్నాయి. మంగళవారం ఉదయం రెండు సెమీఫైనల్స్ మ్యాచ్‌ల నిర్వహణ అనంతరం మధ్యాహ్నం ఫైనల్స్ నిర్వహిస్తామని అవనాపు విక్రమ్ తెలిపారు. మంగళవారం జరిగే సెమీఫైనల్స్‌కు పవర్ థండర్స్, బీసీ స్మాషర్స్, అంబేడ్కర్ లెవెన్స్, ఫూల్‌బాగ్ పైరేట్స్ జట్లు అర్హత సాధించాయి. సెమీస్‌లో ఇన్నింగ్స్‌కు 10 ఓవర్లుగా నిర్ణయించగా, ఫైనల్స్‌కు 12 ఓవర్లు అవకాశం కల్పించారు. టోర్నీలో విజేతలకు సాయంత్రం 4 గంటలకు జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు డాక్టర్ సురేష్ బాబు, వరుదు కల్యాణి, కలెక్టర్ సూర్యకుమారి, జేసీ మయూర్ అశోక్ తదితరులు బహుమతి ప్రదానోత్సవం చేయనున్నట్లు తెలిపారు. టోర్నీలో విజేతగా నిలిచిన క్రీడాకారులకు రూ.50వేలు, ద్వితీయస్థానం చేజిక్కించుకున్న విజేతలకు రూ. 25వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. అదేవిధంగా టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులకు, వారి కుటుంబ సభ్యులకు నగరానికి చెందిన ఎస్‌ఆర్‌ఐ ఆస్పత్రి ద్వారా హెల్త్ కార్డులు మంజూరుచేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు హెల్త్‌కార్డులకు సంబంధించిన దరఖాస్తు పత్రాలను సోమవారం క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు, అభిమానులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు పైడితల్లి అమ్మవారి చండీయాగం

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి చండీయాగం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ కిశోర్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మూడు లాంతర్లు వద్దనున్న చదురుగుడి ఆవరణలో యాగం నిర్వహిస్తామని భక్తులందరూ హాజరై అమ్మవారిని దర్శించి, యాగంలో పాల్గొని, తరించాలని కోరారు.

ల్యాబ్‌టెక్నీషియన్‌కు షోకాజ్ నోటీస్ జారీ

విజయనగరం ఫోర్ట్: ఎస్.కోట ప్రాంతీయ ఆస్పత్రిలోని ఐసీటీసల ల్యాబొరేటరీలో ల్యాబ్‌టెక్నీషియన్‌గా పనిచేస్తున్న జి.సత్యహరికి జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ రామేశ్వరి ప్రభు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. హెచ్‌ఐవీ లేని గర్భిణికి హెచ్‌ఐవీ ఉందని రిపోర్టు ఇచ్చారనే అభియోగంపై ఆయనకు నోటీస్ ఇచ్చారు. నోటీస్ ఇచ్చిన రెండు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. ల్యాబ్‌టెక్నీషియన్ ఇచ్చిన సంజాయిషీని పరిశీలించి తదుపరి చర్యల కోసం కలెక్టర్‌కు నివేదిస్తామని రామేశ్వరి ప్రభు స్పష్టం చేశారు.

23న వైద్యుల పోస్టులకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ

విజయనగరం ఫోర్ట్: వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఖాళీగా ఉన్న వైద్యాధికారి పోస్టులకు ఈనెల 23న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్వీ రమణ కుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యుపీహెచ్‌సీలో-1, టెలి హబ్‌లో-2, ఎస్‌ఆర్‌సీలో -1, ఎన్‌టీసీయూలో-4, ఆర్‌బీఎస్‌కేలో-1 వైద్యాధికారి పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఎంబీబీఎస్ ఉత్తీర్ణత పాటు ఏపీ మెడికల్ కౌన్సిల్ నందు రిజిస్టార్ చేయించుకున్న అభ్యర్థులు వైద్యాధికారి పోస్టులకు అర్హులని పేర్కొన్నారు.

ముద్దాయికి ఏడేళ్ల జైలుశిక్ష

భోగాపురం: మండలంలోని ముక్కాం గ్రామంలో 2018లో హత్యకు పాల్పడిన అదే గ్రామానికి చెందిన ముద్దాయి కారిసతీష్‌కు రూ.10వేల జరిమానాతో పాటు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ 4వ ఏడీజీ మెజిస్ట్రేట్ ఎస్‌కే సికిందర్ బాషా తీర్పు వెలువరించినట్లు ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లా భీమిలి మండలం అన్నవరం గ్రామానికి చెందిన మూగి నూకరాజు 2018 మార్చి 18న ముక్కాం గ్రామానికి పండగ నిమిత్తం వచ్చాడని చెప్పారు. దీంతో పాత కక్షలను దృష్టిలో ఉంచుకున్న ముక్కాం గ్రామానికి చెందిన కారి సతీష్ నూకరాజుపై కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రగాయాల పాలైన నూకరాజు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. దీనిపై అప్పట్లో మృతుడి తండ్రి మూగి సూరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ కేసు విచారణ అనంతరం 4వ ఏడీజీ మెజిస్ట్రేట్ ఎస్‌కె సికిందర్ బాషా పై విధంగా తీర్పు వెలువరించినట్లు ఎస్సై వివరించారు.

గడ్డిమందుతాగి వ్యక్తి ఆత్మహత్య


పోలిరాజు మృతదేహం

బొబ్బిలి రూరల్: మండలంలోని రాముడువలస గ్రామానికి చెందిన యలమంచిలి పోలిరాజు(35) గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. పోలిరాజు కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యం తాగే అలవాటు ఉన్న పోలిరాజును భార్య మందలించడంతో మనస్తాపం చెంది ఆదివారం రాత్రి గడ్డిమందు తాగేసి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. విషయం గమనించిన పోలిరాజు పెద్దకుమారుడు కుటుంబసభ్యులకు తెలియజేయడంతో బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తీసుకువెళ్లగా అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. . మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు మణికంఠ, లవకుమార్ ఉన్నారు. ఏఎస్సై భాస్కరరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24కి. 10గ్రా.)	54,490-00
బంగారం(22కి. 10గ్రా.)	49,950-00
వెండి (కిలో)	73,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹ 240

క్రీడలతో ఉజ్వల భవిత

● ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, సూరిబాబు తదితరులు

పూసపాటిరేగ: క్రీడల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 50వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో సోమవారం వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి 18 జట్లు టోర్నీలో పాల్గొన్నాయి. భోగాపురం-బి జట్టు విజేతగా నిలవగా.. ద్వితీయస్థానంలో భోగాపురం-ఏ జట్టు నిలిచింది. కార్యక్రమంలో పూసపాటిరేగ, డెంకాడ ఎంపీపీలు మహంతి కల్యాణి, బంటుపల్లి వాసుదేవరావు, ఎంపీడీఓ జి.రామారావు, తహసీల్దార్ ఇ.భాస్కరరావు, వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, చిట్టి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం..

పూసపాటిరేగ: రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు అన్నారు. మండలంలోని కొప్పెర్ల రైతుభరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం వారు లాంఛనంగా ప్రారంభించారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

ముందుగా కొప్పెర్ల పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రైతులకు గిట్టుబాటు ధర చెల్లించి ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తోందన్నారు. రైతులు దళారులకు ధాన్యం విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. పారదర్శకంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరుగుతోందన్నారు. సాధారణ రకం క్వింటాకు రూ.2040, ఎ-గ్రేడ్ రకం రూ.2060లుగా ప్రభుత్వం ధర నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం పుట్టినరోజు వేడుకలకు భారీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 50వ పుట్టినరోజును పురస్కరించుకుని ఈనెల 21న నియోజకవర్గంలో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సంగంరెడ్డి బంగారునాయుడు తెలిపారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 21న ఉదయం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేరున ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో పేదలకు దుస్తుల పంపిణీ, రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ, ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో మండల పరిషత్ అధ్యక్షుడు మామిడి అప్పలనాయుడు, జోనల్ ఇన్‌చార్జ్‌లు ఎస్‌వీవీ రాజేష్, ముద్దాడ మధు, బొద్దాన అప్పారావు, ఈశ్వర్ కౌశిక్, అల్లు చాణిక్య, ఎవర్న కుమారస్వామి, కాళ్ల సూరిబాబు, రెడ్డి గురుమూర్తి, జీవి రంగారావు, లెంక నరేష్ తదితరులు ఉన్నారు.

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంపీపీ అంబళ్ల సుధారాణి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. సతివాడలో మంగళవారం ఉదయం 10 గంటలకు మొక్కలు నాటే కార్యక్రమంతో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. 21న రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో సీఎం జగన్ పేరిట ప్రత్యేక పూజలు చేపడతామన్నారు. అనంతరం స్థానిక సచివాలయంలో కేక్ కటింగ్ ఉంటుదన్నారు. వేడుకల్లో అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్‌ల అధ్యక్షులు, నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కార్నియా సేకరణ

విజయనగరం ఫోర్ట్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఐ-బ్యాంక్ ప్రతినిధులు నేత్రదానం చేసిన వృద్ధురాలి కార్నియాను సేకరించారు. పట్టణంలోని కొత్త ఆగ్రహారంలో నివాసముంటున్న పి.విజయలక్ష్మి సోమవారం మృతి చెందింది. ఆమె గతంలో నేత్రదానం చేసేందుకు అంగీకరించడంతో.. ఆమె కుమారుడు గున్నాయి శెట్టి రెడ్‌క్రాస్ ఐ-బ్యాంక్‌కు సమాచారం అందించాడు. ఐ బ్యాంక్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్ శ్రీను, సహాయకుడు శంకరరావు అక్కడకు చేరుకుని వృద్ధురాలి నేత్రాల నుంచి కార్నియాను సేకరించి భద్రపరిచారు. వాటిని కంటి చూపులేనివారికి పెట్టడం ద్వారా చూపు వచ్చేలా చేయవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ నేత్రదానం చేసేందుకు ముందుకురావాలని, ఆసక్తి ఉన్నవారు 9848608101న ఫోన్ చేయాలని రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రసాద్‌రావు కోరారు.

24న జెడ్పీ బడ్జెట్ సమావేశం

విజయనగరం గంటస్తంభం: జిల్లా పరిషత్ బడ్జెట్ సమావేశం డిసెంబరు 24న నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ ఎం.అశోక్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. 2023-24 అంచనా బడ్జెట్, 2022-23 సవరణ బడ్జెట్‌పై ఆమోదం కోసం సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. అదేరోజు 1వ స్థాయీ సంఘం సమావేశం కూడా జరుగుతుందన్నారు. సభ్యులంతా సమావేశానికి తప్పకుండా హాజరు కావాలని కోరారు.

ఎంఈడీ క్వాలిఫైడ్ నిరుద్యోగుల ధర్నా

విజయనగరం అర్బన్: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న ఎంఈడీ క్వాలిఫైడ్ నిరుద్యోగ అభ్యర్థుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఎంఈడీ నిరుద్యోగ అభ్యర్థుల అసోసియేషన్ విజయనగరం జిల్లా శాఖ సోమవారం ధర్నా చేపట్టింది. ఈ సందర్భంగా పలువురు నిరుద్యోగులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10 వేల మంది ఎంఈడీ పూర్తిచేసి నిరుద్యోగులుగా ఉన్నారన్నారు. 20 ఏళ్లుగా ప్రైవేట్ కాలేజీల్లో వేలాది మందికి శిక్షణ ఇచ్చి ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దిన తమ సేవలను నూతన విద్యా విధానంలో భాగంగా ప్రభుత్వం వినియోగించుకోవాలని కోరారు. ఏటా రేటిఫికేషన్ జరిగేలా చర్యలు చేపట్టాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ నియామకాల్లో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ఎ.సూర్యకుమారికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.త్రినాథరావు, ప్రధాన కార్యదర్శి ఎస్.వి.సత్యనారాయణ, ప్రతినిధులు బెల్లాపు సత్యనారాయణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుప్పావై వ్రత మహత్యాన్ని తెలుసుకోవాలి



డాక్టర్ స్వప్న హైందవి

విజయనగరం టౌన్: ధనుర్మాసంలో ప్రతి ఒక్కరూ తిరుప్పావై వ్రత మహత్యాన్ని తెలుసుకొని ఆచరించాలని రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి అన్నారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో టీటీడీ భక్తభజన మండలి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆమె పాల్గొని తిరుప్పావై వ్రత మహత్యాన్ని వివరించారు. గోదాదేవీ అమ్మవారు ధనుర్మాసంలో ఈ వ్రతాన్ని ఆచరించిందన్నారు. మోక్షాన్ని కోరుకునే ప్రతి ఒక్కరూ ఈ వ్రతాన్ని ఆచరించాలని అన్నారు. 30 పాశురాలలో భగవంతున్ని ధ్యానించి, కీర్తించారన్నారు. అనంతరం భజన మండలి సభ్యులు ఆమెను ఘనంగా సత్కరించారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ

విజయనగరం గంటస్తంభం: జిల్లా పరిషత్ కార్యాలయంలో సోమవారం దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గరివిడి మండలం వెదుల్లవలస, ఏనుగువలసకు చెందిన దివ్యాంగులకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. ఇన్నాళ్లూ ట్రైసైకిళ్లు లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడేవాళ్లమని, ప్రభుత్వం తమ ఇబ్బందులను అర్థం చేసుకుని ట్రైసైకిళ్లను ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని దివ్యాంగులు అన్నారు.



ట్రైసైకిల్ పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ వేడుకలు రేపు

విజయనగరం పూల్‌బాగ్: నగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలో ఉన్న సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి టి.చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ మైనారిటీలకు బుధవారం 6 గంటలు హైటీని ఏర్పాటు చేశామన్నారు. జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టరు సూర్యకుమారి, క్రైస్తవ మత పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు.

చేనేత రంగానికి ప్రభుత్వం చేయూత

● డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేత రంగానికి ఎంతో ప్రాధాన్యతనిస్తున్నారని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. పట్టణంలోని లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కళాదర్శిని చేనేత హస్తకళ మేళను సోమవారం సాయంత్రం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రావణి మాట్లాడుతూ..పట్టణ ప్రజలకు అందుబాటు ధరలో చేనేత వస్త్రాలు, వస్తువులు ఒకే చోట లభించేలా హస్తకళా ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. చేనేత కార్మికులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటూ ఏటా ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి నేత కార్మికులను ప్రోత్సహించాలని కోరారు. జనవరి 13 వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు రంగరాజు తెలిపారు. అతి తక్కువ ధరకే పోచంపల్లి, మంగళగిరి, వెంకటగిరి, ఉప్పాడ చేనేత వస్త్రాలతో పాటు పలు హస్తకళా వస్తువులు విక్రయిస్తున్నామన్నారు.

కానిస్టేబుళ్ల ఉద్యోగ రాత పరీక్షకు ఉచిత శిక్షణ

గజపతినగరం: త్వరలో పోలీస్ కానిస్టేబుళ్ల నియామకాల కోసం నిర్వహించనున్న పరీక్షలకు సిద్ధమవుతున్న గజపతినగరం సర్కిల్ పరిధిలోని అభ్యర్థుల కోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. సాయిసిద్ధార్థ డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని స్థానిక సీఐ ఎల్.అప్పలనాయుడు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుమారు నెల రోజుల పాటు ఈశిక్షణ ఉంటుందని, అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. మానాపురం, బొండపల్లి, బూర్జివలస ఎస్ఐలు భాగ్యం, రవి, రాజేష్‌తో పాటు అబ్దుల్ కలాం సేవాసమితి అధ్యక్షుడు పైడినాయుడు, సాయిసిద్ధార్థ కళాశాల, హర్షవర్ధన స్కూల్ కరస్పాండెంట్స్ ఎస్.శేఖర్‌బాబు, ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

శ్రీక్షేత్రంలో సుదర్శన హోమం



సుదర్శనహోమం చేస్తున్న అర్చకులు

విజయనగరం పూల్‌బాగ్: ప్రపంచ శాంతిని కోరుతూ ప్రముఖ భారతీయ తత్వదర్శన కేంద్రం శ్రీ క్షేత్రంలో కొలువైన అష్టలక్ష్మీ ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం ఉదయం సుదర్శన హోమం జరిగింది. చిత్త నక్షత్రాన్ని పురస్కరించుకుని అర్చకులు చామర్తి శ్రీనివాసరమేష్ ఆచార్యులు, చామర్తి రమేష్ ఆచార్యులు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా సుదర్శన హోమం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, నీరజ మన్నే, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాహనాల వేలానికి చర్యలు



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ రమణకుమారి

విజయనగరం ఫోర్ట్: వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో కాలపరిమితి దాటిన 21 వాహనాలను ఈ-కొనుగోలు పోర్టల్ ద్వారా వేలం వేసేందుకు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో కమిటీ సభ్యులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. గుర్తింపు పొందిన పాటదారులు వేలంలో పాల్గొనవచ్చన్నారు. సమావేశంలో సర్వీసు ఇంజినీర్ కె.ఎస్.ఎస్.బాలాజీ, విశాఖపట్నం ఏటీఓ డి.సురేష్, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ బి.అప్పలనాయుడు, వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.రవిశంకర్ ప్రసాద్ పాల్గొన్నారు.

పెన్షనర్ల నిరసన



నిరసన తెలియజేస్తున్న పెన్షనర్లు

విజయనగరం టౌన్: ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక టెలిఫోన్ భవన్ ఆవరణంలో సోమవారం పింఛనుదారులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్.రామశేఖర్ మాట్లాడుతూ ఏడో వేతన సవరణ ప్రకారం ఫిట్‌మెంట్, ఐడీఏ పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2017 జనవరి 1కి ముందు, తర్వాత రిటైర్డ్ అయిన వారందరికీ పేస్కేల్ వర్తించేలా పెన్షన్ రివిజన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సర్కిల్ కార్యదర్శి డి.సుబ్బారావు, పింఛనుదారులు పాల్గొన్నారు.

నేడు మంత్రి బొత్స జిల్లాకు రాక

విజయనగరం అర్బన్: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మంగళవారం నగరానికి వస్తున్నారు. ఉదయం 7 గంటలకు నగరంలోని తన నివాసానికి చేరుకుంటారు. స్థానిక కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం మధ్యాహ్నం 3.30 గంటలకు బయలుదేరి విశాఖ మీదుగా సాయంత్రం విజయవాడ చేరుకుంటారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌గా శశిభార్గవి



విజయనగరం ఫోర్ట్: విజయనగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) పాలకవర్గాన్ని ప్రభుత్వం నియమించింది. గౌరవ చైర్మన్‌గా కోలగట్ల వీరభద్రస్వామి, చైర్‌పర్సన్‌గా నడిపేన విశ్వవీర శశిభార్గవి, వైస్ చైర్మన్‌గా రెడ్డి గురుమూర్తి నియమితులయ్యారు. వీరితో పాటు మరో 19 మంది సభ్యులతో నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరంతా ఏడాది పాటు పదవిలో ఉంటారు.

ధాన్యం కొనుగోలు పరిశీలన



ధాన్యం తరలిస్తున్న ట్రాక్టర్ వద్ద ఏడీఏ నాగభూషణం, సిబ్బంది

డెంకాడ: మండలంలోని పినతాడివాడ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని విజయనగరం ఏడీఏ ఎ.నాగభూషణం సోమవారం సందర్శించారు. కేంద్రంలో చేపడుతున్న ధాన్యం కొనుగోలు, తరలింపు ప్రక్రియను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఏఓ పూడి నిర్మల, పంచాయతీ కార్యదర్శి జగదీశ్వరరావు ఉన్నారు.

పినతాడివాడలో పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్, కార్యదర్శి

డెంకాడ: మండలంలోని పినతాడివాడలో సోమవారం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. పారిశుద్ధ్య కార్మికులు గ్రామంలోని కాలువల్లో పూడికలను తొలగించారు. సర్పంచ్ లెంక లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శి జగదీశ్వరరావు పనులను పర్యవేక్షించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని గ్రామస్తులను కోరారు.

కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి



నిరసన తెలియజేస్తున్న పంచాయతీ కార్మికులు

భోగాపురం: గ్రీన్ అంబాసిడర్లు, పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలుతో పాటు చట్టపరమైన హక్కులను కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ, ఆళ్ల వాసుబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కార్మికులతో కలిసి సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టపరమైన హక్కులు అమలు చేయాలని, బ్యాంకుల ద్వారా జీతాలు చెల్లించాలని, పని భారం పెరిగినందున కార్మికుల సంఖ్యను పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు రాచర్ల రమణ, పచ్చిపాల అప్పన్న, బి.పైడిరాజు, రాము, కె.రాజు, ఊడికల ముసలయ్య, గుర్ల చంద్రప్పడు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ఆందోళన దూరం



సొసైటీ రాష్ట్ర ప్రతినిధి రాఘవరావును సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

విజయనగరం టౌన్: ధాన్యం ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ రాష్ట్ర ప్రతినిధి బ్రహ్మర్షి రాఘవరావు అన్నారు. పట్టణంలోని దాసన్నపేటలో నూతనంగా నిర్మించిన పిరమిడ్ ధ్యాన మందిరాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాఘవరావు మాట్లాడుతూ.. ప్రతిరోజు ధ్యానం చేయడం ద్వారా మానసిక ఆందోళన, శారీరక రుగ్మతలు తొలగిపోయి ప్రశాంతమైన జీవితాన్ని ఆస్వాధించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ధ్యానాన్ని తమ దైనందిత జీవన విధానంలో ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు. అనంతరం నిర్వాహకులు రాఘవరావును దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పిరమిడ్ సొసైటీ ప్రచార కన్వీనర్ వి.కృష్ణంరాజు, జిల్లా అధ్యక్షుడు జె.రామారావు, పిరమిడ్ హోమ్ నిర్మాణ కర్త ఎ.సత్యవతి, సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీలో పాలన దేశానికే ఆదర్శం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, సూరిబాబు తదితరులు

పూసపాటిరేగ: సంక్షేమ పాలనలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు అన్నారు. కొప్పెర్లలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మూడున్నరేళ్లలో ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం రూ.1.79 లక్షల కోట్లు ఖర్చు చేసిందన్నారు. రాష్ట్రంలోని ప్రతీ ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ నెల 26లోగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి సచివాలయానికి ఇద్దరు కన్వీనర్లు, ఒక మహిళా కన్వీనర్‌ను నియమించాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి పార్టీ విజయానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీలు మహంతి కల్యాణి, బి.వాసుదేవరావు, వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎస్.సత్యనారాయణరాజు, తదితరులు పాల్గొన్నారు.

బధిర క్రీడాకారులకు కలెక్టర్ అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: ఇటీవల జరిగిన ఐదో స్పోర్ట్స్ అథారిటీ సీనియర్ బధిరుల చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొని పతకాలు సాధించిన బధిర క్రీడాకారులను జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి సోమవారం అభినందించారు. ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు ఏలూరు వేదికగా జరిగిన క్రీడా పోటీల్లో జిల్లాకు చెందిన బధిర క్రీడాకారులు పాల్గొని ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సొంతం చేసుకున్నారని విభిన్న ప్రతిభావంతుల విభాగం సహాయ సంచాలకులు తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందిస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల జిల్లా కో-ఆర్డినేటర్ బి.చంద్రావతి రూ.3 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

విష్ణు సహస్రనామపారాయణం పోటీలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శ్యామ్‌సుందర్ తదితరులు

విజయనగరం టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి ఒకటో తేదీన ఉదయం 10 గంటలకు టీటీడీ కల్యాణ మంటపం ఆవరణలో విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ పోటీలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ ప్రోగ్రామింగ్ కన్వీనర్ జె.శ్యామ్‌సుందర్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ 10 నుంచి 15 ఏళ్ల లోపు విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహిస్తామని పదేళ్ల లోపు విద్యార్థులకు శ్రీ అచ్యుతాష్టకంలోని తొమ్మిది శ్లోకాలపై పోటీలు ఉంటాయన్నారు. పాల్గొనదలచిన విద్యార్థులు ఫోన్ 9441461076 నంబర్‌ను కానీ నేరుగా టీటీడీ కల్యాణ మంటపంలో ఉన్న కార్యాలయంలో కానీ పనివేళల్లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అర్చకులు పీవీ నరసింహాచార్యులు, జి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

యేసు ప్రేమాలయం క్యాలెండర్ ఆవిష్కరణ



గ్రాండ్ క్రిస్మస్ వేడుకల్లో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నగర మేయర్ విజయలక్ష్మి

విజయనగరం టౌన్: యేసు ప్రేమాలయం ఆధ్వర్యంలో 2013 క్యాలెండర్ ఆవిష్కరణ ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. గ్రాండ్ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా కాటవీధి పార్కు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో నగర మేయర్ వెంపటాపు విజయలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. యేసుప్రేమాలయం పాస్టర్ అలజంగి రవికుమార్, సువర్ణలు దైవసందేశాన్ని అందజేశారు. పాస్టర్ ఐజక్‌బాబు, నిర్మల, నాగేశ్వరరావులు బైబిల్ పఠనం చేశారు. క్వయర్ టీమ్ ఆలపించిన క్రిస్మస్ గీతాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విక్టర్ బాబు, దేవరాజు, సూర్యనారాయణ, జాన్ తదితరులు పాల్గొన్నారు.

కామన్వెల్త్ విజేతకు ఘన సత్కారం



అనిల్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ చలంనాయుడు, వివిధ శాఖల అధికారులు

బొండపల్లి: న్యూజిలాండ్ దేశంలో ఇటీవల జరిగిన కామన్వెల్త్ క్రీడల్లో పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నాలుగు బంగారు పతకాలు సాధించిన చామలవలస గ్రామానికి చెందిన క్రీడాకారుడు బోదంకి అనిల్‌కుమార్‌ను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చల్ల చలంనాయుడు, తహసీల్దార్ శ్రీనివాస్‌మిశ్రా, ఎంపీడీఓ ఎ.వేదవతి, మండలనాయకులు సోమవారం సత్కరించారు. క్రీడల్లో మరిన్ని విజయాలు సాధించి మండలానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ముద్దూరు సర్పంచ్ మునకాల పైడిపునాయుడు, రాచకిండాం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ జి.సతీష్, బొండపల్లి ఎంపీటీసీ సభ్యుడు బండారు శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ కోళ్ల వెంకటరమణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.



● యాసిడ్ దాడి బాధితురాలు లలితతో డాక్టర్ ప్రతిభా నైతాని

యాసిడ్ సమాజానికి సర్జరీ

పిల్లలను దృష్టిలో పెట్టుకొని టీవీ కార్యక్రమాల్లో అసభ్యత, హింస చూపడాన్ని వ్యతిరేకించడంలో పేరొందారు ముంబై వాసి డాక్టర్ ప్రతిభా నైతాని. యాసిడ్ దాడి బాధితులకు ఉచితంగా కాస్మెటిక్ వైద్యం అందించడంతో పాటు, వారికి తగిన న్యాయం జరగాలంటూ ఆయా మంత్రిత్వ శాఖల చుట్టూ తిరుగుతూ, దోషులకు శిక్ష పడేలా చేశారు, చేస్తున్నారు. డాక్టర్ ప్రతిభ కష్టానికి ఫలితంగా చట్టం మారింది, దోషులకు శిక్షలు పెరిగాయి. యాసిడ్ దాడి బాధితుల జీవితాలు కాస్త తేలిక య్యాయి. అయితే, గడిచిన ఈ ఐదేళ్లలో దేశవ్యాప్తంగా వెయ్యికి పైగా యాసిడ్ దాడులు జరిగాయని గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో డాక్టర్ ప్రతిభా నైతాని ఎన్నో విషయాలను మీడియా ముందుంచారు.

‘‘పంతొమ్మిదేళ్ల క్రితం.. ప్రఖ్యాత ప్లాస్టిక్ సర్జన్ పద్మశ్రీ డాక్టర్ అశోక్ గుప్తాతో కలిసి పని చేయడం ప్రారంభించాను. డాక్టర్ అశోక్ అప్పటికే తన పనితో పాటు సామాజిక సేవ కూడా చేస్తుండే వారు. మారుమూల ప్రాంతాలకు వెళ్లి పేద, గిరిజనులకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, ఉచితంగా కాస్మెటిక్ సర్జరీలు చేస్తుండేవారు. వారి నుంచి స్ఫూర్తి పొందిన నేను, ఈ సర్జరీలలో సహాయంగా ఉండేదాన్ని. యాసిడ్ దాడి కేసులు మొదట్లో ఒకటో రెండో వచ్చేవి. తర్వాత్తర్వాత వీటి సంఖ్య పెరుగుతుండటం గమనించాను. వీరికి ఉచితంగా సర్జరీలు చేయడమొక్కటే సమస్యకు పరిష్కారం కాదనుకున్నాను. వీటిని అరికట్టేందుకు ఏదైనా చేయాలనుకున్నాను.

దోషులకు శిక్షను పెంచాలి

పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి మహిళా, శిశు సంక్షేమ శాఖ, లా కమిషన్ వరకు ప్రదక్షిణలు చేశాను. ముంబై నుంచి ఢిల్లీకి తరచూ ప్రయాణించేదాన్ని. గతంలో యాసిడ్ దాడి దోషులకు శిక్షలు చాలా తక్కువగా ఉండేవి. నిందితులకు కేవలం ఆరు నెలలు మాత్రమే బెయిలబుల్ శిక్ష ఉండేది. కానీ అమ్మాయి జీవితమంతా నరకమే. దీంతో పాటు తమకు వ్యతిరేకంగా సాక్ష్యం చెబితే మరిన్ని ఇబ్బందులు తప్పవని బాధితురాలి కుటుంబాన్ని బెదిరించేవారు. దీంతో వారికి న్యాయం జరిగేది కాదు.

కత్తి గాయం, యాసిడ్ మంట

ఈ రెండింటి మధ్య చాలా వ్యత్యాసం ఉంది. ఒకరి శరీరంపై యాసిడ్ పోయడం హత్య కంటే ఘోరమైన నేరం. ఈ విషయంలో చేసిన సుదీర్ఘ పోరాటం తర్వాత, 2013లో ఐపిసి లో 32-6A, 32-6B సెక్షన్లు చేర్చబడ్డాయి. దీని ప్రకారం, నిందితుడు దోషిగా తేలితే, ఏడేళ్ల నుండి జీవిత ఖైదు వరకు శిక్ష పడుతుంది. అపరాధి నుండి జరిమానా కూడా వసూలు చేయబడుతుంది. దీంతో బాధితురాలి కోసం ఎంతో కొంతైనా చేయగలిగామనే ధీమా వచ్చింది.

బాధితులకు పునరావాసం

‘‘యాసిడ్ దాడి బాధితులు సమాజంలో జీవించడం కష్టం. ఈ అమ్మాయిలకు పని ఇవ్వడానికి ఎవరూ ఇష్టపడరు. చాలా సందర్భాల్లో చికిత్స ఖర్చులు పెరిగి, ఇంటి నుంచి వెళ్లగొట్టడం వంటి ఘటనలు కూడా తెలిశాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆడపిల్లల భవిష్యత్తుకు భద్రత కల్పించాల్సిన అవసరం ఏర్పడింది. యాసిడ్ దాడి బాధితులను వికలాంగుల కేటగిరీలో చేర్చాలని, విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ వంటి వికలాంగుల కోటాలో వచ్చే అన్ని సౌకర్యాలు వారికి కల్పించాలని డిమాండ్ చేశాం. ఈ డిమాండ్‌ను నెరవేర్చడంలోనూ విజయం సాధించాం’’.

అడల్ట్ కంటెంట్‌కు వ్యతిరేకం

టీవీల్లో వచ్చే అసభ్యకరమైన సమాదారం పిల్లలపై చెడు ప్రభావం చూపుతుందని, వీటిని ఆపాలని చేసే పోరాటాన్ని కొన్నేళ్ల క్రితమే మొదలుపెట్టింది ప్రతిభ. ఎందుకు ఇంత రచ్చ సృష్టిస్తోందని ప్రజలు అనుకున్నారు. కాని ఈ రోజు అందరూ దాని అవసరం గుర్తిస్తున్నారు. ఈ విషయమ్మీదనే 2004లో బాంబే హైకోర్టులో పిల్ దాఖలు చేసింది ప్రతిభ.



ఉచిత వైద్య చికిత్స

‘‘యాసిడ్ దాడి బాధితులకు ప్రతి నగరంలో ఉచితంగా చికిత్స అందించాలన్నది మరో డిమాండ్. చాలా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇలాంటి కేసులకు ప్రత్యేకంగా ప్లాస్టిక్ సర్జరీ సౌకర్యం లేదు. ఏ ఆసుపత్రి అయినా, ఎక్కడ ఉన్నా ఉచితంగా ప్లాస్టిక్ సర్జరీ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశాం. ఈ మేరకు యాసిడ్ దాడి బాధితురాలు లక్ష్మీ అగర్వాల్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వారికి ఉచితంగా శస్త్ర చికిత్స సౌకర్యం కల్పించాలని సుప్రీంకోర్టు కూడా చెప్పింది.

అందుబాటులో ఉండకూడదు

బహిరంగంగా విక్రయించే యాసిడ్‌కు సంబంధించి, దాని విక్రయాలను నియంత్రించాలని డిమాండ్ చేశాం. సాధారణ దుకాణాల్లో యాసిడ్ ఉండకూడదు. ఎప్పుడు, ఎవరు కొన్నారు, దేనికి వినియోగిస్తున్నారనేదానిపై ఓ కన్నేసి ఉంచాలి. ఈ విధానం వల్ల యాసిడ్ దుర్వినియోగాన్ని నిరోధించవచ్చు.

ప్రాణాలతో పోరాటం

యాసిడ్ దాడి బాధను భరిస్తూ జీవితంలో ముందుకు సాగిన అమ్మాయిలు ఎందరో ఉన్నారు. అలాంటి అమ్మాయిలలో లలిత ఒకరు. దాడి జరిగి, తీసుకువచ్చినప్పుడు, ఆమె గాయాల వాసనకు, జనం క్లినిక్ నుంచి బయటకు వెళ్లిపోయారు. అనేక శస్త్రచికిత్సల తర్వాత కోలుకుంది. ఇప్పుడు సాధారణ జీవితం గడుపుతోంది. పెళ్లి చేసుకొని, ఒక బిడ్డకు తల్లి అయ్యింది. ఏ అమ్మాయీ యాసిడ్ బారిన పడకుండా అందరూ ఆనందంగా జీవించాలి’ అనే ఆకాంక్షను వ్యక్తం చేస్తోంది వైద్యురాలు.

విజయపథం

చిన్నవయసులోనే డిప్రెషన్ బారిన పడిన షర్మిన్ తల్లిదండ్రుల సహాయంతో ఆ చీకటి నుంచి బయటపడింది. ‘ఆట-మాట-పాట’లలో తన ప్రతిభ చూపింది. సృజనాత్మకతకు మెరుగులు దిద్దే ఏఐ-ఆధారిత ప్లాట్‌ఫామ్ ‘ఇన్‌స్టోరీడ్’తో ఇన్‌స్పైరింగ్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా పేరు తెచ్చుకుంది.

చీకటిపై రణం చేసిన... గెలుపు వ్యాకరణం



● షర్మిన్

‘కస్టమర్స్ కొనుగోలు నిర్ణయాలు లాజిక్ మీద కాదు ఎమోషన్స్‌పై ఆధారపడి ఉంటాయి’ అనే సూత్రాన్ని ఆధారం చేసుకొని ఏఐ-ఆధారిత ప్లాట్‌ఫామ్ ‘ఇన్‌స్టోరీడ్’ను ప్రారంభించింది షర్మిన్ అలి. ఈ ప్లాట్‌ఫామ్ సోలోప్రెన్యూర్స్, ఫ్రీలాన్సర్స్, కంటెంట్ క్రియేటర్స్, క్లయింట్స్ కోసం కంటెంట్ క్రియేట్ చేసే ఏజెన్సీలకు బాగా ఉపయోగపడుతుంది.

‘కంటెంట్ రైటర్స్ కస్టమర్ మనసులోకి పరకాయప్రవేశం చేసినప్పుడే లక్ష్యం నెరవేరుతుంది’ అంటున్న షర్మిన్ ‘ఇన్‌స్టోరీడ్’ ప్రారంభించడానికి ముందు ఎంతోమంది న్యూరో మార్కెటర్స్, న్యూరో సైంటిస్టులతో మాట్లాడి ఎన్నో విషయాలు తెలుసుకుంది. ఏఐ పవర్డ్ టూల్‌ను రూపొందించడానికి పద్దెనిమిది నెలల కాలం పట్టింది.ఇంతకీ ఈ టూల్ చేసే పని ఏమిటి?

మనం ఏదైనా కంటెంట్ క్రియేట్ చేసినప్పుడు, మన కంటెంట్ మనకు బాగానే ఉంటుంది. ‘నిజంగా ఈ కంటెంట్ బాగుందా? మార్పు, చేర్పులు ఏమైనా చేయాలా?’ అనే సందేహం వచ్చినప్పుడు ఈ టూల్‌కు పనిచెప్పవచ్చు.

‘ఈ వాక్యం సరిగ్గా లేదు’ ‘ఈ పదానికి బదులు మరో పదం వాడితే బాగుంటుందేమో’ ‘ఇలాంటి హెడ్‌లైన్స్ చాలా వచ్చాయి. వేరే హెడ్‌లైన్స్‌కు ప్రయత్నించండి’ ‘టు మెనీ నెగెటివ్ వర్డ్స్. మీ భావం సరిగ్గా చేరడం లేదు’ ‘ఇందులో భాషా దోషాలు కనిపిస్తున్నాయి’.....ఇలాంటి సలహాలు ఎన్నో ఇస్తుంది ఈ ఏఐ టూల్.

కొన్నిసార్లు అనుకోకుండా మనం రాసిన వాక్యం, ఎవరో రాసిన వాక్యంలా ఉండి కాపీ కొట్టారు అనే ముద్ర పడడానికి అవకాశం ఉండవచ్చు. ఇలాంటి సందర్భాల్లో కూడా ‘ఇన్‌స్టోరీడ్’ టూల్ హెచ్చరించి వేరే వాక్యాలు రాసుకునేలా చేస్తుంది.

‘చాలామంది నన్ను అడిగే ప్రశ్న...మీ ప్లాట్‌ఫామ్ ద్వారా కాపీరైటర్స్ అవసరం లేకుండా చేయవచ్చా? అది అసాధ్యం అని చెబుతాను. మానవసృజనకు ప్రత్యామ్నాయం లేదు. మా ప్లాట్‌ఫామ్ సృజనకు మెరుగులు పెట్టి మరింత చక్కగా తీర్చిదిద్దేలా చేస్తుంది’ అంటోంది షర్మిన్.

షర్మిన్ ‘ఇన్‌స్టోరీడ్’కు శ్రీకారం చుట్టినప్పుడు ‘ఇది సక్సెస్ అవుతుందా?’ అనే సందేహాలు వెల్లువెత్తాయి. అయితే తన ప్రాజెక్ట్ మీద ఎప్పుడూ నమ్మకం కోల్పోలేదు షర్మిన్. ఆమె నమ్మకం నిజమైంది. బెంగళూరు కేంద్రంగా మొదలుపెట్టిన ‘ఇన్‌స్టోరీడ్’కు వేలాది మంది యూజర్స్ ఉన్నారు. ‘ఇన్‌స్టోరీడ్’కు ముందు అమెరికాలో డాటాసైన్స్, ఎనలటిక్స్ రంగాలలో పనిచేసింది షర్మిన్ పశ్చిమబెంగాల్‌లోని కూచ్ బెహార్‌లో పుట్టిన షర్మిన్ అహ్మదాబాద్‌లో పెరిగింది. ‘ఆడుతూ పాడుతూ పెరిగినదే అందమైన బాల్యం’ అంటుంటారు. అయితే షర్మిన్ మాత్రం చిన్న వయసులోనే డిప్రెషన్ బారిన పడింది. భూకంపం, వరదలు, మతకలహాలు....మొదలైన వాటి ప్రభావంతో కుంగుబాటు అనే చీకట్లోకి వెళ్లిపోయింది. రకరకాల ప్రయత్నాలు చేసి ఆ చీకటి నుంచి షర్మిన్‌ను బయటికి తీసుకువచ్చారు తల్లిదండ్రులు.

అది మొదలు...ఆటలు, పాటలు, నృత్యాలలో చురుగ్గా పాల్గొనేది. ఇంజనీరింగ్ ఫైనలియర్‌లో ఉన్నప్పుడు ‘ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్’ ఎలక్టివ్‌గా తీసుకుంది. ఇక అప్పటి నుంచి ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారాలనేది తన కలగా మారింది. ‘ఇన్‌స్టోరీడ్’తో సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా గెలుపు జెండా ఎగరేసింది. ఎంటర్‌ప్రెన్యూర్‌గానే కాదు నటి, రచయిత్రి, మోటివేషనల్ స్పీకర్‌గా మంచి పేరు తెచ్చుకుంది షర్మిన్ అలి.

ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com







ఎమ్. భారతి
అనంతపురం

25 చుక్కలు
5 వరుసలు
5 వచ్చే వరకు



19
చుక్కలు
మధ్య చుక్క
11 వచ్చే వరకు



రావిరాల విజయలక్ష్మి
దేవరకొండ, నల్లగొండ జిల్లా

సాగుబడి

మూల కార్తె : డిసెంబర్ 16 నుంచి



తర్లువాడలో తన మామిడి తోటలో రైతు శాస్త్రవేత్త కొంగర రమేష్

సేద్య తపస్వి!

ఆయనకు 67 ఏళ్లు. తలపండిన రైతు, అంతకుమించిన శాస్త్రవేత్త. చదివింది 8వ తరగతే. అయినా.. జ్ఞాన సంపన్నుడు. పురుగులను అరికట్టే బవేరియా బాసియానా అనే శిలీంద్రాన్ని 44 ఏళ్ల క్రితం ఆయన గుర్తించే నాటికి దాని గురించి శాస్త్రవేత్తలకే తెలీదు. అప్పటి నుంచి జీవన పురుగుమందు(బయో పెస్టిసైడ్)లను సొంతంగా తయారు చేసుకొని మిరప, పత్తి, మామిడి తదితర పంటలపై వాడుతున్నారు. అనేక సరికొత్త వంగడాలను అభివృద్ధి చేశారు. దేశ విదేశీ యూనివర్సిటీలతో కలసి సుదీర్ఘకాలంగా పరిశోధనలు చేస్తున్నారు. అంతర్జాతీయ జర్నల్స్‌లో శాస్త్రజ్ఞులతో కలిసి 3 పరిశోధనా వ్యాసాలు ప్రచురించిన ఘనాపాటి ఆయన. ప్రకృతి వ్యవసాయానికి బయో పెస్టిసైడ్స్ ఎంతో అవసరమంటున్న విలక్షణ రైతు శాస్త్రవేత్త కొంగర రమేష్‌పై ప్రత్యేక కథనం.

స్వీయ అనుభవ జ్ఞానంతో వ్యవసాయ రంగంలో అద్భుత ఆవిష్కరణలు వెలువరిస్తున్న తపస్వి కొంగర రమేష్. వ్యవసాయ కుటుంబంలో ఆయన పుట్టి పెరిగింది గుంటూరు జిల్లా కాకుమాను గ్రామంలో. రైతు శాస్త్రవేత్తగా పరిశోధనలు చేస్తున్నది విశాఖ జిల్లా ఆనందాపురం మండలం తర్లువాడలో. సొంతంగా తయారు చేసుకున్న జీవన పురుగుమందులతో మిరప, పత్తి, మామిడి వంటి పంటలను సాగు చేయటంతో పాటు.. అనేక విశిష్టమైన వంగడాలకు రూపుకల్పన చేసి భళా అనిపించుకుంటున్నారు.

ఎంతకాలమైనా నిల్వ ఉండే, అత్యంత తీపి, సువాసన కలిగిన మామిడి వంగడాలు.. విలక్షణమైన మిరప వంగడం.. ఆవులకు ప్రాణాంతకమైన బ్రూసిలోసిస్ వ్యాధిని హోమియో వైద్యంతో తగ్గించడం.. ఇవీ రైతు శాస్త్రవేత్తగా రమేష్ సాధించిన కొన్ని విజయాలు. బయో పెస్టిసైడ్స్‌పై ఆయన సుదీర్ఘకాలంగా చేస్తున్న పరిశోధనల గాథ ఆసక్తిదాయకం..

‘బవేరియా’ అప్పటికి ఎవరికీ తెలీదు

సొంత పొలంలో పత్తి తదితర పంటల ఆకులు తినే పురుగుల్ని చంపుతున్న బవేరియా బాసియానా అనే శిలీంద్రాన్ని 1978లో 22 ఏళ్ల యువ రైతుగా రమేష్ తొలుత గుర్తించారు. 1977లో దివిసీమ ఉప్పెన కారణంగా కోస్తా ఆంధ్ర తీరప్రాంతంలో లెక్కలేనన్ని పక్షులు మత్యువాత పడ్డాయి. పురుగులను తినే పక్షులు లేనందున వాటి సంఖ్య ఉధృతంగా పెరిగిపోయింది. ఒక పొలం నుంచి మరో పొలంలోనికి పురుగుల మంద గొర్రెల మందలా వచ్చేవి. ఏమి చేయాలో పాలుపోని ఆ దశలో.. కొన్ని పురుగులు సహజసిద్ధంగా చనిపోతున్నట్లు ఆయన గమనించారు. ఒక్కోసారి గుంపులో 90% పురుగులు చనిపోతూ ఉండేవి. చనిపోయిన పురుగులపై బూజు మాదిరిగా పేరుకొని ఉండేది. ఏదో ఒక ఫంగస్ ఈ పురుగులను చంపగలుగుతోందని రమేష్ గమనించారు. ఆ ఫంగస్‌ను తిరిగి వాడుకొని పురుగులను చంపగలమా? అన్న జిజ్ఞాస కలిగింది. ఫంగస్ సోకి చనిపోయిన పురుగులను బాపట్ల వ్యవసాయ కళాశాల, గుంటూరు లాం ఫారం, హైదరాబాద్‌లోని ఇక్రిశాట్, రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంతో పాటు యూపీలోని పంత్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి తీసుకెళ్లి శాస్త్రవేత్తలకు చూపించారు. ఆరేళ్లపాటు ఎంతోమంది శాస్త్రవేత్తలను కలిసి వివరించినా దీనిపై వారు సరైన అవగాహనకు రాలేకపోయారని రమేష్ తెలిపారు. రమేష్ మాత్రం పట్టువీడలేదు. ప్రయత్నం మాన లేదు.

16 మందికి డాక్టరేట్లు

ఆంధ్ర విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో కలిసి రమేష్ తర్లువాడలోని తన క్షేత్రంలో పత్తి పంటపై బవేరియా ప్రభావంపై చింతా విశ్వేశ్వరరావు సహకారంతో పరిశోధనలు కొనసాగించారు. ఈ పరిశోధనలపై అంతర్జాతీయ జర్నల్స్‌లో రమేష్ ముఖ్య పరిశోధకుడిగా 3 పరిశోధనా పత్రాలు అచ్చయ్యాయి. ఈ క్రమంలో ఏకంగా 16 మంది శాస్త్రవేత్తలకు డాక్టరేట్లు వచ్చాయి. ఈ పరిశోధనలు అడకమిక్ స్థాయిలోనే ఆగిపోయాయి. బవేరియాకు చెందిన 4-5 స్ట్రెయిన్లను వేరు చేసి యూనివర్సిటీలో భద్రపరచటం సాధ్యపడిందే తప్ప.. వాటిని విస్తృతంగా రైతుల దగ్గరకు తీసుకెళ్లటం సాధ్యపడలేదని రమేష్ తెలిపారు. జర్మనీ శాస్త్రవేత్తలు తమ కాకుమాను పొలంలో నుంచి మట్టి నమూనాలు సేకరించి తీసుకువెళ్లి ఈ ఫంగస్‌ను వాడుతున్నా తెలిపారు. ఈ నేపథ్యంలో నాబార్డ్ ఆర్థిక సాయంతో వైజాగ్‌లోని గీతం విశ్వవిద్యాలయంతో కలసి రమేష్ పరిశోధనలు చేశారు. గీతం యూనివర్సిటీ తన పేరుతో పేటెంట్‌కు దరఖాస్తు చేయబోగా, రమేష్ పేరును మొదటి ఆవిష్కర్తగా పెట్టాలని నాబార్డ్ సూచించింది. అయితే, వారు అంగీకరించకపోవటంతో వారితో నాబార్డ్ నిధులు ఇవ్వటం నిలిపివేసింది.



● ఇడ్లీ కుక్కర్ ద్వారా బవేరియా ఫంగస్‌ను వృద్ధి చేస్తున్నప్పటి దృశ్యం



● స్టెయిన్‌లెస్ స్టీల్ కంటెయినర్‌లో ఫంగస్‌ను అభివృద్ధి చేస్తున్న రమేష్

చివరికి 1984లో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం బాపట్ల వ్యవసాయ కళాశాలలో పాథాలజిస్టు డాక్టర్ మొహిద్దీన్ దీన్ని ఇంగ్లాండులోని మైకలాజికల్ సొసైటీకి పంపంగా.. ఇది పురుగుల పాలిట మృత్యుపాశం వంటి ‘బివేరియా బాసియానా’ అనే శిలీంద్రం అని వెల్లడైంది.

ఆ తరువాత కాలంలో శాస్త్రజ్ఞుల సూచనలతో రమేష్ స్వయంగా పరిశోధనలు చేపట్టారు. చనిపోయిన పురుగుపై నుంచి సేకరించిన ఈ ఫంగస్‌ను వేరు చేసి, తన వ్యవసాయ అవసరాల మేరకు శుద్ధమైన బవేరియా బాసియానా శిలీంద్రాన్ని అభివృద్ధి చేయటం, పంటలపై వాడి ఫలితాలు సాధించడం నేర్చుకున్నారు.

అతి తక్కువ ఖర్చుతో బవేరియా బాసియానా వంటి జీవన పురుగు మందులను పత్తి, మిరప తదితర పంటలు సాగు చేసే రైతులకు విస్తృతంగా అందుబాటులోకి తెస్తే రసాయనిక పురుగుమందుల అవసరం లేకుండా చేయవచ్చని రమేష్ భావించారు.

1987లో రాజేంద్రనగర్‌లో జరిగిన పత్తి శాస్త్రవేత్తల జాతీయ సదస్సులోనూ బవేరియా బాసియానాపై లోతైన పరిశోధనలు చేస్తే జల్లెడ పురుగులు, తెల్లదోమ ఆట కట్టించవచ్చని సూచించినా ఎవరికీ పట్టలేదు. అయినా రమేష్ తన పరిశోధనలు కొనసాగించారు.

ఏ స్ట్రెయిన్? ఏ పురుగు?

బవేరియా బాసియానా శిలీంద్రానికి సంబంధించి అనేక స్ట్రెయిన్లు ఉంటాయి. ఏ స్ట్రెయిన్ ఏ పంటపై, ఏయే పురుగులపై పనిచేస్తుందో తెలుసుకోవడానికి స్థానికంగా పరిశోధనలు చేసి, జీవన పురుగుమందులను ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. జీవన ఎరువులపై పరిశోధనలు కొంత మెరుగ్గా జరుగుతున్నప్పటికీ.. జీవన పురుగుమందులపై పరిశోధనలు మన దేశంలో చురుగ్గా జరగటం లేదని రమేష్ తెలిపారు. బవేరియా శిలీంద్రం అనేక దేశాల్లో 200 వరకు పురుగుల నియంత్రణకు సమర్థవంతంగా పనిచేస్తున్నదని రమేష్ తెలిపారు.



● బవేరియా బాసియానా ఫంగస్ సోకి చనిపోయిన మిరప పంటలో పురుగులు



● ప్రయోగశాలలో పురుగులపై మెటారైజమ్‌తో ప్రయోగం



● ప్రత్తి పంటపై పురుగులను నశింపజేస్తున్న బవేరియా బాసియానా

రూ. 200 ఖర్చుతో పురుగులకు చెక్

బవేరియా బాసియానా, నివేరియా రిలే, మెటరైజమ్ వంటి శిలీంద్రాలను శాస్త్రీయ పద్ధతిలో తయారుచేసుకుని జాగ్రత్తగా వినియోగిస్తే ఎకరాకు సుమారు రూ. 200 ఖర్చుతోనే మిర్చి, పత్తి, మామిడి, కూరగాయ పంటల్లో పురుగుల బెడదను తప్పించుకోవచ్చని రమేష్ అంటున్నారు.

మిరప తదితర పంటలను తీవ్రంగా నష్టపరుస్తున్న నల్ల తామర (బ్లాక్ త్రిప్స్)పై బవేరియా బాసియానా పని చేస్తున్నట్లు కొందరు రైతులు చెబుతున్నారు. అయితే, జాగ్రత్తలు తీసుకోకపోతే ఇతర రకాల ఫంగస్‌లతో కలుషితమై ప్రతికూల పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉందంటున్నారు. గతంలో ఇలాంటి బయో పెస్టిసైడ్‌ను వాడిన అనుభవం రైతులకు లేనందున శాస్త్రజ్ఞులు సరైన విధానాలను రైతులకు వివరించాలన్నారు.



ప్రకృతి వ్యవసాయానికి తప్పనిసరి అవసరం

రైతులకు మోయలేని ఆర్థిక భారంతో పాటు పర్యావరణ కాలుష్యానికి కారణమవుతున్న రసాయనిక పురుగు మందులకు ఎన్నో విధాలుగా చక్కటి ప్రత్యామ్నాయం జీవన పురుగుమందులే. బవేరియా బాసియానా, నివేరియా రిలే, మెటరైజమ్, వర్టిసెల్లలకాని వంటి శిలీంద్రాలతో కూడిన జీవన పురుగుమందులపై ప్రభుత్వం విస్తృతంగా పరిశోధనలు జరపాలి. ఏయే పురుగులపై ఏయే స్రెయిన్లు పని చేస్తున్నాయో నిర్ధారించాలి. వ్యవసాయ వర్సిటీ నిపుణుల పర్యవేక్షణలో జీవన పురుగుమందులను ప్రభుత్వమే ఉత్పత్తి చేయించి రైతులకు అందుబాటులోకి తేవాలి. నిల్వ సామర్థ్యం తక్కువ కాబట్టి రైతులను ముందుగా చైతన్యవంతం చేయాలి. ప్రకృతి వ్యవసాయం వ్యాప్తికి బయో పెస్టిసైడ్స్ తప్పనిసరి అవసరం.

– కొంగర రమేష్, నవనీత ఎవర్‌గ్రీన్స్, తర్లువాడ, విశాఖ జిల్లా

నూనెతో కలపి చల్లాలి

బవేరియా బాసియానా వంటి శిలీంద్రాలతో తయారు చేసిన జీవన పురుగుమందులను సాయంత్రం పూట, తేమ తక్కువగా ఉన్న పరిస్థితుల్లో నీటిలో కాకుండా ఏదో ఒక నూనె (ఎకరానికి 2 లీ.)లో శిలీంద్రాన్ని కలిపి హెలీస్ప్రేయర్/డ్రోన్‌తో సాయంకాలం పూట పిచికారీ చేయాలని రమేష్ సూచిస్తున్నారు. రైతులు నీటితో కలిపి చల్లుతున్నారని, నీటి తేమ ఆరిపోతే శిలీంద్రపు బీజాలు చనిపోయి పురుగులపై ప్రభావం చూపలేకపోవచ్చు. అందుకని ఏదో ఒక నూనెలో కలిపి పిచికారీ చేస్తే ప్రయోజనం బాగుంటుందన్నారు.

నిద్రాణంగా ఉండే శిలీంద్రపు బీజాలకు తేమ తగిలితే జర్మినేట్ అవుతాయని, ఆ తర్వాత కొద్ది గంటల వరకే బతికి ఉంటాయి. ఆ లోగానే పురుగు వాటిని తినటం లేదా దాని శరరీంపై ఇవి పడటం జరిగితే.. ఆ శిలీంద్రం పురుగు దేహంలో పెరిగి దాన్ని చంపగలుగుతుంది. అందుకు రెండు-మూడు రోజుల సమయం పడుతుంది. నూనెతో కలిపి చల్లితే బీజాలు వారం, పది రోజుల పాటు గింజగానే ఉంటాయని.. పురుగులు ఈ బీజాలను తిన్నా, వాటి శరీరానికి తగిలినా చాలు.

శిలీంద్రం బారిన పడిన చనిపోయిన తర్వాత 5 రోజుల్లోనే ఒక పురుగులో కోట్ల కొలదీ శిలీంద్రపు బీజాలు పెరిగి, గాలి ద్వారా వ్యాపించి, పురుగులను నాశనం చేస్తాయి. ఇందువల్లనే జీవన పురుగుమందులు రసాయన పురుగు మందుల్లా వెంటనే కాక రెండు రోజుల తర్వాత ప్రభావం చూపుతాయి. రీసైక్లింగ్ పెస్టిసైడ్‌గానూ పనిచేస్తాయి. రైతులు చల్లిన గంటలోనే ఫలితం ఆశిస్తున్నారు తప్ప తర్వాత రోజుల్లో ఏమి అవుతుందో గమనించడం లేదని, ఈ విషయమై రైతుల్లో అవగాహన కలిగించాలని రమేష్ సూచిస్తున్నారు. జీవన పురుగుమందుల వల్ల పర్యావరణానికి, మనుషులకు, ఇతర జీవులకు ఎటువంటి సమస్యా ఉండదు.

– గేదెల శ్రీనివాసరెడ్డి, సాక్షి, తగరపువలస, విశాఖ జిల్లా

జనవరి 2 నుంచి ఆకాష్ చౌరాసియా శిక్షణ

బహుళ అంచెల ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై యువ ప్రకృతి సేద్య నిపుణుడు ఆకాష్ చౌరాసియా 3 రోజుల పాటు తెలుగు రైతులకు శిక్షణ ఇవ్వనున్నారు. 2023 జనవరి 2,3,4 తేదీల్లో రంగారెడ్డి జిల్లా శంషాబాద్ సమీపంలోని చిన్నజీయర్ స్వామి ట్రస్ట్ ఆవరణలో శిక్షణా శిబిరం జరగనుంది. రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్షక సేవా కేంద్రం నిర్వహణలో జీయర్ ట్రస్టు తోడ్పాటుతో ఈ కార్యక్రమం జరగబోతోంది. ఆసక్తిగల వారు ముందుగా పేర్లు నమోదు చేయించుకోవాలని రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై. వెంకటేశ్వరరావు తెలిపారు. వివరాలకు.. 70939 73999, 95538 25532.

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్



రెండో టెస్టుకూ రోహిత్ శర్మ దూరం

బొటన వేలి గాయం నుంచి ఇంకా కోలుకోకపోవడంతో... బంగ్లాదేశ్ జట్టుతో ఈనెల 22 నుంచి ఢాకాలో జరిగే చివరిదైన రెండో టెస్టుకు భారత రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ అందుబాటులో ఉండటం లేదు. బంగ్లాదేశ్‌తో ఈనెల 7న జరిగిన రెండో వన్డే సందర్భంగా ఫీల్డింగ్ చేస్తూ రోహిత్ గాయపడ్డాడు. మ్యాచ్ ముగిశాక రోహిత్ ముంబై చేరుకొని చికిత్స తీసుకోవడం ప్రారంభించాడు. వచ్చే వారం మరోసారి రోహిత్ గాయాన్ని పరీక్షించాకే అతను మళ్లీ ఎప్పుడు బరిలోకి దిగుతాడో వెల్లడిస్తామని బీసీసీఐ తెలిపింది.

విజయంతో ముగించాలని...



భారత మహిళల క్రికెట్ జట్టు ఆస్ట్రేలియాతో ఆఖరి మ్యాచ్‌లో నెగ్గి సిరీస్‌ను విజయంతో ముగించాలనే పట్టుదలతో ఉంది. ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో భాగంగా నేడు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా, ఆస్ట్రేలియా జట్ల మధ్య ముంబైలో చివరి మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే 1–3తో సిరీస్ చేజార్చుకున్న భారత్ సమష్టిగా రాణిస్తున్నా కీలకదశలో తడబడుతోంది. రాత్రి 7 గంటలకు మొదలయ్యే ఈ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

విజేత రాజా రిత్విక్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ చెస్ గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్ తన కెరీర్‌లో మరో అంతర్జాతీయ టోర్నీ టైటిల్‌ను సాధించాడు. స్పెయిన్‌లో జరిగిన సన్‌వే సిట్‌గెస్ ఓపెన్ అంతర్జాతీయ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్‌లో 18 ఏళ్ల రాజా రిత్విక్ చాంపియన్‌గా అవతరించాడు. నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత రాజా రిత్విక్ 8.5 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. 30 దేశాల నుంచి 120 మంది అగ్రశ్రేణి క్రీడాకారులు పాల్గొన్న ఈ టోర్నీలో రిత్విక్ అజేయంగా నిలిచాడు. కేఎల్ యూనివర్సిటీ విద్యార్థి అయిన రిత్విక్ ఈ టోర్నీలో ఎనిమిది గేముల్లో గెలిచి, మరో గేమ్‌ను 'డ్రా' చేసుకున్నాడు. ప్రముఖ కోచ్ ఎన్.రామరాజుకు చెందిన రేస్ చెస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న రిత్విక్... ఈ టోర్నీలో ముగ్గురు గ్రాండ్‌మాస్టర్లు ఆధిబన్, అరవింద్ చిదంబరం (భారత్), స్వెన్ ఫ్రెడరిక్ (జర్మనీ)పై గెలిచి మరో గ్రాండ్‌మాస్టర్ అర్జున్ కల్యాణ్ (భారత్)తో గేమ్‌ను 'డ్రా'గా ముగించాడు.

విజయం దిశగా ఇంగ్లండ్



రేహన్ అహ్మద్

కరాచీ: పాకిస్తాన్‌తో జరుగుతున్న చివరిదైన మూడో టెస్టులో ఇంగ్లండ్ జట్టు విజయానికి మరో 55 పరుగుల దూరంలో నిలిచింది. పాక్ నిర్దేశించిన 167 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన ఇంగ్లండ్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 17 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 112 పరుగులు చేసింది. బెన్ డకెట్ (50 బ్యాటింగ్; 8 ఫోర్లు), బెన్ స్టోక్స్ (10 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 21/0తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్తాన్‌ను ఇంగ్లండ్ యువ లెగ్ స్పిన్నర్ రేహన్ అహ్మద్ (5/48) దెబ్బ తీశాడు. రేహన్ మాయాజాలానికి పాకిస్తాన్ రెండో ఇన్నింగ్స్‌లో 216 పరుగులకు ఆలౌటైంది. బాబర్ ఆజమ్ (54; 6 ఫోర్లు), సాద్ షకీల్ (53; 6 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. 18 ఏళ్ల రేహన్ అరంగేట్రం టెస్టులోనే ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు పడగొట్టిన పిన్న వయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు. 17 ఏళ్ల తర్వాత పాక్ గడ్డపై టెస్టు సిరీస్ ఆడుతున్న ఇంగ్లండ్ తొలి రెండు టెస్టుల్లో గెలిచి ఇప్పటికే సిరీస్‌ను సొంతం చేసుకుంది.

మెస్సీ మెరిసె... జగమే మురిసె...

'ఖతర్' ఫుట్‌బాల్ ప్రపంచకప్ సూపర్ హిట్

ఆద్యంతం అలరించిన మెగా ఈవెంట్ | **'ఫినిషింగ్' టచ్ అదుర్స్**

టోర్నమెంట్ ప్రారంభానికి ముందు ఎన్నో వివాదాలు... వేడిమి వాతావరణంతో ఇబ్బందులు తప్పవేమోనని ఆటగాళ్ల సందేహాలు... ఆంక్షల మధ్య అభిమానులు ఆటను ఆస్వాదిస్తారో లేదోనని ఏమూలనో అనుమానం... కానీ ఒక్కసారి 'కిక్' మొదలుకాగానే... గోల్స్ మోత మోగింది... సంచలనాలతో సాకర్ సంరంభం షురూ అయింది... ఫైనల్ మ్యాచ్ చివరి క్షణం దాకా అదే ఉత్కంఠ కొనసాగింది... విశ్వవ్యాప్తంగా అభిమానులందరూ చిరకాలం గుర్తుండేలా 'ఖతర్'నాక్ ప్రపంచకప్ సూపర్‌హిట్ అయ్యింది. -సాక్షి క్రీడా విభాగం

ప్రపంచ నంబర్‌వన్ బ్రెజిల్ జిగేల్ మనలేదు... బెంబేలెత్తిస్తుందనుకున్న బెల్జియం బోల్తా కొట్టింది... పూర్వ వైభవం సాధిస్తుందనుకున్న జర్మనీ ఇంకా సంధికాలంలోనే ఉన్నామని సంకేతాలు పంపించింది... క్రిస్టియానో రొనాల్డో జట్టు పోర్చు'గల్లంతయింది'... ఆతిథ్యంలో అద్భుతమనిపించినా... ఆతిథ్య జట్టు 'ఖతర్'నాక్ ఆటతో మాత్రం ఆకట్టుకోలేకపోయింది. 56 ఏళ్లుగా మరో ప్రపంచకప్ టైటిల్ కోసం నిరీక్షిస్తున్న ఇంగ్లండ్ దానిని మరో నాలుగేళ్లకు పొడిగించుకోగా... నెదర్లాండ్స్ 'షూటౌట్'లో అవుట్ అయింది... సౌదీ అరేబియా, జపాన్, ఆస్ట్రేలియా అడపాదడపా మెరిసి ప్రిక్వార్టర్ ఫైనల్‌కే పరిమితంకాగా... డిఫెండింగ్ చాంపియన్ ఫ్రాన్స్ అంచనాలను నిలబెట్టుకుంది. అర్జెంటీనా ఆరంభ విఘ్నాన్ని అధిగమించి ఆఖరకు జగజ్జేతగా నిలిచి ఔరా అనిపించి సాకర్ సంగ్రామానికి శుభంకార్డు వేసింది.

అంచనాలను మించి...



29 రోజులపాటు సాగిన ఈ సాకర్ సమరంలో అందరి అంచనాలను తారుమారు చేసి ఆకట్టుకున్న జట్టు మొరాకో. 2018 ప్రపంచకప్ రన్నరప్ క్రొయేషియాతో తొలి మ్యాచ్‌ను 'డ్రా'గా ముగించి, రెండో మ్యాచ్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ బెల్జియంను బోల్తా కొట్టించి... మూడో మ్యాచ్‌లో కెనడాపై గెలిచిన మొరాకో గ్రూప్ 'ఎఫ్' టాపర్‌గా నిలిచింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో 2010 ప్రపంచ చాంపియన్ స్పెయిన్‌పై 'షూటౌట్'లో గెలిచిన మొరాకో క్వార్టర్ ఫైనల్లో 1–0తో రొనాల్డో నాయకత్వంలోని పోర్చుగల్ జట్టును ఇంటిదారి పట్టించి ప్రపంచకప్ చరిత్రలో సెమీఫైనల్ చేరిన తొలి ఆఫ్రికా జట్టుగా ఘనత సాధించింది. అయితే సెమీఫైనల్లో పటిష్టమైన ఫ్రాన్స్ చేతిలో పోరాడి ఓడిన మొరాకో మూడో స్థానం కోసం మ్యాచ్‌లో క్రొయేషియా చేతిలోనూ ఓడిపోయి నాలుగో స్థానంతో ఈ మెగా ఈవెంట్‌ను ముగించింది.



ఎంబాపె, మెస్సీ

మెస్సీ ఇంకొన్నాళ్లు...

36 ఏళ్ల అర్జెంటీనా ప్రపంచకప్ నిరీక్షణకు తెరదించిన మెస్సీ తన కెరీర్‌లో లోటుగా ఉన్న విశ్వ కిరీటాన్ని సొంతం చేసుకొని దిగ్గజాల సరసన చేరిపోయాడు. సౌదీ అరేబియా చేతిలో ఆరంభ మ్యాచ్‌లోనే ఓడిపోయినా తన నాయకత్వ పటిమతో జట్టును ముందుండి నడిపించిన మెస్సీ ఆ తర్వాత ట్రోఫీ ముద్దాడేవరకు వెనుదిరిగి చూడలేదు. ఫ్రాన్స్‌తో ఫైనల్ అర్జెంటీనా తరఫున తన చివరి మ్యాచ్ అని ప్రకటించిన 35 ఏళ్ల మెస్సీ జట్టు జగజ్జేతగా నిలవడంతో తన నిర్ణయంపై పునరాలోచించాడు. ప్రపంచ చాంపియన్ అనే హోదాను ఇంకొన్నాళ్లు ఆస్వాదిస్తానని... జాతీయ జట్టుకు మరికొన్ని మ్యాచ్‌లు ఆడాలనుకుంటున్నానని తన మనసులోని మాటను వెల్లడించాడు. మెస్సీ కోరుకుంటే 2026 ప్రపంచకప్‌లోనూ ఆడవచ్చని అర్జెంటీనా కోచ్ లియోనల్ స్కలోని వ్యాఖ్యానించారు. ఈ టోర్నీలో ఏడు గోల్స్ సాధించిన మెస్సీ అత్యధిక ప్రపంచకప్ మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్‌గానూ చరిత్ర పుటల్లోకి ఎక్కాడు.

భవిష్యత్ ఎంబాపెదే...

నాలుగేళ్ల క్రితం రష్యా గడ్డపై జరిగిన ప్రపంచకప్‌లో ఫ్రాన్స్ టైటిల్ సాధించడంలో యువస్టార్ కిలియాన్ ఎంబాపె కీలకపాత్ర పోషించాడు. ఖతర్‌లోనూ ఎంబాపె అదరగొట్టాడు. ముఖ్యంగా ఫైనల్లో చివరి పది నిమిషాల్లో ఎంబాపె ఆటతో అర్జెంటీనా హడలెత్తిపోయింది. మ్యాచ్ ఫ్రాన్స్, అర్జెంటీనా మధ్య కాకుండా ఎంబాపె, అర్జెంటీనా మధ్య జరుగుతోందా అనే అనుమానం కలిగింది. చివరకు 'షూటౌట్'లో ఫ్రాన్స్ ఓడిపోయినా ఎంబాపె పోరాట యోధుడిలా అందరి దృష్టిలో నిలిచాడు. జిరూడ్, గ్రీజ్‌మన్, కరీమ్ బెంజెమాలాంటి అగ్రశ్రేణి ఆటగాళ్ల కెరీర్ చరమాంకానికి చేరుకోవడంతో భవిష్యత్ ఎంబాపెదే కానుంది. 23 ఏళ్ల ఎంబాపె ఇదే జోరు కొనసాగిస్తే మాత్రం వచ్చే ప్రపంచకప్‌లోనూ ఫ్రాన్స్ జట్టు టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతుందని చెప్పవచ్చు.

వచ్చేసారైనా భారత్ ఉంటుందా?

92 ఏళ్ల ప్రపంచకప్ చరిత్రలో ఏనాడూ భారత్ నేరుగా అర్హత సాధించలేకపోయింది. బ్రెజిల్ వేదికగా 1950లో జరిగిన ప్రపంచకప్‌లో పాల్గొనాలని భారత్‌కు ఆహ్వానం లభించినా పలు కారణాలతో వెళ్లలేకపోయింది. 1950 నుంచి 1970 వరకు భారత ఫుట్‌బాల్ జట్టు ఓ వెలుగు వెలిగింది. 1956 మెల్‌బోర్న్ ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచిన భారత జట్టులో హైదరాబాద్ నుంచి ఏకంగా ఎనిమిది మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. హైదరాబాద్‌కే చెందిన సయ్యద్ అబ్దుల్ రహీమ్ భారత జట్టుకు కోచ్‌గా వ్యవహరించారు. 1962 జకార్తా ఆసియా క్రీడల్లో రహీమ్ శిక్షణలో భారత జట్టు ఫైనల్లో దక్షిణ కొరియాను ఓడించి స్వర్ణ పతకాన్ని సాధించింది. 1963లో కోచ్ రహీమ్ క్యాన్సర్‌తో మృతి చెందడంతో భారత ఫుట్‌బాల్ కూడా వెనుకడుగులు వేయడం ప్రారంభించింది. కాలానుగుణంగా అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో వస్తున్న మార్పులకు తగ్గట్టు ఆలిండియా ఫుట్‌బాల్ సమాఖ్య అభివృద్ధి చర్యలు తీసుకోకపోవడంతో దేశంలో ఫుట్‌బాల్‌కు క్రమక్రమంగా ఆదరణ తగ్గిపోవడం మొదలైంది. ఒకప్పుడు ఆసియాలో నంబర్‌వన్‌గా ఉన్న జట్టు నేడు దక్షిణాసియాలోని బంగ్లాదేశ్, నేపాల్ జట్లపై కూడా గెలవడానికి ఇబ్బంది పడుతోంది. 2022 ప్రపంచకప్ ఆసియా క్వాలిఫయింగ్ టోర్నీలో భారత్ గ్రూప్ దశలోనే వెనుదిరిగింది. 2026 ప్రపంచకప్ కోసం ఆసియా నుంచి 8 లేదా 9 జట్లకు బెర్త్‌లు లభిస్తాయి. ఈ నేపథ్యంలో భారత్ తమ ప్రపంచకప్ కలను సాకారం చేసుకోవాలంటే పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలి. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ప్రస్తుతం భారత్ 106వ ర్యాంక్‌లో... ఆసియాలో 19వ స్థానంలో ఉంది. జపాన్, కొరియా, సౌదీ అరేబియా, ఇరాన్, ఆస్ట్రేలియా, ఖతర్, యూఏఈ, ఒమన్, ఉజ్బెకిస్తాన్, చైనా, బహ్రెయిన్, జోర్డాన్ లాంటి పటిష్ట జట్లను దాటుకొని భారత్ ప్రపంచకప్ బెర్త్ సాధించాలంటే అత్యద్భుతంగా ఆడాలి. భారత జట్టు మాజీ గోల్‌కీపర్ కల్యాణ్ చౌబే ఇటీవల అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ మాజీ ఫుట్‌బాలర్ అధ్యక్షతలోనైనా భారత ఫుట్‌బాల్ అభివృద్ధివైపు అడుగులు వేస్తుందో లేదో వేచి చూడాలి.



భారత ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ సునీల్ ఛెత్రి (ఫైల్)

'యునైటెడ్'లో కలుద్దాం...

అందరి ఆటగా పేరున్న ఫుట్‌బాల్ విశ్వ సమరం వచ్చేసారి మూడు దేశాల్లో జరగనుంది. అమెరికా, మెక్సికో, కెనడా దేశాలు 2026 ప్రపంచకప్‌నకు సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. మరిన్ని జట్లకు అవకాశం లభించాలనే సదుద్దేశంతో ప్రపంచ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) 2026 ప్రపంచకప్‌ను 32 జట్లకు బదులుగా 48 జట్లతో నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఆతిథ్య దేశాల హోదాలో అమెరికా, మెక్సికో, కెనడా జట్లకు నేరుగా ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొనే అవకాశం లభించింది. మిగతా 45 బెర్త్‌ల కోసం వచ్చే ఏడాది మార్చి నుంచి క్వాలిఫయింగ్ దశ మ్యాచ్‌లు మొదలై 2026 మార్చి వరకు కొనసాగుతాయి. మొత్తం 48 జట్లను 16 గ్రూప్‌లుగా (ఒక్కో గ్రూప్‌లో మూడు జట్లు) విభజిస్తారు. గ్రూప్ దశ తర్వాత ఆయా గ్రూపుల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన 32 జట్లు నాకౌట్ తొలి రౌండ్ దశకు అర్హత సాధిస్తాయి.

ఇయర్ రౌండప్



మహేశ్‌బాబు



చిరంజీవి



రాజమౌళి

మాట.. పాట..



నాని

ఒక స్టార్ హీరో సినిమాకి మరో స్టార్ మాట సాయం చేస్తే.. పాట సాయం కూడా చేస్తే.. ఆ ఇద్దరు స్టార్ల అభిమానులకు పండగే పండగ. 2022 అలాంటి కొన్ని పండగలను ఇచ్చింది. అడగ్గానే కాదనకుండా వాయిస్ ఓవర్ ఇచ్చి, మాట... పాట పాడిన కొందరు స్టార్స్ గురించి తెలుసుకుందాం.



ఎన్టీఆర్

దాదాపు ఐదేళ్ల తర్వాత ఈ ఏడాది వాయిస్ ఓవర్ ఇచ్చారు చిరంజీవి. అది కూడా నాలుగు చిత్రాలకు. 2017లో వచ్చిన రానా 'ఘాజీ', మంచు మనోజ్ 'గుంటూరోడు' చిత్రాల తర్వాత ఈ ఏడాది లీజైన మోహన్‌బాబు 'సన్ ఆఫ్ ఇండియా', బాలీవుడ్ చిత్రం రణ్‌బీర్ కపూర్ 'బ్రహ్మాస్త్రం'కు చిరంజీవి వాయిస్ ఓవర్ ఇచ్చారు. 'సన్ ఆఫ్ ఇండియా' ఫిబ్రవరి 18న విడుదలైంది. రణ్‌బీర్, ఆలియా జంటగా, నాగార్జున, అమితాబ్ బచ్చన్ కీలక పాత్రల్లో రూపొందిన 'బ్రహ్మాస్త్రం' ట్రయాలజీలోని 'బ్రహ్మాస్త్రం: పార్ట్ 1 శివ' సెప్టెంబరు 9న రిలీజైంది. అదే నెల 30న విడుదలైన మణిరత్నం 'పొన్నియిన్ సెల్వన్' పార్ట్ 1 చిత్రానికీ చిరంజీవి వాయిస్ ఓవర్ ఇచ్చారు. అలాగే కృష్ణవంశీ దర్శకత్వంలో రూపొందిన 'రంగ మార్తాండ'లోని షాయరీ చిరంజీవి వాయిస్‌తో ఆడియన్స్‌కు వినిపిస్తుంది. ఈ సినిమాలో ప్రకాశ్‌రాజ్ టైటిల్ రోల్ చేయగా, రమ్యకృష్ణ, బ్రహ్మానందం కీలక పాత్రలు చేశారు. ఒక నటుడి జీవితం నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. ఆ నటుడు తన జీవితంలో ఎదుర్కొనే ఘటనలు, అతని భావోద్వేగాలను చిరంజీవితో షాయరీగా చెప్పించారు కృష్ణవంశీ. ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది. మరోవైపు నాలుగేళ్ల తర్వాత ఓ సినిమాకు వాయిస్ ఓవర్ ఇచ్చారు మహేశ్‌బాబు. పవన్ కల్యాణ్ 'జల్సా' (2008), ఎన్టీఆర్ 'బాద్‌షా' (2013), దివంగత నటుడు కృష్ణ టైటిల్ రోల్ చేసిన 'శ్రీశ్రీ' (2016), సందీప్ కిషన్ హీరోగా చేసిన 'మనసుకు నచ్చింది' (2018) చిత్రాలకు వాయిస్ ఓవర్ ఇచ్చిన మహేశ్ ఈ ఏడాది 'ఆచార్య'కు ఇచ్చారు. ఈ చిత్రం ఏప్రిల్ 29న రిలీజైన సంగతి తెలిసిందే. మరోవైపు యంగ్ హీరో నవీన్ పొలిశెట్టి తనకు 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ'లాంటి హిట్ అందించిన ఆర్‌ఎస్‌జే స్వరూప్ దర్శకత్వంలో రూపొందిన 'మిషన్ ఇంపాజిబుల్'కి వాయిస్ ఓవర్ ఇచ్చారు. తాప్సీ ఓ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం ఏప్రిల్ 1న రిలీజైంది. ఇంకోవైపు ప్రభాస్, పూజా హెగ్డే జంటగా రాధా కృష్ణకుమార్ దర్శకత్వంలో రూపొందిన 'రాధేశ్యామ్' సినిమా తెలుగు వెర్షన్‌కు వాయిస్ ఓవర్ ఇచ్చారు దర్శకుడు రాజమౌళి. మార్చి 11న ఈ చిత్రం విడుదలైంది. ఇక వాల్‌పోస్టర్ సినిమా బ్యానర్‌పై ఇప్పటికే 'అ!', 'హిట్', 'హిట్ 2' సినిమాలను నిర్మించిన నాని ఈ ఏడాది వెబ్ ఆంథాలజీ 'మీట్ క్యూట్' నిర్మించారు. ఈ చిత్రానికి నాని సోదరి దీప్తి గంటా దర్శకురాలు. ఈ సినిమా ట్రైలర్‌కు నాని వాయిస్ ఓవర్ అందించారు. సోనీ లివ్‌లో నవంబరు 25 నుంచి ఈ ఆంథాలజీ స్ట్రీమింగ్ అవుతోంది. గతంలో తాను నిర్మించిన 'అ!'కు నాని వాయిస్ ఓవర్ ఇచ్చారు.

సాయిధరమ్ తేజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'విరూపాక్ష'. దర్శకుడు కార్తీక్ దండు తెరకెక్కిస్తున్న ఈ సినిమా గ్లింప్స్ వీడియో ఇటీవల విడుదలైంది. ఈ గ్లింప్స్‌కు హీరో ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ఇచ్చారు. ఈ సినిమాలో మరోచోట కూడా ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ఉంటుందనే టాక్ వినిపిస్తోంది. సంయుక్తా మీనన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 21న రానుంది.

పాటల సందడి..

ఇప్పటికే ఎన్నో పాటలకు గాత్రం అందించిన శింబు ఈ ఏడాది బాగా సౌండ్ చేసిన ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం 'ది వారియర్'లోని 'బుల్లెట్ సాంగ్' పాడారు. తమిళంలోనూ ఈ పాటను పాడారు శింబు. రామ్, కృతీ శెట్టి జంటగా నటించిన ఈ చిత్రం జూలై 14న విడుదలైంది. అలాగే ఈ ఏడాది శ్రోతలను మెప్పించిన మరో పాట 'టైమ్ ఇవ్వు పిల్ల..' కూడా శింబు పాడిందే. నిఖిల్, అనుపమా పరమేశ్వరన్ జంటగా నటించిన '18 పేజెస్' చిత్రంలోని పాట ఇది. వీటితో పాటు నిర్మాతగా హీరో రవితేజ తెలుగులో సమర్పించిన తమిళ చిత్రం 'ఎఫ్ఐఆర్' థీమ్ సాంగ్ కూడా శింబు గొంతు నుంచి వినిపించిందే. ఫిబ్రవరి 11న ఈ చిత్రం రిలీజైంది. అలాగే తమిళ స్టార్ హీరో విజయ్ నటించిన 'వారిసు '(తెలుగులో 'వారసుడు) సినిమా కోసం కూడా శింబు పాట పాడారు. ఈ చిత్రం జనవరిలో రిలీజ్ కానుంది. ప్రముఖ దర్శకుడు శంకర్ తనయ అదితి పాడిన తొలి పాట 'రోమియోకి జూలియట్‌లా'. వరుణ్ తేజ్, సయీ మంజ్రేకర్ జంటగా నటించిన 'గని'లోని పాట ఇది. ఈ సినిమా ఏప్రిల్ 8న రిలీజైంది. ఇలా మాట.. పాట సాయం చేసిన స్టార్స్ మరికొందరు ఉన్నారు.



శింబు



అదితి

సినిమా

అది మనకు గర్వకారణం

- అల్లు అర్జున్



గోపీసుందర్, సూర్యప్రతాప్, వివేక్ కూచిభొట్ల, బన్ని వాసు, సుకుమార్, అనుపమ, అల్లు అర్జున్, నిఖిల్

''ఇది వరకు మనం సౌత్ సినిమాలు చేస్తే సౌత్ వరకే రీచ్ ఉండేది. కానీ దక్షిణాది సినిమాలు ఉత్తరాదికి వెళ్లేందుకు 'బాహుబలి'తో బాటలు వేసిన రాజమౌళిగారికి థ్యాంక్స్. 'పుష్ప, కేజీఎఫ్, కార్తికేయ 2, కాంతార' సినిమాలు పాన్ ఇండియా వెళ్లడం హ్యాపీ. మన చిత్రాలు దేశమంతా చూస్తుండటం మనకు గర్వకారణం'' అని హీరో అల్లు అర్జున్ అన్నారు. నిఖిల్, అనుపమా పరమేశ్వరన్ జంటగా నటించిన చిత్రం '18 పేజెస్'. డైరెక్టర్ సుకుమార్ కథ అందించగా, సూర్యప్రతాప్ పల్నాటి దర్శకత్వం వహించారు. అల్లు అరవింద్ సమర్పణలో బన్ని వాసు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23 విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో అల్లు అర్జున్ మాట్లాడుతూ– ''సుకుమార్‌గారు లేకుంటే నా ఈ జీవితం, ఈ ప్రయాణం ఇలా ఉండేది కాదని ఎప్పుడూ అనుకుంటూ ఉంటాను. అందుకే ఆయనంటే అభిమానం, గౌరవం, ప్రేమ ఉన్నాయి. మా నాన్నకి(అల్లు అరవింద్) సొంత ఓటీటీ ఉంది. '18 పేజెస్' విడుదల ఆలస్యం అవుతుండటంతో ఓటీటీలో రిలీజ్ చేయమని చాలా మంది చెప్పినా థియేటర్లోనే విడుదల చేస్తున్న ఆయనకి థ్యాంక్స్. '18 పేజెస్' కి గోపీ సుందర్ మంచి సంగీతం ఇచ్చారు. ఇలాంటి వంటి మంచి సినిమా తీసినందుకు సూర్యప్రతాప్‌కి థ్యాంక్స్. 'హ్యాపీడేస్' నుంచి నిఖిల్ గ్రాఫ్ చూస్తున్నాను.. చాలా మంచి కథలు ఎంచుకుంటున్నాడు. ఎలా అని ఓ సారి అడిగితే బుక్స్ బాగా చదువుతాడట. నా వ్యక్తిగత అభిప్రాయంలో ఒక యాక్టర్‌కి కావాల్సిన అర్హత ఏంటంటే పుస్తకాలు చదవడం.. అది తనలో చాలా ఉంది. '18 పేజెస్' కి యూనిట్ పెట్టిన కష్టం మీ మనసులను టచ్ చేస్తుంది. 'పుష్ప 2' అస్సలు తగ్గేదే లే'' అన్నారు.

అల్లు అరవింద్ మాట్లాడుతూ– ''18 పేజెస్' వంటి అద్భుతమైన కథని సుకుమార్ రాశాడు. ఇది గీతా ఆర్ట్స్‌లో తీస్తే బాగుంటుందని బన్ని వాసుకి కథ ఇచ్చి, మా గీతా ఆర్ట్స్‌లో సినిమా తీయించినందుకు తనకి థ్యాంక్స్'' అన్నారు.

డైరెక్టర్ సుకుమార్ మాట్లాడుతూ– ''నేను నిర్మాత అవుదామని 'జగడం' టైమ్‌లో అనుకున్నా. 'ఆర్య 2' తీస్తున్నప్పుడు నిఖిల్‌కి లక్ష రూపాయలు అడ్వాన్స్ ఇచ్చాను. 'హ్యాపీడేస్' సినిమా చూసినప్పుడే తను సక్సెస్ అవుతాడనిపించి, ఆ అడ్వాన్స్ ఇచ్చాను. '18 పేజెస్' సక్సెస్ క్రెడిట్ సూర్యప్రతాప్‌దే. 'పుష్ప 2' ఐదు రోజులు షూటింగ్ చేశాం'' అన్నారు.

''అల్లు అర్జున్, సుకుమార్‌లు లేకపోతే బన్ని వాసు అనే వాడు ఈరోజు ఇక్కడ ఉండేవాడు కాదు'' అన్నారు బన్నీ వాసు. ''పాన్ ఇండియా స్థాయికి మన తెలుగు సినిమాలు తీసుకెళ్లేలా బాటలు వేసిన దర్శకులు రాజమౌళి సర్, సుకుమార్ సర్‌కి థ్యాంక్స్. '18 పేజెస్' అందర్నీ సర్‌ప్రైజ్ చేస్తుంది'' అన్నారు నిఖిల్.

ఈ వేడుకలో నిర్మాతలు వై.రవిశంకర్, 'జెమిని' కిరణ్, ఎస్‌కేఎన్, వివేక్ కూచిభొట్ల, సంగీత దర్శకుడు గోపీ సుందర్ పాల్గొన్నారు.

ఈ విజయం ప్రేక్షకులదే

- రాజేంద్రప్రసాద్

''చిన్న సినిమా, పెద్ద సినిమా అని కాకుండా కంటెంట్ ఉన్న సినిమా తీస్తే ఆదరిస్తామని ప్రేక్షకులు మరోసారి మా 'శాసనసభ'తో నిరూపించారు. ఈ విజయం వారిదే'' అని నటుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. ఇంద్రసేన, ఐశ్వర్యా రాజ్ జంటగా వేణు మడికంటి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'శాసన సభ'. తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని నిర్మించిన ఈ సినిమా ఈ నెల 16న విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ మీట్‌లో ఈ చిత్రంలో కీలక పాత్ర చేసిన రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ– ''శాసనసభ'లో నేను చేసిన నారాయణ స్వామి పాత్రకి మంచి పేరొచ్చిందంటే దానికి కారణం రచయిత రాఘవేందర్ రెడ్డి, దర్శకుడు వేణు.. నాది మూడో స్థానం. సినిమా విడుదలైన మూడో రోజే 60 థియేటర్స్ పెరగడం సంతోషంగా ఉంది'' అన్నారు. ఈ చిత్రవిజయం పట్ల యూనిట్ ఆనందం వ్యక్తం చేసింది.



రాజేంద్రప్రసాద్, ఇంద్రసేన

నిర్మాతల మండలి ఎన్నికలు నిర్వహించాలి

- మోహన్ గౌడ్

''తెలుగు నిర్మాతల మండలి ఎన్నికలు ప్రతి రెండేళ్లకోసారి నిర్వహించాలి. కానీ, నాలుగేళ్లయినా నిర్వహించకుండా కాలయాపన చేస్తున్నారు.. వెంటనే ఎన్నికలు నిర్వహించాలి'' అని నిర్మాతల మండలి జాయింట్ సెక్రటరీ మోహన్ గౌడ్ డిమాండ్ చేశారు. ఎన్నికలు వెంటనే నిర్వహించాలని కోరుతూ కొందరు నిర్మాతలు (సభ్యులు) హైదరాబాద్ ఫిల్మ్ ఛాంబర్ ఆవరణలో సోమవారం రిలే నిరాహార దీక్ష ఆరంభించారు. ఈ సందర్భంగా మోహన్ గౌడ్ మాట్లాడుతూ– ''కౌన్సిల్‌లోకి ఒక వ్యక్తి ప్రవేశించినప్పటి నుంచి వ్యవస్థ గాడి తప్పింది. కౌన్సిల్ బైలా ప్రకారం సంవత్సరానికి ఒకసారి సభ్యులకు లెక్కలు చూపించాల్సి ఉండగా, నాలుగేళ్లయినా చూపడం లేదు. ఎన్నికలు నిర్వహించాలని ప్రస్తుత అధ్యక్షుడు కల్యాణ్‌గారికి చెప్పినా, ఆయన కాలయాపన చేస్తున్నారు'' అన్నారు. రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న నిర్మాతలు వీపీఎఫ్ చార్జీల వసూలుపైనా మండిపడ్డారు.

నేను చెన్నైలో ఉన్నాను. ఈ రిలే నిరాహారదీక్షల గురించి నాకు తెలియదు. ఈ నెల 22న హైదరాబాద్‌కు వస్తున్నాను. ఏవైనా సమస్యలు ఉంటే నాతో మాట్లాడాలి. అంతేకానీ అనవసర చర్యలతో నిర్మాతల మండలి పరువు తీయవద్దు. మ్యానువల్ బుక్ ప్రింట్ కాగానే ఎన్నికలు నిర్వహించాలనుకుంటున్నాం. మూడురోజుల క్రితమే ప్రింటింగ్‌కు పంపాం.

– నిర్మాతల మండలి అధ్యక్షుడు సి. కల్యాణ్

క్లుప్తంగా...

పోలీస్ క్రీడాకారులకు డీజీపీ అభినందన

సాక్షి, అమరావతి: జాతీయ స్థాయిలో పోలీస్ క్లస్టర్–2022 పోటీల్లో యోగా, సెపక్ తక్రా అంశాల్లో 15 పతకాలు సాధించిన రాష్ట్ర పోలీస్ క్రీడాకారులను డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి సోమవారం అభినందించారు. పంజాబ్‌లోని జలంధర్‌లో ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 2,770 మంది హాజరయ్యారు. రాష్ట్ర పోలీస్ క్రీడాకారులు ఐదు స్వర్ణ పతకాలు, పది కాంస్య పతకాలు సాధించారు.

నేడు, రేపు కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు

జగనన్న క్రీడా సంబరాల్లో భాగంగా..

విజయవాడ స్పోర్ట్స్ : జగనన్న క్రీడా సంబరాల్లో భాగంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రూ.50 లక్షల బహుమతితో ఈ పోటీలను ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో కబడ్డీ, వాలీబాల్, పటమట ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్, ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులో క్రికెట్ పోటీలు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. 560 మంది క్రీడాకారులు పాల్గొనే ఈ పోటీలను 140 మంది అధికారులు పర్యవేక్షిస్తారు. 21న విజేతలకు బహుమతులు అందిస్తారు.

పల్నాడులో శాంతి భద్రతలు కాపాడేలా చర్యలు చేపట్టండి

డీజీపీకి చంద్రబాబు లేఖ

సాక్షి, అమరావతి: పల్నాడు ప్రాంతంలో శాంతి భద్రతలను కాపాడేలా తగు చర్యలు చేపట్టాలని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు కోరారు. ఈ మేరకు డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి సోమవారం లేఖ రాశారు. పల్నాడు ప్రాంతంలో 2019 నుంచి హింస, హత్యా రాజకీయాలు పెరిగాయన్నారు. ఆ ప్రాంతంలో మూడున్నరేళ్లలో 16 రాజకీయ హత్యలు జరిగాయని పేర్కొన్నారు. ఈ నెల 16న మాచర్ల ఘటన విషయంలో పోలీసుల వైఫల్యం చెందారని, ఇందులో వారి భాగస్వామ్యం ఉందని ఆరోపించారు. ఘటన జరిగి 48 గంటలు గడుస్తున్నా, రాళ్ల దాడిలో ఎవరు పాల్గొన్నారనే దానిపై డీజీపీ సమాధానం చెప్పలేదన్నారు.

పోలీసు అధికారులపై చర్యలు తీసుకోండి

మాచర్ల వ్యవహారంపై మానవ హక్కుల కమిషన్‌కు టీడీపీ లేఖ

సాక్షి, అమరావతి: మాచర్లలో చోటుచేసుకున్న వ్యవహారాలపై తెలుగుదేశం పార్టీ జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఆ పార్టీ నేత వర్ల రామయ్య సోమవారం కమిషన్‌కు లేఖ రాశారు. పోలీసుల నిర్లక్ష్యంతో ఏపీలో శాంతిభద్రతలు కరువయ్యాయని పేర్కొన్నారు. అధికార పార్టీతో కొంతమంది పోలీసులు కుమ్మక్కవడంతో రాష్ట్రంలో పౌరుల రాజ్యాంగ హక్కులకు విఘాతం కలుగుతున్నదని తెలిపారు. మాచర్ల ప్రాంతంలో శాంతిభద్రతలు క్షీణించడానికి పోలీసు శాఖలోని కొంతమంది ఉన్నతాధికారులే కారణమని పేర్కొన్నారు.ఈ ఘటనలో నిర్లక్ష్యం వహించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కోర్టు కేసులంటే న్యాయస్థానం ఆదేశాల ప్రకారమే చర్యలు

సాక్షి, అమరావతి: టీచర్ల బదిలీలకు సంబంధించి కొన్ని అంశాలపై టీచర్లు న్యాయస్థానాల్లో నమోదు చేసిన కేసుల్లో కోర్టుల ఉత్తర్వులకు లోబడి చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారులు, ప్రాంతీయ సంచాలకులకు విద్యాశాఖ ఆదేశాలు ఇచ్చింది. టీచర్ల బదిలీలకు ఇటీవల పాఠశాల విద్యాశాఖ నోటిఫికేషన్ జారీచేసిన సంగతి తెలిసిందే. ఎన్‌టైటిల్ పాయింట్ల ఆధారంగా టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు చేయడానికి షెడ్యూల్‌ను విడుదల చేసింది. దీని ప్రకారం వివిధ కేటగిరీల టీచర్లకు కేటాయించే ఎన్‌టైటిల్‌మెంట్ పాయింట్లను కూడా ఖరారు చేసింది. కేటగిరీల వారీగా ఏయే టీచర్లకు ఏయే విధమైన ప్రాధాన్యతలు వర్తిస్తాయి? మినహాయింపులు ఎవరెవరికి అమలవుతాయి? తదితర అంశాలనూ పేర్కొంది. వీటిపై అభ్యంతరాలుంటే పరిష్కారానికి పైస్థాయికి విన్నవించుకోవచ్చని తెలిపింది. అయితే, ఈ నోటిఫికేషన్‌లోని పలు అంశాలు తమకు నష్టం చేకూర్చేలా ఉన్నాయంటూ పలువురు ఉపాధ్యాయులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇలా 8 అంశాల్లో 720 మంది ఉన్నత న్యాయస్థానంలో 55 కేసులు దాఖలు చేశారు. పోస్టుల కన్వర్షన్‌పై ముగ్గురు, అక్టోబర్ 14న అందించిన ఉత్తర్వులపై 625 మంది, మునిసిపల్ స్కూళ్లకు సంబంధించి 53 మంది, దివ్యాంగులకు సంబంధించి ఏడుగురు, ఎన్‌సీసీకి సంబంధించి 14 మంది, రీ అప్పోర్షన్‌మెంట్ పాయింట్లకు సంబంధించి 14 మంది రూల్ నంబర్ 8పై ఇద్దరు, ఇతర అంశాలపై ఇద్దరు కేసులు వేశారు. న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను అనుసరించి ముందుకు వెళ్లాలని అధికారులు ఆదేశాలిచ్చారు.

సత్తా చాటిన ఆంధ్రా అథ్లెట్లు

ట్రిపుల్ జంప్, డిస్కస్ త్రోలో మనమే ఫస్ట్

- బాడ్మింటన్, హాకీ, జూడో, వాలీబాల్ పోటీల్లోనూ ఏపీ జయకేతనం
- పతకాల పంట పండిస్తున్న తెలంగాణ
- ఉత్సాహంగా ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యార్థుల జాతీయ పోటీలు


వాలీబాల్ లో హిమాచల్ ప్రదేశ్ పై గెలిచిన ఆంధ్రప్రదేశ్

సాక్షి, అమరావతి: ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యార్థుల మూడో జాతీయ క్రీడా పోటీల్లో సోమవారం ఆంధ్రా విద్యార్థులు అథ్లెటిక్స్‌లో సత్తా చాటారు. విజయవాడ లయోలా కాలేజీ, గుంటూరు జిల్లాలోని నాగార్జున యూనివర్సిటీ మైదానాలలో గిరిజన బాలల క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. రన్నింగ్, బాడ్మింటన్, కబడ్డీ, హాకీ, వాలీబాల్, ఫుట్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. రెండవ రోజు క్రీడల్లో ఆంధ్రాతోపాటు తెలంగాణ క్రీడాకారులు రాణించారు. ముఖ్యంగా మెడల్స్ జాబితాలో తెలంగాణ దూసుకుపోతోంది. ఇప్పటివరకు తెలంగాణ క్రీడాకారులు వివిధ విభాగాల్లో 27 పతకాలు కైవసం చేసుకున్నారు. వీటిలో 14 స్వర్ణం, 4 రజతం, 9 కాంస్యాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ 11 పతకాలు దక్కించుకుంది. వీటిలో 2 స్వర్ణాలు, 5 రజతం, 5 కాంస్య పతకాలు ఉన్నాయి. ఓవరాల్ మెడల్స్ జాబితాలో గుజరాత్ 20 పతకాలతో రెండో స్థానంలో ఉంది. గుజరాత్‌కు 6 స్వర్ణం, 3 రజతం, 11 కాంస్య పతకాలున్నాయి.

నాగార్జున మైదానంలో..

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మైదానంలో జరిగిన అథ్లెటిక్స్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ బాలికలు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అండర్–19 బాలికల ట్రిపుల్ జంప్‌లో 9.90 మీటర్లతో రాష్ట్రానికి చెందిన డి.శ్రీజ మొదటి స్థానంలో నిలిచింది. ఇక 9.55 మీటర్లతో తెలంగాణకు చెందిన బొంత స్నేహ రెండో స్థానం, 9.30 మీటర్లతో మూడో స్థానంలో ఏపీకి చెందిన శ్రీవల్లి నిలిచింది. అండర్–14 బాలుర విభాగంలో డిస్కస్ త్రోలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచింది. 29.79 మీటర్లతో మొదటి స్థానాన్ని మన రాష్ట్రానికి చెందిన బోయ మహేంద్ర దక్కించుకోగా.. 25.99 మీటర్లతో రెండో స్థానంలో ఏపీకి చెందిన వి.సుశాంత్‌రెడ్డి, 24.53 మీటర్లతో ఉత్తరాఖండ్‌కు చెందిన రాజేశ్ చౌహాన్ మూడో స్థానంలో నిలిచారు. అండర్–19 హై జంప్ బాలుర కేటగిరీలో 1.64 మీటర్లతో ఒడిశాకు చెందిన ఎం.రంజిత్ మొదటి స్థానం, 1.64 మీటర్లతో ఒడిశాకు చెందిన హెచ్.దీపక్ కుమార్ రెండో స్థానం, 1.61 మీటర్లతో పశ్చిమ బెంగాల్‌కు చెందిన కె.అనిష్ మూడో స్థానం దక్కించుకున్నారు. అండర్–19 800 మీటర్ల రన్నింగ్ బాలుర విభాగంలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన అరుణ్ కొవచి 2.05.90 సమయంలో లక్ష్యం చేరి తొలి స్థానంలోను, 2.08.80 సమయంలో లక్ష్యం చేరి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రంజిత్ కుమార్ రెండో స్థానంలోను, 2.12.30 సమయంలో లక్ష్యం చేరి జార్ఖండ్‌కు చెందిన అలోక్ మూడో స్థానంలో నిలిచారు.

లయోలా క్రీడా మైదానంలో..

విజయవాడ లయోలా క్రీడా మైదానంలో తైక్వాండో అండర్–14 పోటీలు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. 21:23 వెయిట్ బాలుర కేటగిరీ ఫైనల్ మ్యాచ్‌లో గుజరాత్‌కు చెందిన చౌదరి స్మిత్‌కుమార్‌పై మధ్యప్రదేశ్‌కు చెందిన నర్సింగ్ టెకం విజయం సాధించారు. 23:25 వెయిట్ ఫైనల్ మ్యాచ్‌లో మహారాష్ట్రకు చెందిన రితేష్‌రాజు వడావ్‌పై మధ్యప్రదేశ్‌కు చెందిన హర్ష మేరవి విజయం సాధించారు. బాడ్మింటన్ అండర్–19 కేటగిరీ 52–56 కేజీలలో హిమాచల్‌ప్రదేశ్‌పై ఆంధ్రప్రదేశ్ గెలుపొందింది. అండర్–19 కేటగిరీ 57–60 కేజీల విభాగంలో మధ్యప్రదేశ్‌పై ఆంధ్రప్రదేశ్ గెలుపొందింది. హాకీ బాలుర 7వ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్–కర్ణాటక మ్యాచ్‌లో 1–0 తేడాతో ఆంధ్రప్రదేశ్ గెలిచింది. జూడో (బాలికలు) అండర్–14 కేటగిరీ ఫ్రీస్టయిల్ 39, 42, 46 విభాగాల్లో జరిగిన మ్యాచ్‌ల్లో ఆంధ్రప్రదేశ్ బాలికలు విజయం సాధించారు. వాలీబాల్ పోటీల్లోనూ హిమాచల్‌ప్రదేశ్‌పై ఏపీ జట్టు విజయకేతనం ఎగురవేసింది.

విభజన సమస్యల పరిష్కారంలో కేంద్రం విఫలం

రాజ్యసభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీనేత విజయసాయిరెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి ఎనిమిదేళ్లు కావస్తున్నా రెండు రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న ఆస్తుల పంపకాల సమస్యను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి విమర్శించారు. ఆస్తుల పంపిణీ సమస్యను పరిష్కరించాలని ఏపీ సర్కార్ ఎన్ని విజ్ఞప్తులు చేసినా సాచివేత ధోరణి అనుసరిస్తూ వస్తోందన్నారు. దీంతోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. ద్రవ్య వినిమయ బిల్లుపై సోమవారం రాజ్యసభలో జరిగిన చర్చలో విజయసాయిరెడ్డి మాట్లాడారు.

12 ఏళ్లనాటి ధరలతో పోలవరం ఎలా సాధ్యం?

2010–11 నాటి ధరలకు అనుగుణంగా పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని.. ఇది ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. అప్పటి ధరలతో పనులు చేయడానికి ఏ కాంట్రాక్టరు అయినా ముందుకు వస్తాడా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంపట్ల కేంద్రం సవతి తల్లి వైఖరిని అవలంబిస్తోందని విజయసాయిరెడ్డి విమర్శించారు.

ప్రభుత్వ ఎరువుల పరిశ్రమలను ఎలా ప్రైవేటీకరిస్తారు?

ఈ ద్రవ్య వినిమయ బిల్లుల్లో అనుబంధ పద్దుల కింద ఎరువుల సబ్సిడీ కోసం కేంద్ర ప్రభుత్వం లక్షా 9 వేల కేటాయింపులు కోరుతోందని.. ఇందులో దాదాపు నాలుగో వంతు నిధులు ఎరువుల దిగుమతి కోసం ఉద్దేశించినవేనని విజయసాయిరెడ్డి అన్నారు. లాభాలలో నడుస్తున్న ఎనిమిది ప్రభుత్వ రంగ ఎరువుల తయారీ పరిశ్రమలను ప్రైవేటీకరించాలన్న ప్రభుత్వం నిర్ణయం ఏ విధంగా సబబని విజయసాయిరెడ్డి ప్రశ్నించారు.

ఈ పరిస్థితులు బడ్జెట్ నాటికే ఉన్నాయి కదా..

బడ్జెట్లో కేటాయింపులకు అదనంగా ఖర్చులు వచ్చినపుడు అనుబంధ పద్దుల ద్వారా వాటిని ఆమోదించుకునే అవకాశం రాజ్యాంగంలోని ఆర్టికల్ 115 కల్పిస్తోందన్నారు. ఆర్థికమంత్రి కూడా ఇదే నిబంధనను ఉటంకిస్తూ దేశంలో ఉత్పన్నమయ్యే పరిస్థితులకు అనుగుణంగా స్పందించేందుకే ఈ అనుబంధ ఖర్చులను ప్రతిపాదిస్తున్నట్లు చెప్పారని.. అనుబంధ పద్దులలో అత్యధిక మొత్తాలు ఆహారం, ఎరువులు, ఇంధనం కోసం ఖర్చుచేయబోతున్నట్లు తెలిపారన్నారు. కానీ, బడ్జెట్‌లోనే ఈ మూడు రంగాలకు తగినంత కేటాయింపులు చేసే అవకాశం, పరిస్థితి ఉన్నా బడ్జెట్ మార్గం వదిలేసి అనుబంధ పద్దుల రూపంలో ఖర్చులకు నిధులు అడగడం సరైన పద్ధతి కాదన్నారు.

క్షీణిస్తున్న తలసరి జీడీపీ

జీడీపీ విషయంలో దేశం యూకేను అధిగవించినట్లుగా ఆర్థికమంత్రి చెబుతున్నారని.. కానీ, తలసరి జీడీపీలో భారత్ ప్రపంచంలో 145వ స్థానంలో ఉందని విజయసాయిరెడ్డి అన్నారు. అదే యూకే 22వ స్థానంలో ఉందని, అంటే 67 కోట్ల జనాభా ఉన్న బ్రిటీషర్ల ఆర్థిక ఉత్పాదన 140 కోట్ల మంది భారతీయుల ఆర్థిక ఉత్పాదన కంటే ఎంతో ముందంజలో ఉన్నట్లేగా అని విజయసాయిరెడ్డి అన్నారు.

కేంద్రంలో భర్తీకాని ఉద్యోగ ఖాళీలు లక్షల్లో..

దేశంలో అత్యధికంగా ఉద్యోగులు కలిగి ఉన్న రైల్వే, రక్షణ, హోం మంత్రిత్వ శాఖల్లో 7 లక్షల ఉద్యోగాలు భర్తీకాకుండా ఖాళీగా ఉన్నాయని విజయసాయిరెడ్డి వివరించారు. దీని పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో వివరించాలని ఆయన కోరారు.

చిదంబరానికి సూటి ప్రశ్నలు

అంతకుముందు.. ఈ బిల్లుపై చర్చలో పాల్గొంటూ కాంగ్రెస్ సభ్యుడు పి. చిదంబరం పేర్కొన్న కొన్ని విషయాలపై విజయసాయిరెడ్డి వివరణ కోరారు. 2013 నవంబర్‌లో దేశంలో ద్రవ్యోల్బణం 19.93 శాతానికి చేరిన విషయాన్ని చిదంబరం ఎలా దాచిపెడతారని ప్రశ్నించారు. యూపీఏ–1 పాలనలో సగటు ద్రవ్యోల్బణం 5.8 శాతం, యూపీఏ–2 లో 10.4 శాతం ఉండగా ప్రస్తుతం అది 4.7 శాతం మాత్రమే ఉన్నది వాస్తవం కాదా అన్నారు. కోవిడ్ కారణంగా కుదేలైన పారిశ్రామిక రంగానికి ఉపశమనం కల్పించేందుకే ప్రభుత్వం కార్పొరేట్ ట్యాక్స్‌ను తగ్గించిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

రాష్ట్రానికి ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డులు

- మొత్తం ఆరు అవార్డులు దక్కించుకున్న ఏపీ
- సుపరిపాలన – పారదర్శక సేవలకు పురస్కారం
- మరో రెండు రాష్ట్ర స్థాయి గోల్డ్ అవార్డులు


ఢిల్లీలో అవార్డును అందుకుంటున్న సెర్ప్ అధికారులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సుపరిపాలన – పారదర్శక పౌర సేవలు అందిస్తున్నందుకు, గ్రామీణ ప్రాంతాల్లో పొదుపు సంఘాల ద్వారా పేదరిక నిర్మూలనకు చేపడుతున్న కార్యక్రమాలకు ఈ ఏడాది రాష్ట్రానికి మొత్తం ఆరు స్కోచ్ అవార్డులు దక్కాయి. సోమవారం ఢిల్లీలో స్కోచ్ గ్రూప్ నిర్వహించిన జాతీయస్థాయి సదస్సులో రాష్ట్ర అధికారులు ఈ ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాల ద్వారా మహిళలకు పెద్ద ఎత్తున ఆర్థిక సాయం అందజేస్తున్న సంగతి తెలిసిందే. పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకుల నుంచి పెద్ద మొత్తంలో రుణాలు ఇప్పిస్తోంది. అంతేకాక ఆయా కుటుంబాలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగానూ చర్యలు చేపట్టింది. తద్వారా మహిళలు ఆర్థికంగా తమ కాళ్ల మీద నిలబడుతున్నారు. బ్యాంకులకు సకాలంలో రుణాలు చెల్లిస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామీణాభివృద్ధి శాఖకు 5 స్కోచ్ అవార్డులు దక్కడంపై అధికారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పారదర్శక పౌర సేవలు..

దేశంలోనే ఆదర్శవంతంగా సుపరిపాలన – పారదర్శక పౌర సేవలు అందిస్తున్నందుకు రాష్ట్రానికి స్కోచ్ అవార్డు లభించింది. గుడ్ గవర్నెన్స్ అండ్ పబ్లిక్ సర్వీసెస్ కేటగిరీలో 2021–22కి ఏపీ ప్రథమ స్థానంలో నిలిచింది. న్యూఢిల్లీలో స్కోచ్ గ్రూప్ చైర్మన్ సమీర్ కొచర్ చేతుల మీదుగా సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య ఈ అవార్డును అందుకున్నారు.

బ్యాంకు లింకేజీకి గోల్డ్ అవార్డు..

పొదుపు సంఘాల మహిళలు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకొని కుటుంబ ఆదాయాలను పెంచుకోవడానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. ఇందుకు గాను స్కోచ్ సంస్థ రాష్ట్రాన్ని గోల్డ్ అవార్డుకు ఎంపిక చేసింది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సీఈవో ఇంతియాజ్ అహ్మద్, డీజీఎం కేశవ కుమార్ అవార్డును అందుకున్నారు.

స్త్రీనిధి కార్యక్రమాలకు మరో గోల్డ్ అవార్డు..

సెర్ప్‌కు అనుబంధంగా పనిచేస్తున్న స్త్రీనిధి సంస్థ బ్యాంకులతోపాటు పొదుపు సంఘాల మహిళలకు అదనంగా, అత్యంత సులభ విధానంలో 48 గంటల్లోనే బ్యాంకు రుణాలను అందిస్తోంది. ఇందుకుగాను స్కోచ్ మరో గోల్డ్ అవార్డును ప్రకటించింది. స్త్రీనిధి ఎండీ కె.వి.నాంచారయ్య, డిప్యూటీ జీఎం సిద్ధి శ్రీనివాస్ ఈ అవార్డును అందుకున్నారు.

జిల్లాలకు మూడు సిల్వర్ అవార్డులు..

పొదుపు సంఘాల విజయగాథలను 'మహిళా నవోదయం' పేరుతో ప్రతి నెలా ప్రత్యేక మాస పత్రిక రూపంలో ప్రచురించడంపై చిత్తూరు జిల్లా డీఆర్‌డీఏ విభాగానికి ప్రత్యేక సిల్వర్ అవార్డు దక్కింది. అలాగే నిరుద్యోగ యువత స్వయం ఉపాధికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడంలో ప్రత్యేక చొరవ తీసుకుంటున్నందుకు చిత్తూరు డీఆర్‌డీఏకు మరో సిల్వర్ అవార్డు దక్కింది. అదేవిధంగా పొదుపు సంఘాల నుంచి తీసుకున్న రుణాలతో మహిళలు పెద్ద ఎత్తున నాటుకోళ్ల పెంపకం ద్వారా అధిక ఆదాయం పొందుతున్నారు. దీనికి నెల్లూరు జిల్లా డీఆర్‌డీఏ విభాగానికి ప్రకటించిన సిల్వర్ అవార్డు లభించింది.

'స్కిల్' లూటీ కేసులో బాబు సన్నిహితుడి విచారణ

బిల్లుల చెల్లింపుపై లక్ష్మీనారాయణను ప్రశ్నించిన ఈడీ

- షెల్ కంపెనీల ద్వారా రూ.241 కోట్లు తరలించిన టీడీపీ పెద్దలు
- వేగం పుంజుకున్న కేసు విచారణ

సాక్షి, అమరావతి: చంద్రబాబు సర్కారు హయాంలో చోటు చేసుకున్న ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణంలో విచారణను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) వేగవంతం చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన నాటి ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ కె.లక్ష్మీనారాయణను ఈడీ అధికారులు హైదరాబాద్‌లో సోమవారం విచారించారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అయిన లక్ష్మీనారాయణ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు. లక్ష్మీనారాయణను ఈడీ అధికారులు దాదాపు ఏడు గంటలపాటు సుదీర్ఘంగా విచారించడం ప్రాధాన్యత సంతరించుకుంది. సీమెన్స్ కంపెనీతో ఒప్పందం ముసుగులో ప్రజాధనాన్ని కొల్లగొట్టిన తీరుపై ఆయన్ను ప్రధానంగా ప్రశ్నించినట్లు సమాచారం. దాదాపు రూ.3,300 కోట్ల విలువైన ప్రాజెక్టులో ఒప్పందం ప్రకారం 90 శాతం ఖర్చు చేయాల్సిన సీమెన్స్ కంపెనీ ఒక్క రూపాయి కూడా వెచ్చించకుండానే టీడీపీ సర్కారు రూ.371 కోట్ల బిల్లులను చెల్లించింది. అందులో రూ.241 కోట్లను షెల్ కంపెనీల ముసుగులో టీడీపీ పెద్దల ఖాతాల్లోకి తరలించారు. నిబంధనలకు విరుద్ధంగా సీమెన్స్ కంపెనీ పేరిట బిల్లులు ఎలా చెల్లించారని ఈడీ అధికారులు లక్ష్మీనారాయణను నిశితంగా విచారించినట్లు సమాచారం. షెల్ కంపెనీల పేరిట మనీ ల్యాండరింగ్‌కు పాల్పడటంపై కూడా ఈడీ అధికారులు గుచ్చి గుచ్చి ప్రశ్నించినట్టు అధికారవర్గాలు తెలిపాయి.

పెదబాబు, చినబాబే సూత్రధారులుగా..

కాగితాలపై ప్రాజెక్టును చూపించి టీడీపీ ప్రభుత్వ పెద్దలు రూ.241 కోట్లు కాజేయడంపై ఈడీ దర్యాప్తు జోరందుకుంది. సీమెన్స్ కంపెనీతో రూ.3,300 కోట్ల విలువైన ప్రాజెక్టు పేరిట కథ నడిపించి రూపాయి కూడా పెట్టుబడి రాకుండా, అసలు ప్రాజెక్టే లేకుండా రూ.241 కోట్ల బిల్లులు చెల్లించేశారు. ఏపీఎస్ఎస్‌డీసీకి అప్పటి సీఎం చంద్రబాబు చైర్మన్‌గా ఉండగా నాటి ఐటీ శాఖ మంత్రిగా లోకేశ్ ఉండటం గమనార్హం. దీన్నిబట్టి ఈ కుంభకోణం వెనుక ఎవరి పాత్ర ఉందన్నది స్పష్టమవుతోంది. ప్రభుత్వం పది శాతం నిధులను సమకూరిస్తే సీమెన్స్, డిజైన్ టెక్ సంస్థలు 90 శాతం పెట్టుబడి పెడతాయని ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే ఈ ప్రాజెక్టు గురించి సీమెన్స్ కంపెనీకి అసలు తెలియదు. భారత్‌లో గతంలో కంపెనీ ఎండీగా వ్యవహరించిన సుమన్‌బోస్ అలియాస్ సౌమ్యాద్రి శేఖర్‌బోస్‌తోపాటు టీడీపీ పెద్దలు డిజైన్‌టెక్‌తో కలిసి కథ నడిపించారు. సీమెన్స్ సంస్థ ఒక్క రూపాయి ఖర్చు చేయకపోయినా చంద్రబాబు ఆదేశాలతో అప్పటి ముఖ్య కార్యదర్శి పీవీ రమేశ్ ప్రభుత్వ వాటాగా రూ.371 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీఎస్ఎస్‌డీసీ'కి అప్పట్లో ఎండీగా ఉన్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కె.లక్ష్మీనారాయణ, ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న గంటా సుబ్బారావు ఈ కుంభకోణంలో కీలకంగా వ్యవహరించారు. సాఫ్ట్‌వేర్, పరికరాల కోసం సీమెన్స్ కంపెనీకి రూ.130 కోట్లు చెల్లించి మిగిలిన రూ.241 కోట్లను నకిలీ ఇన్‌వాయిస్‌తో పలు షెల్ కంపెనీల ద్వారా విదేశాల్లోని ఖాతాల్లోకి మళ్లించారు. తద్వారా చంద్రబాబు సన్నిహితులు మనీ ల్యాండరింగ్‌కు పాల్పడినట్లు ఈడీ నిర్ధారించింది. ఈ కుంభకోణంలో పాత్రధారులుగా వ్యవహరించిన కె.లక్ష్మీనారాయణ, గంటా సుబ్బారావు, ఓఎస్డీ నిమ్మగడ్డ వెంకట కృష్ణప్రసాద్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ కె.ప్రతాప్‌కుమార్, షెల్ కంపెనీల ప్రతినిధులతో సహా మొత్తం 26 మందికి ఈడీ ఇటీవల నోటీసులు జారీచేసింది. షెల్ కంపెనీల ప్రతినిధులను ఈడీ అధికారులు ఇటీవల విచారించారు. తాజాగా లక్ష్మీ నారాయణను పలు కోణాల్లో విచారించడం ద్వారా ఈ కేసును ఈడీ ఎంత తీవ్రంగా పరిగణిస్తోందో స్పష్టమవుతోంది. ఈ కేసులో ఈడీ మరింత దూకుడుగా వ్యవహరించనున్నట్లు పరిశీలకులు భావిస్తున్నారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

రాజ్యసభ

విశాఖలో డ్రోన్ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలి

రాజ్యసభలో కేంద్రానికి వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో వ్యవసాయంతోపాటు అనేక రంగాల్లో డ్రోన్ పరిజ్ఞానం వినియోగం పెరుగుతున్న దృష్ట్యా డ్రోన్ టెక్నాలజీపై మరింత విస్తృత పరిశోధనలు జరిపేందుకు విశాఖపట్నంలో జాతీయస్థాయి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయన సోమవారం రాజ్యసభలో జీరో అవర్‌లో మాట్లాడారు. నాలుగో పారిశ్రామిక విప్లవంలో ఆవిష్కృతమైన అత్యంత కీలక సాంకేతిక పరిజ్ఞానాల్లో డ్రోన్ టెక్నాలజీ ఒకటని చెప్పారు. ఈ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన తర్వాత వ్యవసాయం, రక్షణ, రవాణా తదితర రంగాల్లో డ్రోన్ల వినియోగం బాగా పెరిగిందన్నారు. డ్రోన్ టెక్నాలజీ సాయంతో రైతులు తక్కువ శ్రమతో పంట దిగుబడులను 15 శాతం వరకు పెంచే అవకాశం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 65 శాతం జనాభా వ్యవసాయంపైనే ఆధారపడ్డారని, వ్యవసాయ రంగంలో కొత్త పరిశోధనలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి సాగులో ప్రయోగాలకు రాష్ట్ర రైతులు ఎప్పుడూ ముందుంటారని తెలిపారు. ఆహార ధాన్యాలతోపాటు పండ్లు, కూరగాయల సాగులో అగ్రస్థానంలో ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటని, రైతులు క్రమేణ ఆయిల్‌పామ్ సాగువైపునకు కూడా మళ్లుతున్నారని చెప్పారు.

పోలవరం చెల్లింపుల్లో జాప్యం లేదు

పోలవరం ప్రాజెక్టు పనుల నిమిత్తం ఖర్చుచేసిన సొమ్మును కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు తిరిగి చెల్లిస్తోందని కేంద్ర జలశక్తి శాఖ సహాయమంత్రి బిశ్వేశ్వర్ తుడు చెప్పారు. 2014 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది అక్టోబర్ వరకు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.15,970.53 కోట్లు ఖర్చు చేసినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు జవాబిచ్చారు. ఈ మొత్తంలో ఆమోదయోగ్యమైనవిగా గుర్తించిన బిల్లులకు రూ.13,226 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పనుల బిల్లుల్ని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) తనిఖీ చేసి వాటి చెల్లింపులకు సిఫార్సు చేసిన అనంతరం కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని చెప్పారు. పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు ఆర్థికశాఖ ద్వారా నిధులు మంజూరు చేయాలని 2016 సెప్టెంబర్ 30న ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. అయితే ఆఫీసు మెమొరాండం ప్రకారం కేంద్ర ప్రభుత్వం 2014 ఏప్రిల్ 1 నుంచి కేవలం ఇరిగేషన్ కాంపొనెంట్ కింద అయిన ఖర్చు మాత్రమే భర్తీచేయాల్సి ఉందన్నారు.

ఇథనాల్ స్టాకు పెంపు నిరంతర ప్రక్రియ

పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపాల్సిన అవసరం దృష్ట్యా దేశవ్యాప్తంగా ఇథనాల్ నిల్వల సామర్థ్యం పెంపు అనేది నిరంతర ప్రక్రియ అని కేంద్ర పెట్రోలియం శాఖ సహాయమంత్రి రామేశ్వర్ తేలి చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. 2020–21లో దేశీయ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు) పెట్రోల్‌లో 10 శాతం ఇథనాల్ కలిపినట్లు తెలిపారు.

2024 మార్చికల్లా కుళాయి కనెక్షన్లు

ఏపీలోని 95.69 లక్షల గ్రామీణ కుటుంబాల్లో 64.07 లక్షల (66.96 శాతం) కుటుంబాలకు ఈ నెల 13వ తేదీనాటికి కుళాయి కనెక్షన్ల ద్వారా తాగునీరు అందించినట్లు కేంద్ర జలశక్తి శాఖ సహాయమంత్రి ప్రహ్లాద్‌సింగ్ పటేల్ తెలిపారు.వైఎస్సార్‌సీపీ ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

మూడు ప్రాంతాల నుంచి ఉడాన్ సేవలు

ఉడాన్ విమానాల సేవల నిమిత్తం ఏపీలోని కడప, కర్నూలుతోపాటు ప్రకాశం బ్యారేజీలోని వాటర్‌ఏరోడ్రోమ్ గుర్తించామని కేంద్ర పౌరవిమానయాన శాఖ సహాయమంత్రి వి.కె.సింగ్ తెలిపారు. కడప, కర్నూలు విమానాశ్రయాల నుంచి ఇప్పటికే సేవలు ప్రారంభమయ్యాయని వైఎస్సార్‌సీపీ ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు ప్రశ్నకు జవాబిచ్చారు. ప్రకాశం బ్యారేజీ నుంచి నిర్వహణపై సాధ్యాసాధ్యాల అధ్యయనం పూర్తయిందని తెలిపారు.

ఐదేళ్లలో 2,943.53 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా

రైల్వే ఐదేళ్లలో 2,943.53 మిలియన్ టన్నుల బొగ్గును రవాణా చేసిందని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి ప్రశ్నకు జవాబిచ్చారు.

పట్టణాలను స్మార్ట్‌సిటీ మిషన్‌లో చేర్చే ప్రతిపాదన లేదు

ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణాలుసహా వేటినీ స్మార్ట్‌సిటీ మిషన్‌లో చేర్చే ప్రతిపాదన లేదని కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ సహాయమంత్రి కౌశల్ కిషోర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ బీద మస్తానరావు ప్రశ్నకు సమాధానమిచ్చారు.

పైపులైను పనుల గడువు పొడిగించాలని కోరిన ఐఎంసీ

కాకినాడ–విజయవాడ–నెల్లూరు పైపులైను పనులు 2021 మార్చికల్లా పూర్తిచేయాల్సి ఉందని, కానీ గడువును 2024 మార్చి వరకు పొడిగించాలని ఇండియన్ మొలాసెస్ సంస్థ (ఐఎంసీ) కోరిందని కేంద్ర పెట్రోలియం సహజవనరులశాఖ సహాయమంత్రి రామేశ్వర్ తేలి.. వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు జవాబిచ్చారు.

భోగాపురం ఎయిర్‌పోర్టుకు 2,160.47 ఎకరాలు సేకరించిన ఏపీ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం అభివృద్ధిని చేపట్టిందని కేంద్ర పౌరవిమానయాన శాఖ సహాయ మంత్రి జనరల్ వి.కె.సింగ్ తెలిపారు. విమానాశ్రయ అభివృద్ధికి సుమారు 2,203 ఎకరాల భూమి అవసరమని తెలిపారు. ఇప్పటికే ఏపీ ప్రభుత్వం 2,160.47 ఎకరాల భూమి సేకరించిందని చెప్పారు. గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్స్ పాలసీ–2008 ప్రకారం.. గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్ట్ అమలు బాధ్యత సంబంధిత విమానాశ్రయ డెవలపర్ లేదా రాష్ట్ర ప్రభుత్వంపై ఉంటుందని తెలిపారు. విమానాశ్రయ ప్రాజెక్ట్‌ల పూర్తి అనేది భూసేకరణ, తప్పనిసరి అనుమతుల లభ్యత వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుందని టీడీపీ సభ్యుడు రవీంద్రకుమార్ ప్రశ్నకు జవాబిచ్చారు.

లోక్‌సభ

ఏపీలో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో 'నాడు–నేడు'లో 9,233 కిచెన్–కమ్–స్టోర్లు

లోక్‌సభలో కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో నాడు–నేడు పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.207.59 కోట్ల ప్రత్యేక నిధులతో 9,233 కిచెన్–కమ్–స్టోర్లు మంజూరు చేసిందని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి అన్నపూర్ణాదేవి చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు.

ఏపీ కేవీల్లో 698 ఖాళీలు

ఆంధ్రప్రదేశ్‌లోని కేంద్రీయ విద్యాలయాల్లో (కేవీల్లో) 698 ఖాళీలున్నాయని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి అన్నపూర్ణాదేవి తెలిపారు. ఖాళీల భర్తీ నిరంతర ప్రక్రియలా సాగుతుందని వైఎస్సార్‌సీపీ ఎంపీలు మద్దిళ్ల గురుమూర్తి, కోటగిరి శ్రీధర్ ప్రశ్నకు జవాబిచ్చారు.

9 లక్షల మంది విదేశాలకు

విదేశీ వ్యవహారాలశాఖ సమాచారం మేరకు 1.1.2016 నుంచి 18.3.2021 వరకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుమారు 9 లక్షలమంది విదేశాలకు వెళ్లినట్లు కేంద్ర నైపుణ్యాభివృద్ధిశాఖ సహాయమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ గోరంట్ల మాధవ్ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

ఎస్ఎఫ్ఐవోలో 150 ఖాళీలు

సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐవో)లో 150 ఖాళీలున్నాయని కేంద్ర స్టాటిస్టిక్స్, ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్‌శాఖ సహాయమంత్రి రావు ఇందర్‌జిత్ సింగ్ తెలిపారు. దేశవ్యాప్తంగా 92 కేసులను ఎస్ఎఫ్ఐవో దర్యాప్తు చేస్తోందని వైఎస్సార్‌సీపీ ఎంపీలు గొడ్డేటి మాధవి, తలారి రంగయ్య ప్రశ్నకు జవాబిచ్చారు.

ఏపీలో టైగర్ ప్రాజెక్టుకు రూ.6.73 కోట్లు

ఏపీలో టైగర్ ప్రాజెక్టుకు 2019–20నుంచి 2021–22 వరకు రూ.6.73 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పులశాఖ సహాయమంత్రి అశ్వినీకుమార్ చౌబే తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

పీఎం ఆది ఆదర్శగ్రామ యోజన నిధులు విడుదల చేయలేదు

ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజన ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి 2021–22, 2022–23లో ఇప్పటివరకు పీఎం ఆది ఆదర్శగ్రామ యోజన నిధులు విడుదల చేయలేదని కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖ సహాయమంత్రి రేణుక సింగ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ చింతా అనూరాధ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

ఏపీలో 47 విదేశీసంస్థల స్థలాల నమోదు

ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఏడాది సెప్టెంబర్ వరకు 47 విదేశీసంస్థలు తమ స్థలాలు నమోదు చేయించుకుని క్రియాశీలంగా ఉన్నాయని కేంద్ర స్టాటిస్టిక్స్, ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్‌శాఖ సహాయమంత్రి రావు ఇందర్‌జిత్ సింగ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రశ్నకు జవాబిచ్చారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.